www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 04 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ కార్తీక బహుళ పక్షము
04-10 డిసెంబర్ 2023
వెల : ₹20/-



# బడిలో రామాయణ, భారతాలు

ఉన్నతస్థాయి కమిటీ రామాయణ, మహాభారతాలను పాఠశాల స్థాయి పాఠ్యప్రణాళికలో చేర్చాలని సిఫారసు చేయడం ప్రస్తుతం పెద్ద చర్చకు దారితీసింది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యూ.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# సర్వే భవంతు సుఖినః



ప్రధానమంత్రిగా అన్ని వర్గాల హితాన్ని కోరుతూ, అందరినీ సమానంగా చూస్తున్న నరేంద్ర మోదీ వ్యక్తిగతంగా మాత్రం మనసా, వాచా, కర్మణా హిందువునేనని ఎటువంటి శషభిషలు లేకుండా ప్రకటిస్తుంటారు. తెలంగాణ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని మోదీ తిరుమలలో వెంకన్నను కూడా దర్శించుకుని, 140 కోట్ల మంది జనాభా ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖంగా, సంతోషంగా ఉండాలని ఆ వేంకటేశ్వరుడిని కోరుకున్నట్టు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆలయ సందర్శన సందర్భంగా ఆయన చిన్న శేషవాహనం ఎదుట నిల్చున్నప్పుడు ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాలో బంధించిన చిత్రం ఇది.




# సంక్షోభాల ఫలితం ఏమిటో చెప్పిన నవలకు 'బుకర్'

ఏటా సృజనాత్మక సాహిత్యానికి ఇచ్చే బుకర్ పురస్కారం 2023 సంవత్సరానికి ఐర్లండ్ రచయిత పాల్ లించ్ రాసిన 'ప్రోఫెట్ సాంగ్' నవలను వరించింది. రాజకీయ, సామాజిక పరిస్థితులు అస్థిరంగా ఉన్న ఒక సమాజం భవిష్యత్తులో ఎదుర్కొనబోయే నియంతృత్వాన్ని ఊహిస్తూ రాసిన ఈ నవల ఆ ప్రపంచ స్థాయి పురస్కారానికి ఎంపికయింది. ఇంతకు ముందు ఈ పురస్కారానికి ఎంపికైన సల్మాన్ రష్దీ, మార్గరెట్ అట్‌వుడ్, హిలారీ మేంటిల్ కూడా ఐర్లండ్‌కు చెందినవారే.

ప్రజాస్వామ్యాలు అపహాస్యానికి గురి అవుతున్న కాలమిది. హక్కుల పేరుతో, మైనారిటీ వాదం పేరుతో సమాజాలు సంక్షోభంలోకి వెళ్లిపోతున్న ఒక క్లిష్టసమయమిది. అవి పెచ్చరిల్లితే వ్యవస్థలు ఎలాంటి దుస్థితికి చేరతాయో ప్రపంచంలో కొన్ని దేశాలలో జరిగినదానిని బట్టి ఇప్పటికే మనమంతా గమనించాం కూడా. ఈ మొత్తం పరిణామాలను చిత్రించడానికి ప్రయత్నించిన నవల ప్రోఫెట్ సాంగ్. సంక్షుభిత పరిస్థితులలో ఉన్న ఐర్లండ్‌లో అంతర్యుద్ధం వస్తుందని, అది అక్కడ నుంచి కుటుంబాలు వలసపోయే పరిస్థితులు కల్పిస్తుందని ఊహిస్తూ రచయిత ఈ నవల రాశారు. ఐర్లండ్‌లో ప్రముఖ నగరం డబ్లిన్. మరొక డబ్లిన్ రచయిత తన నవల కోసం సృష్టించి అదే కేంద్రంగా ఇతివృత్తం నడిపించారు. అక్కడ నెలకొల్పిన రహస్య పోలీసు వ్యవస్థ కారణంగా నియంతృత్వం దిశగా వ్యవస్థ వెళుతుంది. ఇందులో కథానాయిక ఐలిష్ స్టాక్స్ ఒక మైక్రోబయాలజిస్ట్. ఆమె తన నలుగురు పిల్లలతో పాటు తండ్రిని కూడా చూసుకుంటూ ఉంటుంది. అంతర్యుద్ధం చెలరేగడంతో ఆమె భర్త కనిపించకుండా పోయాడు. అతడు ఐర్లండ్ ఉపాధ్యాయ సంఘంతో సంబంధం ఉన్న ఉన్నతోద్యోగి.

ఒకరోజు రహస్య పోలీస్ వచ్చి వారి ఇంటి తలుపు తట్టడంతో ఆయన అజ్ఞాతవాసానికి వెళ్లిపోయాడు. ఉద్యోగ సంఘాలతో ప్రమేయం ఉన్న మీ భర్తను విచారించడానికి వస్తున్నామని ఇద్దరు రహస్య పోలీసులు ఐలిష్ స్టాక్స్‌కు కబురు పెడతారు. ఆ పరిస్థితులలో పోలీసుల ఆదేశాలను ఆమె ఎలా స్వీకరించిందో చెప్పారు రచయిత.

ఒక దేశంలో అశాంతి, ఒక కుటుంబం ఎదుర్కొన్న ఉత్పాతాల గురించి ఈ నవల చెబుతుంది.  కాగా, అలాంటి నిరంకుశ పాలనలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ఒక మహిళ పడిన తపన ఇందులో ఆవిష్కరించారు రచయిత. ఆ క్రమంలో రచయిత తన రచనా క్రమంలో చూపించిన ఉద్విగ్నత ప్రశంసనీయంగా ఉందని బుకర్ న్యాయనిర్ణేతలు వ్యాఖ్యానించారు. పాల్ ఈ నవలలో తీసుకున్న ఇతివృత్తం కాలాతీతమైనదని కూడా వారు అన్నారు. అంతేకాదు, ఈ క్షణంలో మన అనుభవంలో ఉన్న సామాజిక, రాజకీయ ఉద్వేగాలు ఇందులో ఉన్నాయని చెప్పారు.

పాల్ గతంలో సండే ట్రిబ్యూన్ పత్రికకు సినీ విమర్శకునిగా పనిచేశారు. దారుణ నియంతృత్వం ఏర్పడితే పరిస్థితులు ఎలా ఉంటాయో ప్రజలకు తెలియచేయడమే ధ్యేయంగా ఈ నవల రాసినట్టు ఆయన చెప్పారు. అయితే వాస్తవితను దృష్టిలో పెట్టుకుని మాత్రమే తాను నవలను పాఠకుల ముందుకు తెచ్చానని ఆయన ప్రకటించారు. తనకు ఈ నవల రాయడానికి ఐదేళ్లు పట్టిందని చెప్పారాయన.ఇది పాల్ రాసిన ఐదో నవల. నిజానికి పశ్చిమ దేశాల ప్రజాస్వామ్య వ్యవస్థలలో నానాటికీ పెరుగుతున్న అశాంతిని చిత్రించడం పాల్ ఉద్దేశం. సిరియా పరిణామాల తరువాత వచ్చిన మార్పు ఇది. అందుకే నిరంకుశ పాలన గురించి వినడం కాకుండా, అది ఎలా ఉంటుందో అనుభవానికి వచ్చినట్టే పాఠకులు అనుభూతి చెందేటట్టు చేయడానికే తాను ప్రయత్నించానని పాల్ చెప్పుకున్నారు. నిజానికి పెరుగుతున్న ఉగ్రవాదం వ్యవస్థలను ఎలాంటి దుస్థితికి తీసుకువెళుతుందో చెప్పడమే పాల్ ఉద్దేశమని, ఆయన ప్రస్తుతం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మేనూత్ విశ్వవిద్యాలయ ప్రముఖులు పేర్కొన్నారు.

లిమరెక్‌లో జన్మించిన పాల్ కంట్రీ డొనెగల్‌లో పెరిగారు. సృజనాత్మక రచయితగా ఆయన రెడ్ స్కై ఇన్ దిమార్నింగ్ (2013), ది బ్లాక్ స్నో (2014) ఇటీవలే వెలువరించారు. వీటితో ఆయనకు చాలా గుర్తింపు వచ్చింది.



పాల్ లించ్

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/-** (వారానికి రూ. 12/-) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/- చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/- చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

**- సర్క్యులేషన్ మేనేజర్**

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి — అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్ — **9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

**హిం**దూ, హిందూత్వం, హిందూయిజం.. ఈ మూడు పదాల మీద చర్చ ఇప్పటిది కాదు. ఈ పదాల మీద ఇంత చర్చకు కారణం, అంత పురాతన జీవన విధానాన్ని నిర్వచించడానికి ఆ మాత్రం చర్చ, సమయం అవసరమేనని ఏ కొందరో భావించడం కానేకాదు. ఆ చర్చ మేధోపరమైనది కాదు. సామాజిక శాస్త్ర పరిధిలోది అంతకంటే కాదు.ఆ పదాల అర్థాలు, భావనను ఎంత గందర గోళంలోకి నెట్టగలరో అంత గందరగోళంలోకి నెట్టడమే కొందరికి కావాలి. హిందూ శబ్దాన్ని, దానితో ముడిపడి ఉన్న వ్యవస్థలను, మొత్తంగా ఆ జీవన విధానాన్ని అవమానపరిచే ప్రక్రియ శతాబ్దాలుగా సాగేటట్టు చూడడం మరొకటి. హిందూత్వం లేదా హిందూయిజం అనే రెండు పదాలను ఎవరు ఎన్నికల ప్రసంగాలలో ప్రయోగించినా దానిని నిందార్హంగా పరిగణించనక్కరలేదని కోర్టులు చెప్పాయి. హిందూత్వం అన్నంత మాత్రాన అందులో హిందూ 'ఫండమెంటలిజం' వెతకనక్కరలేదని కూడా అవి చెప్పాయి. కానీ ఇక్కడ కోర్టుల ఎడల మన్నన ఎంతో తెలియనిది కాదు. వాటి తీర్పులను రాజకీయాల కోసం ఉపయోగించుకునే తీరు రహస్యం కాదు. తీర్పులు కూడా బుజ్జగింపు రాజకీయాల పాల్పడినవే. హిందూయిజం అనేది సనాతన ధర్మానికీ, సహిష్ణుతకీ మూలమైన మతమని, హిందూత్వ అంటే విభజన రాజకీయాలు చేసేదని కొందరు అంగుష్టమాత్ర నాయకులు స్వకపోల కల్పిత భాష్యాలు వెలగబెట్టడమే ఇందుకు రుజువు.

ఈ నేపథ్యంలో హిందూయిజం అన్న పదాన్ని పరిత్యజించాలని ప్రపంచ హిందూ కాంగ్రెస్ ఈ నవంబర్ 24వ తేదీన తీర్మానించడం చరిత్రాత్మక నిర్ణయమే. 'ఇజం' అన్న పదం అణచివేత, వివక్షలతో కూడిన సిద్ధాంతాన్ని ధ్వనింపచేస్తుందని హిందూ కాంగ్రెస్ అభిప్రాయపడింది. నిజం చెప్పాలంటే, అది హిందూ కాంగ్రెస్ అభిప్రాయం మాత్రమే అనుకోలేం. హిందూయిజం అన్న పదాన్ని ప్రచారం చేస్తున్న వారి అంతరంగం కూడా అదే. హిందూత్వను అణచివేత సిద్ధాంతాల పక్కన చేర్చడమే. అందుకే హిందూయిజం అనే మాటకు బదులు హిందూత్వం లేదా హిందూధర్మం, ఇంకా కావాలంటే సనాతనధర్మం

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ కార్తిక బహుళ సప్తమి**

**లోపలి పేజీలలో...**




ముఖపత్ర కథనం
**బడిలో రామాయణ, భారతాలు** 6లో



పర్యావరణం
**హిమాలయాలపై ఏదీ తేలిక కాదు!** 20లో



ప్రత్యేక వ్యాసం
**భారతీయ దివ్యౌషధం 'ఆయుర్వేదం'** 26లో

# జాగృతి

## సంపాదకీయం

అని నిత్య నూతనమైన ఈ జీవన విధానం గురించి ప్రస్తావించాలని సమావేశం నిర్ణయించింది. హిందూ అన్న పదం ఉన్నందున హిందూత్వం అని పిలుచుకోవడమే సముచితమని సమావేశం అభిప్రాయపడింది.

హిందూధర్మం అనే పదబంధంలో రెండు పదాలు ఉన్నాయి. అవి హిందు, ధర్మం. హిందు అన్న పదానికి ఎల్లలు లేవు. అంటే సనాతనం లేదా నిత్యనూతన మని అర్థం. ధర్మం అంటే స్థిరంగా ఉండేది. కానీ హిందూత్వకు ఇజం అన్న పదం కలపడం దగ్గరే చిక్కంతా ఉంది. అణచివేత స్వభావం, వివక్ష నేపథ్యం ఉన్న ఒక సిద్ధాంతాన్ని ఆ ఇజం ధ్వనింపచేస్తుంది. అందుకే మన పూర్వికులు

# హిందూత్వం

హిందూయిజం అని వ్యవహరించకుండా హిందూత్వం అన్న మాటనే ఉపయోగించారని కూడా ఆ తీర్మానం గుర్తు చేసింది. ఆ పెద్దలతో ఏకీభవిస్తూ మనం కూడా హిందూత్వం అనే మన ధర్మాన్ని పిలుచుకోవాలని తీర్మానం కోరింది. హిందుత్వం అన్న పదం సంక్లిష్టమైనదేమీ కాదని, హిందూనెస్ అన్న అర్థాన్ని చెబుతుందని ఆ తీర్మానం చెప్పింది. కొంతమంది హిందూత్వనే సనాతనధర్మం అని పిలుచుకోవడం ఉంది. అదే సనాతనం. సనాతనం అన్న పదం హిందూధర్మానికి ఉన్న నిత్య నవీనం అన్న అర్థాన్నీ, లక్షణాన్నీ వ్యక్తీకరిస్తుంది. ఈ మధ్య కొందరు అజ్ఞానంతో హిందూధర్మానికి హిందూత్వం వ్యతిరేకమన్న వాదనను ముందుకు తెస్తున్నారని తీర్మానం విమర్శించింది. ఇలాంటి వికృత వాదాలు తీసుకువచ్చేవారు ఎక్కువమంది హిందూత్వ వ్యతిరేకులేనని ఆరోపిం చింది. వీళ్లే సనాతన ధర్మాన్ని నిరంతరం విమర్శిస్తూ విషం చిమ్ముతున్నారని గుర్తుచేసింది. ఈ విష ప్రచారం అంతర్జాతీయంగా కూడా యథేచ్ఛగా సాగుతోంది. హిందూధర్మం మీద పథకం ప్రకారం జరుగుతున్న ఇలాంటి దాడిని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులంతా కలసికట్టుగా ఎదుర్కొనవలసి ఉంటుందని హిందూ కాంగ్రెస్ పిలుపునిచ్చింది.

హిందూయిజం, హిందూత్వం అన్న పదాలను ఎలా రాజకీయం చేస్తున్నారో ఒకసారి పరిశీలించాలి. హిందూయిజం అంటే మన రుషి పరంపరకు చెందుతుందని కొన్ని పార్టీల ఉవాచ. కానీ ఈ పదబంధం 1877లో మోనియర్-మోనియర్ విలియమ్స్ తయారు చేసిన పదకోశంలోనిది. ఆ పదకోశాన్ని అచ్చువేసి వదిలిపెట్టినదే సొసైటీ ఫర్ ప్రమోటింగ్ క్రిస్టియన్ నాలెడ్జ్. అంటే 150 ఏళ్ల క్రితమే హిందూత్వకు వ్యతిరేకంగా జరిగిన, ధర్మానికి చేటు చేయడానికి ఉద్దేశించిన ఒక ముఠా చేసిన ఒక రకమైన మేధో దగా ఆ పదం. సుప్రీంకోర్టు కూడా రెండు పదాలు నిందార్హాలు కాదని చెప్పినప్పుడు హిందూయిజం పదం పట్ల ఇక అభ్యంతరం ఎందుకు అన్న ప్రశ్న వస్తుంది. హిందూత్వం, లేదా వైదిక ధర్మాన్ని హిందూయిజం అన్న పదంతో ప్రస్తావించడం పెద్ద కుట్ర కనుక తీవ్ర అభ్యంతరం చెప్పవలసిందే. ఫాసిజం, నాజీజం పక్కన చేర్చే ఉద్దేశంతోనే హిందూ వ్యతిరేకులు హిందుత్వానికి పక్కన ఆ ఇజాన్ని తగిలిస్తున్నారు. మరీ విచిత్రంగా హిందూత్వం అన్న పదం బీజేపీదేనని వాదించే వాజమ్మలకు కూడా ఇవాళ కొరత లేదు. నిజానికి ఆ పదాన్ని 'యసన్షియల్స్ ఆఫ్ హిందూత్వ' అన్న తన వ్యాసంలో చంద్రకాంత బసు 1892లో ఉపయోగించారన్న వాదన రూఢి అయినదే. తరువాత మూడు దశాబ్దాలకు 1923లో వినాయక్ దామోదర్ సావర్కార్ హిందుత్వ పేరుతో ప్రతిపాదించారు.

హిందూత్వం గురించి ఏ అజ్ఞాని అయినా ఉదారవాదం పేరుతోనో, మేధావి బిరుదుతోనో, చరిత్రకారుడు పేరుతోనో ఇష్టం వచ్చినట్టు వ్యాఖ్యానాలు వెలగబెట్టవచ్చునని అనుకుంటున్నారు. ఈ ధోరణికి ముగింపు పలకాలి. బ్యాంకాక్ ప్రపంచ హిందూ కాంగ్రెస్ తీర్మానం ఆ పని చేస్తుందని ఆశిద్దాం. ★

04 డిసెంబర్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



36లో

కథ

**అడవి తల్లి ఒడి**

- ఎస్.లలిత





| | | | | | |
|---|---|---|---|---|---|
| నేరమయ రాజకీయాల పాపం ఎవరిది? (జాతీయం) | - | 12 | సత్యనిష్ఠతో చరిత్ర (పుస్తక సమీక్ష) | - | 30 |
| జలవనరులు వెలవెల-రైతన్నలు విలవిల (ఆంధ్రప్రదేశ్) | - | 16 | జ్ఞానతృష్ణ కృష్ణవేణి (మహిళ) | - | 34 |
| కాల్పుల విరమణ సరే, యుద్ధ విరమణ..! (అంతర్జాతీయం) | - | 24 | లక్ష్యంవైపు సాగిన మహిమాన్విత పాదాలు (స్మృతిపథం) | - | 40 |
| కాంగ్రెస్ ముందు 'హెరాల్డ్' గండం (జాతీయం-1) | - | 28 | ప్రపంచ కప్ భారత్‌కు అందని ద్రాక్షేనా? (క్రీడ) | - | 43 |

జాతీయ విద్యావిధానం-2020 (ఎన్‌ఈపీ-2020) కింద పాఠశాల విద్యా ప్రణాళికలో మార్పులు తీసుకొని రావాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్.సి.ఇ.ఆర్.టి.) సంకల్పించింది. ఇందులో భాగంగా పాఠశాలల స్థాయి సాంఘిక శాస్త్ర విభాగంలో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై తగిన సిఫారసుల కోసం ఏడుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీని గత ఏడాది ఏర్పాటు చేసింది. ఈ ఉన్నతస్థాయి కమిటీ రామాయణ, మహాభారతాలను పాఠశాల స్థాయి పాఠ్యప్రణాళికలో చేర్చాలని సిఫారసు చేయడం ప్రస్తుతం పెద్ద చర్చకు దారితీసింది. ఈ కమిటీ పై సిఫారసు చేయడమే కాదు, తరగతి గదుల గోడలపై రాజ్యాంగ పీఠికను రాసి ఉంచాలని కూడా కోరింది. వీటితోపాటు ఎన్.సి.ఇ.ఆర్.టి. పుస్తకాల ఫౌండేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు మరిన్ని సిఫారసులు చేసింది. 19 మంది సభ్యులతో కూడిన నేషనల్ సిలబస్ అండ్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కమిటీ (ఎన్.ఎస్.టి.సి.) పై సిఫారసులపై తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ కమిటీ ఆమోదిస్తే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి వస్తుంది. ఇక సాంఘికశాస్త్ర పాఠ్యప్రణాళిక, బోధనోపకరణాలను అభివృద్ధి పరచే లక్ష్యంతో ఎస్.ఎస్.టి.సి. ఇటీవల పాఠ్యప్రణాళిక గ్రూపు (సీఏజీ)ని కూడా ఏర్పాటుచేసింది.

కౌమారదశ పిల్లల్లో దేశభక్తి, దేశంపట్ల అభిమానం పెంపొందేలా చేయాలి. ఏటా కొన్ని వేలమంది విద్యార్థులు విదేశాల్లో పౌరసత్వం కోసం ప్రయత్నాలు చేస్తుండటం మనం చూస్తూనే ఉన్నాం. వీరిలో ఈ వైఖరి ప్రబలంగా వృద్ధి చెందానికి ప్రధాన కారణం తమ దేశం పట్ల అభిమానం కొరవడటమే. దేశభక్తి పెంపొందాలంటే విద్యార్థులకు తమ సాంస్కృతిక మూలాలపై పూర్తి అవగాహన ఏర్పడాలి. అందుకోసం పాఠశాల స్థాయిలో రామాయణ, మహాభారతాలను బోధించాలని తన సిఫారసులో స్పష్టం చేసింది. కొన్ని ఎడ్యుకేషన్ బోర్డులు రామాయణ మహాభారతాలను సిలబస్‌లో చేర్చినప్పటికీ వాటిని కేవలం పౌరాణిక గాథలుగానే బోధిస్తున్నాయి. పురాణమంటే కేవలం కల్పిత కథ అన్న భావనే ఉంది. ఇందువల్ల ఆశించిన ప్రయోజనం సిద్ధించదు. వీటిని చారిత్రక సత్యాలుగా బోధించినప్పుడు మాత్రమే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని పేర్కొంది. అంతేకాదు పాఠ్యపుస్తకాల్లో 'ఇండియా' స్థానంలో 'భారత్'ను చేర్చాలని, 'ప్రాచీన చరిత్ర'కు బదులు 'శాస్త్రీయ చరిత్ర'గా మార్పు చేయాలని కూడా కోరింది. ముఖ్యంగా 3 నుంచి 12 తరగతుల వరకు ఈ మార్పు చేయాలని సిఫారసు చేసింది. రామాయణ మహాభారతాలను పాఠ్యప్రణాళికలో చేర్చాలని సిఫారసు చేయడం ఇదే ప్రథమం కాదు. ఇది గతంలో చేసిన సిఫారసే. దాన్నే పునరుద్ఘాటిస్తున్నామని వివరించింది. రాజ్యాంగ పీఠికను తరగతి గోడలపై రాయడం వల్ల మన రాజ్యాంగం పేర్కొన్న సెక్యులరిజం, ప్రజాస్వామ్యంతో సహా సామాజిక విలువలు విద్యార్థుల మనసులో నాటుకుపోతాయని అభిప్రాయపడింది. ఈ మార్పులు బహుశా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది.

# పిల్లలకు పురాణకథలు ఎలా చెప్పాలి?

అద్భుతాలతో, అలౌకిక సంఘటనలతో కూడిన పురాణగాథలను పిల్లలకు ఎలా చెప్పాలి? యథాతథంగా చెప్పాలా? ఆ అలౌకిక ఘట్టాలను తొలగించి చెప్పాలా? ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా మార్చి చెప్పాలా? నరసింహావతారం కథలో ఒక స్తంభం నుండి సగం మనిషి, సగం సింహం ఆకారంలో భగవానుడు వెలికిరావడం, శ్రీకృష్ణుడు తన చిటికెన వ్రేలుతో గోవర్ధనగిరిని పైకెత్తడం, ఒక రాయికి శ్రీరామచంద్రుని పాదం తాకగానే స్త్రీ (అహల్య) కావడం, ద్రౌపది చీరను లాగిన కొలదీ ఇంకా పెరుగుతూ ఉండటం చిన్నపిల్లలకు ఎలా వర్ణించాలి?

బాల సాహిత్యరచనతోను, విద్యా బోధనతోనూ సంబంధం ఉన్న అయిదుగురు ప్రముఖులను ప్రశ్నించాను. వారి సమాధానాలు సంగ్రహంగా..



చరిత్ర కథల రచయితగా పేరు పొందిన ముహపతి ఇలా అన్నారు, 'చమత్కారాలు, లోకాద్భుత ఘట్టాలు పిల్లల మనస్సులను ఆకట్టుకుంటాయి. కథలలో వీటికి గొప్ప స్థానం ఉన్నది. వీటిని కథలలో వర్ణించవలసిందే. అయితే అలా వర్ణించేటప్పుడు ఆ అద్భుతం వెనుకగల భావనను పిల్లలకు వివరించాలి.

'నరసింహావతార కథలోని రాతిస్తంభం చైతన్యం లేని ప్రజాభిప్రాయానికి ప్రతీక. ఆ ప్రజాభిప్రాయం ఒక్కసారి బద్దలైతే, అన్యాయానికి ప్రతీకమైన హిరణ్యకశిపుని ప్రేవులుతోడే శక్తి దాని నుండి ఆవిర్భవిస్తుంది. శిలగా మారినా అహల్య రామ చరణ రజ స్పర్శ వల్ల పూర్వ రూపం పొందుతుది.

పసిపిల్లలకు అనుమానాలు రావు. కనుక ప్రాథమిక స్థాయిలో అద్భుతాలను యథాతథంగా వర్ణించాలి. పిల్లల బుద్ధి కొంత వికసించి ఆ అద్భుతాలను వాస్తవాలతో జోడించే తెలివి తేటలు వచ్చినప్పుడు, అంటే మాధ్యమిక దశలో ఆ అద్భుతాల వెనుకగల భావనను వివరించాలి. బాల్యదశ దాటి విద్యార్థి కార్యాకారణ సంబంధాలను తర్కించే దశను చేరినప్పుడు అతడు సహజంగా అద్భుతానికి కన్నా దాని వెనుక గల భావనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు.

పౌరాణిక కథలు పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని ఇస్తాయని సోషలిస్టు రచయిత లక్ష్మీకాంత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పుష్పకవిమానం, ఆకాశంలో గుర్రపు సవారీ వంటివి పిల్లలలో కుతూహలాన్ని, జిజ్ఞాసను రేకెత్తిస్తాయి. కనుకనే పంచతంత్రం, హితోపదేశం. ఈసోప్ కథలు, అరేబియన్ నైట్స్‌కథలు గలివర్ యాత్ర మున్నగు కథలు నాటికీ, నేటికీ పిల్లలను ఆకర్షిస్తూనే ఉన్నాయి. ఆ కథలు అనేక భాషలలోనికి అనువాదమయినాయి. పాశుపతాస్త్రం, బ్రహ్మాస్త్రం ఉన్నాయంటే పూర్వం నమ్మేవారు కాదు. నేడు రాకెట్లు, మిసైల్‌లు వచ్చిన తర్వాత మనం ఆ అస్త్రాలను కపోల కల్పనలని ఎలా కొట్టివేయగలం? కనుక అద్భుతాలను కథల నుండి తొలగిస్తే ఆ కథలలోని జీవం పోతుంది. అవి నీరసంగా తయారవుతాయి. సందేశాన్నిచ్చే సామర్థ్యాన్ని అవి కోల్పోతాయి.

అలౌకిక ఘట్టాలు ప్రపంచంలోని అన్ని జాతుల సాహిత్యంలోనూ ఉన్నాయం టారు ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్ర. అయితే వైజ్ఞానిక యుగంలో ఇలాంటి అద్భుత ఘట్టాలను ఎంతో కాలం సహించలేము. హేతువాదం ఆధారంగా కొత్త సాహిత్యం రావాలి. పురాణ కథలలోని అద్భుత ఘట్టాలను ప్రతీకలుగా

# బడిలో రామాయణ, భారతాలు

**సర్వహితాన్ని కోరే ధర్మం**

హైందవం అనేది కేవలం ఏదో ఒక జాతికి తెగకు సంబంధించింది కాదు. ఇందులో పేర్కొన్న ధర్మాలు సమస్త మానవాళికి వర్తిస్తాయి. భారతీయ సంస్కృతికి ఇంతటి ఘనచరిత్ర ఉన్నప్పటికీ, మన విద్యావ్యవస్థ మొత్తం పాశ్చాత్య శైలిని అనుసరించి ఉండటం విచిత్రం. నిజం చెప్పాలంటే బ్రిటిషర్లు బలవంతంగా రుద్దిన విద్యావిధానాన్నే మనం అనుసరిస్తున్నాం. విద్యాసంస్థల్లో నేర్చుకున్న విద్యకు, వర్తమాన సమాజంలో జరుగుతున్న దానికి పొంతన శూన్యం. భారతీయ చరిత్రలో నిజమైన హీరోలకు పాఠ్యపుస్తకాల్లో స్థానం లభించలేదు. పుస్తకాల్లో ప్రముఖులుగా పేర్కొన్న వ్యక్తులకు నిజంగా అంతటి ప్రాధాన్యత లేదు. చరిత్ర పుస్తకాల్లో వలసవాదం గురించి విపరీతమైన ఊకదంపుడు తప్ప, అంతకుముందు నాటి భారత చరిత్రపై ఎటువంటి ప్రాధాన్యం కనిపించదు. ఈ దుస్థితికి కారణం లేకపోలేదు. నిరంకుశ పాలనకంటే, విద్యాపరంగా తమకు అనుకూలమైన మార్పులు తీసుకొని రావాలన్న లక్ష్యంతో బ్రిటిషర్లు తమ వ్యూహాన్ని అమలు చేశారు. ముందుగా ప్రాంతీయ భాషల కంటే, ఇంగ్లిష్ ఎంతో ఉత్తమమైనదిగా ప్రచారం చేసి, మధ్యతరగతి వర్గాల్లో ఆ భాషను బాగా ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. ఈవిధంగా పాశ్చాత్య విద్య ప్రభావంతో, విలువలతో కూడిన గురుకుల విద్యావిధానం దేశంలో కనుమరుగైపోయింది. ఈ గురుకులాలు ధర్మం అంటే ఏమిటో విడమరచి చెప్పడమే కాదు, విద్యార్థులను ధర్మదీక్షాపరులుగా, ధర్మ పరిరక్షకులుగా మార్గనిర్దేశం చేసేవి. మానవతా విలువలను బోధించే రామాయణ, మహాభారతాలను



చూపి వాటి వెనుక గల అర్థాన్ని వివరించినపుడే పిల్లలకు వాటిపై నమ్మకం ఏర్పడుతుంది. ఇలా అర్థం చెప్పకపోతే వినాయక, నరసింహ విగ్రహాలు హాస్యాస్పదాలుగా మిగులుతాయని ఆయన భావన.

బాల సాహిత్యంలో అసంభవ ఘట్టాలను, అలౌకిక ఘట్టాలను చేర్చడం హాస్యాస్పదమంటూ డాక్టర్ కృష్ణచంద్ర ఇలా అన్నారు. 'విజ్ఞానం విస్తరించిన కారణంగా నేటి పసి పిల్లలకు కూడ అనేక విషయాలు తెలుస్తున్నాయి. నేడు పిల్లలు సైన్సుకథలు ఎంతో ఆసక్తితో చదువుతున్నారు. కపోల కల్పన వినడం పిల్లల వికాసానికి ఏమంత మంచిది కాదు.'

పురాణ కథలలో నేటి పరిస్థితులకు పొసగే, భవిష్యత్తుకు ఉపకరించే కథలను ఏరుకొని వాటిని పిల్లలకు చెప్పాలంటారు ప్రముఖ రచయిత నిరంకారదేవ. అనాది కాలం నుండి మానవుడు సత్యాన్ని, జ్ఞానాన్ని అన్వేషిస్తున్నాడు. ఆ జ్ఞానం వల్లనే మనిషిలో ఆత్మవిశ్వాసం, స్వతంత్రంగా బ్రతికే సామర్థ్యం అలవడతాయి. కనుక పురాణ కథలను యథాతథంగా బోధించకూడదు, అద్భుత గాథల వల్ల నేటి పిల్లలకు వినోదం కాని, విజ్ఞానం కాని లభించదు. రావణుణ్ణి పది తలల వ్యక్తిగా వర్ణించే కన్నా ఒక దుర్మార్గుడుగా వర్ణిస్తే పిల్లలకు దుర్మార్గులను అణచివేయాలనే ప్రేరణ కలుగుతుంది. కనుక పురాణ కథలను అమృత గాథలుగా కాక మానసిక గాథలుగా మలచి చెప్పడం మంచిదని ఆయన సూచించారు. బాల శిక్షణలో నిపుణుడు రాణా ప్రతాప్‌సింగును ప్రశ్నించగా ఆయన పిల్లలలో సద్గుణాలను వికసింపజేయడం కోసం వారిలో భావాలను నిర్మించడం అన్నది కథలు చెప్పడం వెనుకగల ఉద్దేశమని వివరించారు. కల్పనవల్ల, జిజ్ఞాసవల్ల కథలకు పుష్టి కలుగుతుంది. కవి పాదాలను 'చరణ కమలములు' అని ముఖాన్ని, 'చంద్రముఖం' అని వర్ణిస్తాడు. అలాగే వివిధ భావాలను వ్యక్తం చేయడం కోసం కథారచయిత అద్భుతాలను, అలౌకిక ఘటనలను వాడితే దానిలో తప్పేముంది?

కథలలో అద్భుతాలను వర్ణించడం ఒక సాధనమే కాని లక్ష్యం కాదు. విషయం పిల్లల మనస్సుకు హత్తుకునేటందుకు అలంకారాలు, ప్రతీకలు వాడడం అవసరం. శాస్త్ర పరిభాష అర్థాన్నే కాక దానిలోని మర్మాన్ని కూడ మనం అర్థం చేసుకోవాలి. అద్భుత గాథలను హేతుబద్ధంగా చెప్పడం ఎలా? అనే అంశంపై పరిశోధనలు జరుగుతున్నాయి.

ప్రహ్లాదుడు ప్రజల తరఫున నిలిచాడు. వారికి ప్రహ్లాదుడంటే పట్టరానంత ప్రేమ. ప్రహ్లాదుణ్ణి కొండలమీదనుండి పడదోయాలని, అతనికి విషం పెట్టాలని ఏనుగులచేత తొక్కించాలని హిరణ్య కశిపుడు ఉత్తరువులు ఇచ్చాడు. కాని ప్రజలు ప్రహ్లాదుణ్ణి ఆ ఆపదలనుండి కాపాడారు. సభలో స్తంభాన్ని తన్ని ఈ ఇందులోనే హరి ఏడి?' అని హిరణ్యకశిపుడు ప్రశ్నించడం అన్యాయాలను, అత్యాచారాలను ఏండ్ల తరబడి సహించి సహించి రాళ్లవలె మొద్దుబారిపోయిన సభికులకు అవమానం, సభికులలో క్రోధం పెల్లుబికింది. వారంతా హిరణ్యకశిపుణ్ణి చంపి వేశారు. అలా చంపినవారు మామూలు వ్యక్తులే. అయితే క్రోధావేశంతో వారి ముఖాలు సింహాల ముఖాలవలె భయంకరంగా తయారైనాయి 1977 మార్చి ఎన్నికలలో ఇలాంటి నరసింహ అవతారాన్ని ప్రజలు మరోమారు దర్శించారు. ప్రముఖ రచయితలు వ్యక్తం చేసిన యీ అభిప్రాయాలు మనలో ఈ విషయమై ఆలోచనలు రేకెత్తిస్తాయి. పురాణకథలు పిల్లలకు వర్ణించి చెప్పడం వెనుక ఎంతో భావన ఉన్నది. ఆ భావన పిల్లల మనస్సుకు హత్తుకునేలా చెప్పడం ప్రధానం.

– డా॥ పుష్పేంద్రశర్మ

16.02.1979 'జాగృతి' నుంచి

పాఠ్యాంశాలుగా చేర్చడం వల్ల పిల్లల్లో నైతిక విజ్ఞానం పెరిగి, క్రమంగా నేర సంఘటనలు తగ్గుతాయి. బంధాలు, అనుబంధాలకున్న విలువ బాగా అర్థం కావడం వల్ల కుటుంబ వ్యవస్థ మరింత పటిష్టమవుతుంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించేదిగా ప్రస్తుత విద్యా విధానం లేదు. దీని ఫలితమే ఆత్మహత్యలు! భగవద్గీత జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగించడమే కాదు, పరిష్కారాలను కూడా చూపుతుంది. దీన్ని బాగా అవగాహన చేసుకున్నవారు జీవన సమరంలో పోరాడి విజయం సాధించడానికి యత్నిస్తారు తప్ప, పలాయనవాదాన్ని ఆశ్రయించరు. ఇటువంటి విలువలను, సామర్థ్యా లను పెంపొంది స్తాయి కనుకనే రామాయణ మహాభారతాలను పాఠ్యాంశాలుగా చేర్చాలన్న సిఫారసు ఎంతో సముచితం.

**సౌదీ అరేబియా నుంచి నేర్చుకోవాలి**

సౌదీ అరేబియా విజన్–2030లో భాగంగా పాఠశాల విద్యాప్రణాళికలో రామాయణ, మహాభారతాలను చేర్చిన సంగతిని గుర్తుచేసుకోవాలి. 'అరబ్ యోగా ఫౌండేషన్' వ్యవస్థాపకురాలు నౌఫ్ అల్ మర్వాయి తన కుమారుడి సాంఘిశాస్త్ర ప్రశ్నపత్రంలో హైందవం, బౌద్ధం గురించిన ప్రశ్నల వివరాలను స్క్రీన్‌షాట్ ద్వారా ట్విట్టర్‌లో షేర్‌చేయడం 2021లో ఎంతోమందిలో ఆసక్తిని రేకెత్తించింది. హైందవం, రామాయణం, మహాభారతం, కర్మ, మహాభారత ధర్మం వంటి అంశాలను తన కుమారుడికి బోధించడంలో తానెంతో స్ఫూర్తిని పొందుతున్నానని ఆమె తన ట్విట్టర్‌లో పేర్కొంది. ఇంగ్లిష్‌తో పాటు ఇంటువంటి విద్యావిషయిక అంశాలవల్ల ప్రజల్లో సహనం పెరిగి, ఉదారవాద సమాజ ఏర్పాటుకు దోహదం చేస్తుంది. రామాయణ మహాభారతాలతో పాటు యోగా, ఆయుర్వేదం వంటివి కూడా సౌదీ అరేబియా ప్రభుత్వం తన పాఠ్య ప్రణాళికలో చేర్చడం విశేషం.

**వెలకట్టలేని సాహిత్యం**

వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి వాటి విలువను హైందవ సంస్కృతిలో వెలకట్టడం అసాధ్యం. ఒక మనిషిని సంస్కారవంతుడిగా, పరిపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దే సామర్థ్యం కలిగినవి. మరి అటువంటి వాటిని పాఠ్యప్రణాళికలో చేర్చడం వల్ల పిల్లలు నైతిక నిష్ఠాపరులుగా, పరిపూర్ణులుగా ఎదిగి సమాజానికి ఎంతో మేలు చేస్తారు. రామాయణం ఆధారంగా తులసీదాస్ రచించిన రామచరిత మానస్ విద్వేషాన్ని పెంచేదిగా ఉన్నదంటూ అర్థంపర్థంలేని విమర్శలు చేసే బిహార్ విద్యాశాఖ మంత్రి చంద్రశేఖర్ వంటి వారు ఎలాగూ ఉంటారు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి, సమాజ్‌వాదీ పార్టీ జనరల్ సెక్రటరీ స్వామి ప్రసాద్ మౌర్య కమిటీ సిఫార్సులను తీవ్రంగా వ్యతిరేకించడంలో పెద్దగా ఆశ్చర్య పోవాల్సిందేమీ లేదు. సీత, శూర్పణక, ద్రౌపది వంటి గొప్ప వనితలు పడిన కష్టాలను ప్రోత్సహించడమే ప్రభుత్వ ఉద్దేశమా అంటూ ప్రశ్నించారు. సీత అగ్ని పరీక్షను ఎదుర్కొంది, వివాహ ప్రతిపాదన చేసినందుకు శూర్పణక ముక్కుచెవులు కోశారు, ద్రౌపదిని ఘోరంగా అవమానించారు. పాఠ్యప్రణాళికలో రామాయణ, మహాభారతాలను చేర్చడమంటే ఈ గొప్ప మహిళలు పడిన కడగండ్లను మరింత ప్రోత్సహించడమేనంటూ ఆయన చేసిన విమర్శ అవగాహనా రాహిత్యంతో చేసింది మాత్రమే.

**చరిత్రను తెలుసుకోవాలి**

ప్రతి భారతీయుడు విద్యాభ్యసన కాలంలో భారత చరిత్రను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ఇదే సమయంలో వేదాలు, స్మృతులు, శృతులు, వేదాంతం, రామాయణం, మహాభారతాలపై పరిజ్ఞానాన్ని బాగా పెంచుకోవాలి. నిజానికి ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన ఈ సాహిత్యంలోని, పురాతనత్వం, సుదృఢ ఆలోచనాశైలి, విషయ విశ్లేషణ, విస్తృతి ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. దురదృష్టవశాత్తు స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుంచి ప్రభుత్వాలు, లెఫ్ట్ భావజాలం ఉన్న మేధావులు దీన్ని ఎంతమాత్రం పట్టించుకోలేదు. విచిత్రమేమంటే విద్యను మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేసినప్పటికీ, దాని నాణ్యతపై దృష్టిపెట్టకపోవడంతో, విద్యలో ప్రమాణాలు పడిపోయాయి. ఇటువంటి పరిస్థితులో భారతీయ సంస్కృతి, వారసత్వ సంపద, ప్రపంచ దేశాలకు మన నాగరికత వల్ల కలిగిన మేలు, వేదాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు వంటి వాటిని ఒక క్రమపద్ధతిలో అందరికీ అందుబాటులోకి తీసుకొని రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యావిధానంలో వీటిని భాగం చేయడమే ఇందుకు సరైన మార్గం. భారత నాగరికత ఎప్పుడూ భిన్నత్వంలో ఏకత్వాన్ని విశ్వసించింది. వసుధైక కుటుంబకమే పరమావధిగా ముందుకు సాగింది. భారతీయ తత్త్వశాస్త్రం సకల జీవుల హితాన్నే కోరింది.

మన పూర్వీకుల నిబద్ధత, ఆలోచన, తపస్సు ద్వారా సంపాదించిన పరిజ్ఞానంలోని శక్తిని తెలుసుకునే హక్కు ప్రతి భారతీయ విద్యార్థికి ఉంది. ఇందుకోసం ప్రస్తుత భారతీయ విద్యా విధానంలో సాహసోపేతమైన మార్పులు తీసుకొనిరాక తప్పదు. వ్యక్తి, సమాజం, ఆత్మపరంగా అత్యుత్తమమైన మార్గాన్ని చూపేది విద్య మాత్రమే. అటువంటి విద్యను సక్రమమైన రీతిలో అందిం చినప్పుడు, మానవులు తమలోని అజ్ఞానాంధకారాన్ని జయించి, జ్ఞాన వెలుగుల వైపునకు ప్రయాణం కొనసాగించగలరు. బృహదారణ్యకోపనిషత్ చెప్పింది ఇదే. 'తమసోమా జ్యోతిర్గమయ' అంటే 'నన్ను అంధకారం నుంచి వెలుగు వైపునకు నడుపు' అని అర్థం. అటువంటి విద్య ప్రతి కటుంబాన్ని ఉత్సాహపూరితం చేసి వ్యక్తుల హృదయాలను మరింత వికసితం చేయగలదు. పాలకులు అటువంటి విద్యావిధానంపై దృష్టిపెట్టక తప్పదు. ★





**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# మూలాలతో ముందడుగు

డి. అరుణ

దేశంలో విద్యావ్యవస్థపై మార్క్సిస్టుల పట్టును బద్దలు చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్నది. చరిత్ర రచన, బోధన విషయంలో మార్క్సిస్టులు దేశానికి చేసిన ద్రోహం క్షమార్హం కానిది. దీనిని సరిదిద్దడానికి మొత్తంగా విధానంలోనే మార్పులు తేవాలని సంకల్పించి 'నూతన విద్యావిధానాన్ని' తెచ్చింది. ఇందులో భాగంగా, పాఠ్యాంశాల ఎంపిక కోసం నియమించిన సంఘం రామాయణ, మహాభారతాలను పాఠ్యాంశాలుగా చేర్చాలంటూ చేసిన సూచన సమాజంలోని కొన్ని వర్గాలకు ఆనందాన్ని ఇచ్చింది. ఇంకొన్ని వర్గాలకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ముఖ్యంగా, మార్క్సిస్టులు, మైనార్టీలకు ఇది మింగుడుపడడం లేదు. ఇటీవలే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మొగలుల చరిత్రకు సంబంధించిన కొన్ని అధ్యాయాలను తొలిగించడంతో ఉదారవాదులు ఉవ్వెత్తున ఎగిసిపడ్డారు. విద్యను కాషాయీక రిస్తున్నారంటూ మళ్లీ పాత పాట అందుకున్నారు. అస్సాంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మదరసాలలో ఇస్లామిక్ విద్యను బోధించరాదంటూ ఉత్తర్వులు



జారీ చేసినప్పుడు ఈ మతపరమైన గ్రంథాలను పాఠ్యాంశాలుగా ఎలా ప్రవేశపెడతారంటూ మైనార్టీవర్గాల ప్రతినిధులు వాదనకు దిగుతున్నారు. దీనంతటికీ కారణం, మన చరిత్రను రచించి, మనకు బోధించిన తీరే.

**మన రాజుల విశిష్టత మనకు తెలియదు...**

మనపై దండ యాత్రలు చేసి, పరమతాలను ఇక్కడకు తీసుకువచ్చి, బలవం తంగా స్థానిక ప్రజలపై రుద్దిన రాజులను గొప్పవారిగా చిత్రీకరించి దశాబ్దాలుగా మార్క్సిస్ట్ చరిత్రకారులు చరిత్రను వక్రీకరిస్తూ వచ్చారు. దాడులకు పాల్పడిన ఇస్లామిక్ రాజులు ఎంత గొప్పవారో, వారి పాలన ఎంత గొప్పగా ఉండేదో రాయడమే తప్ప, తమను తాము హిందువులుగా అభివర్ణించుకొని, సనాతన ధర్మాన్ని సుదూర తీరాలకు వ్యాపింపచేస్తూ కొన్ని వందల ఏళ్ల కాలం పాలించిన చోళులు, పాండ్యులు వంటి వారి చరిత్రకు తగిన ప్రాధాన్యతనివ్వకుండా మన గొప్పతనమేమిటో మనకు తెలియకుండా చేశారు. పాండ్య, చోళ, చేర, శాతవాహన, కుషాణు... ఇలా చెప్పుకుంటూ పోతే అనేక వంశాలు భారతదేశాన్ని సనాతన ధర్మానికి అనుగుణంగానే పాలించాయి. వీరంతా రాముడినీ, కృష్ణుడినీ, వేదోపనిషత్తులను ఆదర్శంగా తీసుకుని పాలన చేసినవారే. రామాయణం వివిధ రూపాలలో ప్రపంచంలోని పలు దేశాలలో కనిపిస్తుంది. ఇస్లామిక్ దేశం, మహమ్మద్ జన్మించిన ప్రాంతంగా పరిగణించే సౌదీ అరేబియా ఇటీవలి కాలంలో యోగను, రామాయణాన్ని తమ విద్యా విధానంలో భాగంగా చేసేందుకు చర్యలు తీసుకుంది. అంతటి గొప్పతనం కలిగిన ప్రాచీన చారిత్రిక గ్రంథాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలన్న సూచనకే వ్యతిరేకత ఎదురైంది.

**మన గ్రంథాలలోనే శాస్త్రీయ ఆధారాలు...**

నిజానికి రామాయణ, మహాభారత గ్రంథాల చారిత్రికత, కాలం, వాస్తవికత గురించి ఎన్నో, ఎన్నెన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. అవి చరిత్ర అని రుజువు చేసే ఆధారాలు లభ్యమవుతున్నా, 'మెకాలే పుత్రులు' మాత్రం దానిని చరిత్రగా అంగీకరించేందుకు ససేమిరా అంటున్నారు. కనుక, ఈ క్రమంలో వీటికి సంబంధం చిన పరిశోధనలను పరిశీలిస్తే మనకు కూడా కొన్ని సందేహాలు తీరిపోతాయి –

రాజ్యం, సమాజం, కుటుంబం... అందులో వ్యక్తి బాధ్యతలు, పోషించవలసిన పాత్రలు, అనుసరించ వలసిన విలువలు సహా జీవితానికి సంబంధించిన అనేక అంశాలను స్పృశిస్తూ, నాటి చరిత్రను నమోదు చేస్తూ రామాయణ, భారత గ్రంథాలను రచించారన్నది వాస్తవం. ముఖ్యంగా, ఇవి చరిత్రే అని చెప్పటానికి అందులోనే అనేక ఆధారాలు మనకు కనిపిస్తాయి. అందులో అత్యంత ముఖ్యమైనది 'కాల గణన'... ప్రతి ముఖ్యమైన ఘట్టంలోనూ దాని తిథి, వార, నక్షత్రాలను, గ్రహణాల వంటి ఘటనలను కూడా ఈ గ్రంథాలలో పేర్కొనడంతో, అనేకమంది శాస్త్రవేత్తలు వీటి ఆధారంగానూ, అందులో వర్ణించిన ఖగోళ దృగ్విషయాల ఆధారంగానూ ఈ చరిత్ర ఏ కాలం నాటిదో నిర్ణయిస్తున్నారు. నిజానికి మనం నేడు చూసే ఆకాశం, నక్షత్రాల దిక్కులు, స్థితి 9000 ఏళ్ల కింద ప్రాచీనులు చూసినదానికన్నా భిన్నమైంది. దీనిని ఆయనాంశం (ప్రెసెషన్) అంటారు, దీనిని అన్నిరకాల గణనల్లో కారకం చేయవలసి ఉంటుంది. పొరపాట్ల సంభావ్యతను తగ్గించేందుకు, ఖగోళశాస్త్రం సహా (అయోధ్యలో నాడు ఎన్ని గ్రహణాలు చోటు చేసుకున్నాయి) వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని నిర్ధారణ చేస్తున్నారు. ఇది కేవలం సాధారణ చరిత్రకారులు చేస్తున్న పని కాదు, ప్రతిదానికీ ఆధారాన్ని కోరే శాస్త్రవేత్తలు చేస్తున్న పని కావడంతో దానిని ఆమోదించవలసిందే.

**అంతర్జాతీయ శాస్త్రవేత్తల జన్యు పరిశోధన**

ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో నివసించే గిరిజన తెగ రామసేవక్ కోల్ అన్నది దేశంలోనే అత్యంత ప్రాచీన తెగ. రామాయణంలో వర్ణించిన గుహుడనే రాజు సంతతే వీరని జన్యుపరమైన అధ్యయనాలు రుజువు చేశాయి. జన్యుశాస్త్రవేత్తలు, మానవశాస్త్రవేత్త, పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు 10,000 ఏళ్ళ కిందటి ఘటనలు, పాత్రలను క్రోడీకరిస్తూ వాల్మీకి మహర్షి చేసిన రచన కాల్పనికమైంది కాదని తేల్చేశారు. ఈ పాత్రల వెనుక ఉన్న రహస్యాన్ని ఎస్టోనియాకు చెందిన ఎస్టోనియన్ బయోసెంటర్‌లో అగ్ర జన్యుశాస్త్రవేత్త డా॥

గ్యానేశ్వర్ చౌబే నేతృత్వంలోని బృందం ఛేదించింది. మూడేళ్లు సాగిన ఈ పరిశోధనలో హైదరాబాదుకు చెందిన సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ, ఢిల్లీ యూనివర్సిటీ, ఖరగ్‌పూర్‌కు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ ఆన్ వేదాస్‌లు కూడా పాలుపంచు కుని, ఆధునిక పాలకులు షెడ్యూల్డు తెగలుగా వర్గీక రించిన భిల్లులు, గోండ్లు, కోలులు రామాయణంలో కనిపించే ఒక పాత్రకు నిజమైన వారసులని తెలుసుకున్నారు.

శాస్త్రవేత్తలు ఒక ప్రతిపాదన చేస్తూ పత్రాన్ని రచించినప్పుడు దానిని తోటి శాస్త్రవేత్తలు సమీక్షించిన (పీర్ రివ్యూ) తర్వాతే దానికి విశ్వసనీయత ఏర్పడు తుంది. ఆ రకంగా, ఈ బృందం రచించిన పత్రాన్ని సమీక్షించిన తర్వాత దీనిని విశ్వసనీ యత కలిగిన శాస్త్రీయ పోర్టల్ పయోస్ వన్ (PlOS ONE)లో ప్రచురించారు. రామ, లక్ష్మణ, సీతలు గంగానదిని దాటేందుకు తోడ్పడిన నిషాద రాజు గుహుడే మీర్జాపూర్, వారణాసి, బందా, అలహాబాద్‌లలో నివసించే కోలుల మూల పురుషుడని జన్యుపరమైన అధ్యయనాల ద్వారా నిరూపించారు. యుపి, ఎంపి, ఒడిషా, ఛత్తీస్‌గఢ్‌వ్యాప్తంగా విస్తరించి ఉన్న గిరిజనులే రాముడు, ఆయన సమకా లీనుల వారసులంటూ, డా।। చౌబే ది పయోనీర్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సమూహాలు లేక తెగలు దాదాపు 10వేల ఏళ్ల కింద నుంచి జన్యు పరమైన కొనసాగింపును నిర్వహిస్తూ వచ్చాయని తమ అధ్యయనాలు రుజువు చేశాయంటూ డా।। చౌబే, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన మానవశాస్త్రవేత్త ప్రొ।। వివిఆర్ రావ్ వెల్లడించి, ఒకరకంగా ఆర్యుల దాడి సిద్ధాంతానికి ముగింపు వాక్యం పలికారు. బయట నుంచి వచ్చి కలిసిన జన్యు లక్షణాలు ఏవీ ఈ తెగలలో కనిపించవంటూ వైదిక, రామాయణ అధ్యయనాలలో నిపుణులైన సరోజ్ బాలా (గ్రహ స్థితిగతుల ఆధారంగా రాముడి పుట్టిన తేదీని గణించడంతో ప్రాచుర్యం పొందిన) తెలిపారు. ఇలా కేవలం ఒక్క రామాయణానికి సంబంధించిన పరిశోధనలే కాదు, మహాభారతానికి సంబంధించి కూడా చేస్తూ, అది కూడా ప్రాచీన చరిత్రలో భాగమేనని రుజువు చేస్తూ వస్తున్నారు.

### రామాయణ, భారతాలు, చరిత్ర అంటే వివాదమెందుకు?

ఇందుకు కారణం మన వలసవాద చైతన్యం లేదా స్పృహ అని చెప్పాలి. వలసవాదులు మనను పాలిస్తున్న సమయంలోనూ, తర్వాత కూడా మన మేధో పరమైన చట్రాన్ని పూర్తిగా, శాశ్వతంగా మార్చివేసి మనను వదిలివెళ్లడంతో, మన సంస్కృతి, చరిత్ర గురించి వారు చెప్పిందే వాస్తవమనే భావనకు లోనవు తుంటాం. అంతేనా, దేశీయంగా మన



సంస్కృతికి సంబంధించిన కథనాలను అభివృద్ధి చేసేటప్పుడు కూడా వారి దృక్పథం నుంచే ప్రతి విషయాన్నీ అంచనా వేస్తుంటాం. అందుకే, రొమిల్లా థాపర్ వంటి చరిత్రకారులు ఆర్యుల దాడి సిద్ధాంతాన్ని సమర్థిస్తూ, రామాయణాన్ని తక్కువ చేసి చూపారు.

వలసవాదులు భారతదేశాన్ని వదిలివెళ్లిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా పలు తరాలు ఈ దేశానికి సంబంధించిన వాస్తవ చరిత్ర ఏమిటన్నది తెలుసుకోలేకపోయాయి. రాముడిని, కృష్ణుడిని పూర్తిగా దేవుళ్లుగా భావించి వారిని పూజించడం తప్ప ఆ పాత్రల చారిత్రిక ప్రాధాన్యం చూడలేకపోయాం. ఈ గ్రంథాలన్నీ కూడా మత పరిధిలోకి రావడం, వలసవాద కోణమే ప్రధానంగా ఉన్న పాఠ్యాంశాలను యువత చదవడంతో, వాటిలో ఉన్న భిన్న కోణాలను చూడటంలో విఫలమైంది. ముఖ్యంగా సనాతనమంటే మతమనే భావన పాశ్చాత్యులు ప్రచారం చేయడంతో మనం కూడా అదే భావనలో చిక్కుకున్నాం. మనది సనాతన ధర్మం, ధర్మమంటే ప్రకృతి నియమాలకు అనుగుణంగా జీవించడం తప్ప మరొకటి కాదు. కుల, వర్గ, మత బేధం లేకుండా అందరూ గౌరవించి, అనుసరించ వలసిన వైశ్విక స్థాయి అచారం లేదా నీతే ధర్మం. ఇదే ఈ రెండు గ్రంథాలలోనూ అంతర్లీనంగా ప్రవహించే సూత్రం.

సామాజిక, రాజకీయ, వ్యక్తిత్వ వికాసపరమైన అంశాలు రామాయణ, భారతాలలో పుష్కలంగా కనిపిస్తాయి. ఆదర్శపాలకుడు, నీతి నియమాలకు ప్రాధాన్యమిచ్చిన సమాజం మనకు త్రేతాయుగంలో కనిపిస్తే, మానవ వ్యక్తిత్వం, బలహీనతలు, యుద్ధ తంత్రం, చతురత, అంతిమంగా ధర్మానికే విజయం వంటి విషయాలన్నీ ద్వాపరయుగంలో కనిపిస్తాయి. ఈ రెండు యుగాలలోనూ ధర్మానిదే ప్రాధాన్యం. రాచరికం, పాలన, యుద్ధాలు, తంత్రాలు ఒక ఎత్తు అయితే, వ్యక్తిత్వాన్ని వికసింపచేసే భగవద్గీత దీనికి తలమానికం.

మనకన్నా పాశ్చాత్యులే మన జ్ఞానఖనిని ఎక్కువగా గుర్తించి, ఉపయోగించుకుంటున్నారన్న విషయం కొత్తదేం కాదు. వేదాలు జర్మనీ చేరి, అక్కడ అనువాదితమై వారి జ్ఞానఖనిగా మారాయి. ఉదారవాదులు దీనిని అంగీకరించరు, ఆంధ్రప్రదేశ్ నుంచి సంస్కృత పండితులను వారు ఎందుకు రప్పించుకున్నారో చెప్పరు. విద్యారంగం, చరిత్రపై మార్క్సిస్టులు పట్టు బిగించిన నేపథ్యంలో వారికి వ్యతిరేకంగా ప్రతిపాదించిన ఏ వాదనను వారు ఎదగనివ్వలేదు. దీనిని భారతీయులు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలో భగవద్గీత, కౌటిల్యుని అర్థశాస్త్రం సహా మన గ్రంథాలను బోధిస్తుండగా, ఇక్కడ మాత్రం వాటిని పెరటిమొక్కలుగానే పరిగణిస్తున్నారు.

పాశ్చాత్య విలువల కారణంగా, నేడు ఆ సమాజాలలో ఏం జరుగుతున్నదో గమనించిన ప్రభుత్వం ప్రస్తుత, భవిష్యత్తు తరాలను కాపాడేందుకు సనాతన ధర్మ విలువలను విద్యలో ప్రవేశపెట్టాలను కుంటోంది. మనిషి జీవితంలో ప్రతి కోణాన్నీ ప్రభావితం చేస్తూ, ప్రతి అంశంలోనూ మార్గదర్శనం చేయగల సూత్రాలు మన ఆధ్యాత్మిక గ్రంథాలలో ఉన్నాయి. పరమత సహనం మొదలు, అతి సర్వత్ర వర్జయేత్, యతోధర్మః తతో జయః సహా ఎన్నో ధార్మిక అంశాలు మన జీవనవిధానంలో అంతర్లీనంగా ఉన్నప్పటికీ, వాటికి విలువనిచ్చి, ప్రాముఖ్యం తెలుసుకోవలసిన అవసరం నేటి తరానికి ఉన్నది.

సామాజిక సంబంధాలు, మానవ సంబంధాలూ నానాటికీ క్లిష్టంగా పరిణమిస్తూ, విలువను కోల్పోయి, ముందుగా వ్యక్తులకు, తర్వాత కుటుంబానికి, అంతిమంగా సమాజానికే ముప్పుగా పరిణమించే ప్రమాదం నుంచి భవిష్యత్ తరాలను తప్పించాలంటే వారికి సనాతన ధర్మానికి సంబంధించిన అంశాలను, సరైన రీతిలో, సరైన నేపథ్యంలో బోధించడం అవసరం. ధర్మాచరణ, జ్ఞాన సముపార్జన, వివేకం, మంచి విషయాలతో అనుబంధం కలిగి ఉండటం అనేది నిస్సందేహంగా మనిషి ఆనందానికి కారణభూతమైనవనే మన గ్రంథాలు చెప్తాయి. ముఖ్యంగా, ఎదుటి మనిషిలో కూడా భగవంతుడిని చూడాలని, వ్యక్తి తనను తాను తెలుసుకోవాలని బోధించి, మార్గదర్శనం చేయడం ద్వారా నేడు విపరీతంగా, అరాచకంగా సమాజాన్ని సవాలు చేస్తున్న కుల, మత సమస్యలకు విరుగుడు లభ్యం అయ్యి, వసుధైవ కుటుంబక భావన ఆచరణలోకి వస్తుంది. ఇదే నిజమైన హైందవ... సనాతన సంస్కృతి! ★

# స్వరాజ్యము – భారతీయ సంస్కృతి



గాంధీ

మనకు స్వరాజ్యము వచ్చినది. ఏ విధమైన పాలనమును అవలంబింపవలయునో మనకు పెద్ద సమస్య అయినది. మనము స్వరాజ్యము కావలయునని ఎందుకు కోరుకుంటిమి? పరరాజ్యముండిన నష్టమేమి? పరునలి పాలింపబడినచో మనకు అవమానకరముగానుండును. స్వరాజ్యమును కోరుటకు యిట్టి అవమానమును లేకుండ జేసుకొనుటయే ఒక్క కారణమా? ఇది ఒక్క కారణమే ఆయననూ అది బహుశ్వల్ప కారణము.

ఒక వ్యక్తికిని, మరియొక వ్యక్తికిని భావములలోను, ఆచారములలోను, వర్తనములలోను, ఆదర్శములలోను, యెట్టి భేదములు ఉండునో, అట్టి భేదములే, ఒక జాతికిని, మరియొక జాతికినిగలవు. ఒక వ్యక్తి తన యొక్క ఆదర్శములను బట్టి జీవించి వానిని తన జీవితములో ఫలసిద్ది పొందించుట ఎట్టి ధర్మమో ప్రతిజాతీయులు తమ ఆదర్శముల ప్రకారము జీవించి ఫలోపలబ్ధిని పొందుట గమ్యస్థానము.

ఒక వ్యక్తి మరియొక వ్యక్తికి లోబడి జీవించవలసి వచ్చినప్పుడు తన యొక్క ఆదర్శముల ప్రకారము, జీవించుటకు ఎట్టి ప్రతి బంధకములు కలుగునో, ఒక జాతి మరి యొక జాతికిలోబడి జీవించవలసివచ్చినపుడు తన గమ్యస్థానమును పొందుటకు, అట్టి ప్రతి బంధకములే కలుగును. ప్రపంచములోని, ప్రతి జాతియొక్క చరిత్రమును పరిశీలించినప్పుడు, దీనికి దృష్టాంతములెన్నియో కనపడును. ఐరోపా జాతులు, యితర మతములవలంబించిన పరప్రభుత్వములకు లోబడి క్రొత్త ఆదర్శములను, జీవిత పద్ధతులను, అవలంబించవలసి వచ్చినది. ఆఫ్రికాలోని పూర్వ నాగరికముగల కార్తేజి ఈజిప్టు మొదలైన దేశములు తమ జీవిత పద్ధతులను, గమ్యస్థానములను పరజాతులకు లోబడుట. మార్చుకొనవలసి వచ్చినది. మహ్మదీ యులకు లోబడిన జాతులన్నిటికిని, ఈ పరిస్థితియే పట్టినది. లోకములో, అనాది నుండియు, స్వంత ఆదర్శములను జీవిత పద్ధతులను, ఎన్ని అవాంతరములు వచ్చిననూ, మార్చుకొనక, ధారావాహికగా ప్రవహించు సంస్కృతి గలది ఒక్క హిందూజాతియే. పరులకు లోబడుటవలన, మనకు నష్టము కలుగలేదనికాదు, బహుకాలము మహమ్మదీయ జాతులకును, క్రైస్తవజాతులకును లోబడియుండుట చేత, మన సంస్కృతి చాల సంకుచితమై శాఖోపశాఖలగా విజృంభించుటకు అపకారము లేక వికారమును పొందియున్నది. మనజాతి యొక్క చరిత్రలో విలాసవంతమైన కిరణములు కలిగినపుడెల్లను ఆదర్శప్రాయముగా జీవించి లోకమునకు సందేశముల నిచ్చియుంటిమి. ప్రతి బంధకములు కలిగినపుడు సంకుచితములు పొందినను, ప్రతి బంధకములు నివర్తి అయినపుడెల్లను తిరిగి విజృభించుచునే యుంటిమి.

ఇప్పుడు మనకు బంధ విముక్తి అయి సంపూర్ణ వికాసముపొంది లోకములో ఆదర్శప్రాయమైన జీవితమును గడుపుటకు అవకాశము లభించినది. ఇప్పుడు మనకు, మత ప్రసక్తిలేని ప్రభుత్వము స్థాపించుకొనవలయునని మన నాయకులు ప్రయత్నించుచున్నారు. మహాత్మాగాంధియును యిట్టిపద్ధతినే మనకు సూచించి యుండెనని భ్రమలో కూడనున్నాము. మహాత్ముని యొక్క జీవితమును పరిశీలించిన యెడల ఉత్తమ మతాదర్శములతో కూడిన ప్రభుత్వమునే అవలంబించవలయునని సూచించినట్లు నేను గ్రహించుచున్నాను. ఆయన ఉద్యమముల నన్నింటికిని సత్య అహింసనే సాధనములగను, ఆదర్శములగను బోధించి యున్నారు. హిందూ మతము యొక్క ఉత్తమ ఆదర్శములు సత్యాహింసల కంటే భిన్నమైనవని ఎవరునూ చెప్పసాహసించరు. హిందూదేశ మత చరిత్రను లోతుగ పరిశీలించిన యెడల మన మత చరిత్ర అంతయు, సత్యాహింసల యొక్క జయాపజయములను సూచించినదిగనున్నది. పోనిమ్ము, మన రాజకీయ నాయకులు ఈ రెంటిని కాదనుచున్నారా? లేదు. గాంధీ గారికినీ, తమకునూ గూడ ఈ రెండే ఆదర్శములనుచున్నారు. నూతన రాజ్యపాలనమును ఈ రెంటి సత్యములపైననే ఆధారము చేసుకొని రాజ్యసౌధమును నిర్మించవలయుననుచున్నారు. ఇట్టి పరిస్థితులలో మత ప్రసక్తి లేని రాజ్యమును సంస్థాపించగోరుచున్నామని చెప్పుట నాకు అర్థమగుటలేదు. వారికైనను అర్ధమైనదా?

హిందూ దేశములో, హిందూ మతమునకు సంబంధించని క్రైస్తవ, మహమ్మ దీయ మతస్థులున్నారు. వారిని నిర్బంధించి హిందూమతము సిద్ధాంతములను అవలంబింపజేయుట నా ఉద్దేశ్యము కాదు. ఆ మతములవారు సత్యాహింసలు తమ మతమునకు భిన్నమని వాదించినచో, వారి మార్గములను, వారు అవలంబించుటకు మన నాయకులు అవకాశమిత్తురా? అహింసా పద్ధతులను సాధనముగా నుపయోగించు సంఘములనన్నింటిని నిషేధించి అణచివేయుచుండుట లేదా? హింసా పద్ధతులనవలంబించు ఖాక్సారులను, సిక్కులను, కమ్యూనిస్టులను అణచివేయుచుండుటలేదా? హిందూదేశములో సత్యాహింసలపై ఆధారపడిన ప్రభుత్వమును స్థాపించుటమాత్రమేగాక, లోకమునకంతటికిని, ఈ సూత్రములనే వర్తింపజేయుదుమని ప్రకటించుచున్నారు గదా! ఆత్మవత్సర్వభూతాని య:పశ్యతి సపండిత: 2. తనయందు విధి భూతములందు నొకభంగి, సమహితత్వంబును జరుగువాడు 3. సత్యమేవ జయతే 4.అపకారికి నుపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరిసుమతీ 5. అహింసా పరమో ధర్మ: 6. ఉదారచరితానాంతు వసుదైవ కుటుంబకం.

ఈ పై జెప్పిన మహావాక్యములవంటివి, వేదముల నుండియు భారత, రామాయణ, భాగవతములనుండియు చూపవచ్చును. హిందూమత సారము ఇంత కంటె భిన్నమని ఎవరునూ చెప్ప సాహసించరు. ఈ సూత్రములను లోకమునకు ప్రసాదించిన వ్యాస, వాల్మీక, వసిష్ఠాది మహర్షులను, మను బుద్ధ జినాది మత కర్తల పేర్లను త్రోసిపుచ్చి వారిసిద్ధాంతములను పరమోత్కృష్టమైనవిగా స్వీకరించుచూ, ఈ సిద్ధాంతములను తాము క్రొత్తగా పుట్టించినట్లు మత ప్రసక్తిలేని రాజ్య పాలన మును స్థాపించుచున్నామనుట లోకమును మోసవుచ్చుట, మరియునూ, క్రైస్తవులును, మహమ్మదీయులును ఈ సిద్ధాంతమును పూర్తిగ అవలంబింపలేకపోయినను వీటిని పూర్తిగ పనికిరావందురని చెప్పుట సాహసము. ఈ నూతన ధర్మములను పేరు ప్రతిష్ఠ లేని, తమ పేరు ప్రకటించుకొనుటకంటె ఆదికర్తలైన మహర్షుల పేరనే ప్రకటించుట ఆ సూత్రములకు ఎక్కువ గౌరవము కలిగించి ఆ మహర్షులకు మన కృతజ్ఞత తెలిపినవారము కూడ నగుదుము. సత్యమునందు గౌరవము గల వారందరును మన నాయకుల ప్రకటనలలోని అసత్యమును వెలువరింతురుగాక!



**ఉన్నవ లక్ష్మీనారాయణ**

**30.03.1949 'జాగృతి' నుంచి**

# నేరమయ రాజకీయాల

**రాజకీయాలు నేరమయం కావడం కాంగ్రెస్ పాలనలోనే ఆరంభమైంది. తరువాత ప్రాంతీయ పార్టీలు ఈ సంప్రదాయాన్ని అందిపుచ్చుకుని, కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టేశాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను తమ మీదకు పంపుతూ వేధిస్తున్నదని విపక్షాలు మొదటిసారి సుప్రీంకోర్టును ఆశ్రయించాయంటేనే ఈ దుష్ట సంప్రదాయంలో ఎవరిది ఎంత పాత్ర అన్న విషయం తెలిసిపోతుంది. బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో పుట్టిన ప్రాంతీయ పార్టీలు నేర రాజకీయాలను ఇంకాస్త పెంచి పోషించాయి. విపక్షాలను ఏ విధంగా అదుపులో ఉంచాలో కాంగ్రెస్ పార్టీ అందరికీ నేర్పించింది. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని స్వపర భేదం లేకుండా తనకు కంటిలో నలుసులా మారిన రాజకీయ నేతలను, పార్టీలను యథేచ్ఛగా వేధించిన చరిత్ర కాంగ్రెస్‌ది.**

గట్టి నాయకుడనుకున్న వాడిని కూరలో కరివేపాకులా ఉపయోగించుకొని తరువాత పక్కన పెట్టడంలో కాంగ్రెస్‌ది అందెవేసిన చెయ్యి. ఉదాహరణకు కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి మార్చి 21, 2013న డీఎంకే మద్దతు ఉపసంహరించుకున్నది. సరిగ్గా రెండు రోజులకు కార్ల స్మగ్లింగ్ కేసులో చెన్నైలోని స్టాలిన్ ఇంటిపై సీబీఐ దాడులు జరిగాయి. ఈ వార్త తెలుసుకున్న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ హతాశులయ్యారు. 'ఈ దాడులు దురదృష్టకరం. ప్రభుత్వం ఈ పని చేయించలేదు. దీనికి బాధ్యులెవరో తెలుసుకుంటాం' అని అన్నారాయన. సీబీఐ దాడుల గురించి తనకు తెలియదన్న విషయాన్ని ఆయన చెప్పకనే చెప్పారు. బోఫోర్స్, మాయావతి, జగదీష్ టైట్లర్, ములాయంసింగ్ యాదవ్, సిబూ సోరేన్, జయలలిత, జగన్‌మోహన్‌రెడ్డి, స్టాలిన్ వంటి నేతలు సీబీఐ దాడులకు గురైనవారే. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పోలీసు విభాగంపై తమ పట్టును వదలవు. కేంద్రం విషయం వస్తే సీబీఐ పేరు, రాష్ట్ర ప్రభుత్వాల దమనకాండ పేరు చెప్పాలంటే పోలీసు వ్యవస్థ గుర్తుకు వస్తాయి.

సీబీఐ బాస్‌ల సేవలకుగాను ప్రతిఫలం పొందిన దాఖలాలు లేకపోలేదు. సీబీఐ డైరెక్టర్ అశ్వినీకుమార్‌ను నాగాలాండ్ గవర్నర్‌గా నియమించారు. 2008 ఆగస్టు నుంచి 2010 నవంబర్ మధ్య ఆయన సీబీఐ డైరెక్టర్. పదవీ విరమణ చేసిన సీబీఐ డైరెక్టర్‌ను గవర్నర్‌గా నియమించిన తొలి సంఘటన ఇది. ఇదే కాదు, నాటి కాంగ్రెస్ వైఖరికి ములాయం ఉదంతం మరో ఉదాహరణ. 2007లో ఆయనపై సీబీఐ అక్రమ ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆయనతో పాటు అఖిలేష్ యాదవ్, డింపుల్ యాదవ్‌లను కేసులో భాగస్వాములను చేసింది. విచిత్రంగా భారత్-యుఎస్‌ల మధ్య కుదిరిన పౌర అణు ఒప్పందాన్ని నిరసిస్తూ వామపక్షాలు జులై 22, 2008న యూపీఏకు మద్దతు ఉపసంహరించాయి. ఈ క్లిష్ట పరిస్థితిలో ములాయంసింగ్ సమాజ్‌వాదీ పార్టీ మద్దతు ఇచ్చి, యూపీఏ ప్రభుత్వాన్ని గట్టెక్కించింది. అదే ఏడాది నవంబర్ 8న అప్పటి న్యాయశాఖ మంత్రి భరద్వాజ్, నాటి సొలిసిటర్ జనరల్ నానావతిని ములాయంపై కేసు విషయంలో అభిప్రాయాన్ని కోరగా, క్లీన్ చిట్ ఇవ్వాలని సిఫారసు చేస్తూ ఆరుపేజీల నివేదికను సమర్పించారు. నవంబర్ 17, 2008న ఆ ఫైలుపై భరద్వాజ్ సంతకం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడినందుకు కాంగ్రెస్, కేసు నుంచి విముక్తి చేసినందుకు ములాయం పరస్పరం కృతజ్ఞతలు తెలుపుకొని ఉండవచ్చు!! అయితే ఈ ముచ్చట ఎంతోకాలం కొనసాగలేదు. 2011 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్- సమాజ్‌వాదీల మధ్య సీట్ల పంపకంలో తేడాలు వచ్చాయి. మళ్లీ సీబీఐ రంగంలోకి దిగింది. సొలిసిటర్ జనరల్ ఇచ్చిన నాటి సిఫార్సును పట్టించుకోవద్దని సుప్రీం కోర్టును అభ్యర్థించింది. సరిగ్గా ఇదేసమయంలో అంటే 2012 శీతాకాల సమావేశాల సందర్భంగా రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించిన బిల్లుపై పార్లమెంట్‌లో ఓటింగ్‌లో పాల్గొనకుండా ఎస్‌పీ, బీఎస్పీ వాకౌట్ చేయడంతో యూపీఏ ప్రభుత్వం మళ్లీ గట్టెక్కింది. దీని ఫలితమేంటన్నది వివరించాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ చేతిలో బీఎస్పీ అధినేత మాయావతి కూడా సరిగ్గా ఇటువంటి అనుభవాన్నే చవిచూశారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ కూడా కాంగ్రెస్ ప్రయోగించిన సీబీఐ బాధితులే. తన తండ్రి వై.ఎస్.ఆర్ ఆకస్మిక మరణం తర్వాత జగన్ ముఖ్యమంత్రి కావాలని ఆశించారు. సోనియా గాంధీ ఆయన్ను కొద్దికాలం వేచి ఉండమని కోరితే అందుకు తిరస్కరించి హైకమాండ్‌పై తిరుగుబాటు చేశారు. ఫలితంగా జైలుకెళ్లాల్సి వచ్చింది. చివరకు 2011 మార్చి 11న ఆయన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చారు. లక్ష్యం మేరకు జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టినా అక్రమాస్తుల కేసులలో సీబీఐ కత్తి వేలాడుతూనే ఉంది!

**చట్టసభల్లో నేరచరితులు**

అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) ప్రస్తుత పార్లమెంట్‌లో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న సభ్యుల వివరాలు తెలిపింది. దీని



ప్రకారం ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 302 కింద హత్యకేసులను ఎదుర్కొంటున్న ఎంపీల సంఖ్య 11. హత్యాయత్నం కేసులలో ఐపీసీ 307 సెక్షన్ కింద కేసులు ఎదుర్కొంటున్నవారు 32 మంది! ఈ సంస్థ నవంబర్ 7వ తేదీన ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రస్తుత పార్లమెంట్‌లో (లోక్‌సభ, రాజ్యసభల్లో) మొత్తం 763 సిట్టింగ్ ఎంపీల్లో 306 (40%) మంది తాము మహిళలపై నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయని అంగీకరించారు. వీరిలో 194 (25%) మందిపై ఉన్న అభియోగాలు చాలా తీవ్రమైనవని పేర్కొంది. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికైన ఎమ్మెల్యేల్లో 44శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయని వెల్లడించారని ఎ.డి.ఆర్. నివేదిక వెల్లడించింది. ఎ.డి.ఆర్., నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈ డబ్ల్యు) ఉమ్మడిగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఎం.ఎల్.ఎ.లు ఎన్నికలకు ముందు సమర్పించిన స్వీయ అఫిడవిట్‌లను పరిశీలించి ఈ నివేదికను విడుదల చేశాయి. 28 రాష్ట్రాల అసెంబ్లీలు, రెండు

# పాపం ఎవరిది?

కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 4033 ఎమ్మెల్యే ల్లో 4001 ఎమ్మెల్యేలకు సంబంధించిన విశ్లేషణ ఇది! వీరిలో 1136 (28%) మంది తీవ్రమైన నేరాభియోగాలు ఎదుర్కొంటున్నారు. కేరళలో 135 ఎమ్మెల్యేల్లో 95 (70%)మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. బిహార్‌లో 242మంది ఎమ్మెల్యేల్లో 161(67%) మంది, ఢిల్లీలో 70మంది ఎమ్మెల్యేల్లో 44 మంది (63%), మహారాష్ట్రలో 284 ఎమ్మెల్యేల్లో 175 (62%), తెలంగాణలో 118 మంది ఎమ్మెల్యేల్లో 72 మంది (61%), తమిళనాడులో 224మందిలో 134 ఎమ్మెల్యేలు (60%), ఉత్తరప్రదేశ్‌లో 403 ఎమ్మెల్యేల్లో 155 మంది (38%)తమపై క్రిమినల్ కేసులున్నాయని సెల్ఫ్ డిక్లరేషన్లలో పేర్కొన్నట్టు నివేదిక వెల్లడించింది. అన్ని



రాష్ట్రాలకు సంబంధించిన మొత్తం ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ రూ.13.63 కోట్లు కాగా, క్రిమినల్ కేసులున్నాయని ప్రకటించిన ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ రూ.16.36 కోట్లు! అదే తమపై ఏ విధమైన క్రిమినల్ కేసులు లేవని ప్రకటించిన ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ రూ.11.45 కోట్లు కావడం గమనార్హం.

**నేరచరితులపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం**

తీవ్రమైన నేరాలకు పాల్పడే ఎంపీలు, ఎమ్మెల్యేలపై జీవితకాలం నిషేధం విధించాలని (క్రిమినల్ కేసులకు సంబంధించి) కోరుతూ వేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు అటువంటి కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించి చర్యలు తీసుకునే బాధ్యతలను హైకోర్టులకు అప్పగించింది. అశ్వనీ ఉపాధ్యాయ్ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై నవంబర్ 9న విచారణ చేపట్టింది. ప్రజా ప్రతినిధులపై క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించే విషయంలో ఒకేవిధమైన మార్గదర్శకాలు రూపొందించడం కష్టమని పేర్కొంటూ ఈ బాధ్యతలను హైకోర్టులకు అప్పగించడమే కాదు అందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించింది. అయితే నేరం నిరూపణ అయిన ప్రజా ప్రతినిధులపై జీవితకాలం నిషేధం విధించాలన్న విజ్ఞప్తిపై విచారణను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. విచారణలో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించడంపై మాత్రమే మార్గదర్శకాలు జారీచేయడం గమనార్హం.

**సుప్రీంకోర్టుకు వెళ్లిన 14 పార్టీలు**

పరువునష్టం కేసులో సూరత్ కోర్టు రాహుల్‌కు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 24న, దేశంలోని 14 రాజకీయ పార్టీలు సుప్రీం కోర్టు తలుపుతట్టాయి. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తమపై సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తూ కేసుల్లో ఇరికిస్తున్నదంటూ తమ పిటిషన్‌లో ఆరోపించాయి. యూపీఏ కూటమిలోని కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ. నేషనలిస్ట్ కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా, జమ్ము-కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు, వైఎస్ఆర్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి, శివసేన, జనతాదళ్ (యునైటెడ్), సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్), సీపీఐ, జనతాదళ్ సెక్యులర్, ఆల్ యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ వంటి పార్టీలు ఈ పిటిషన్‌లో పార్టీలుగా ఉన్నాయి. దేశ చరిత్రలోనే ఇన్ని పార్టీలు ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై పిటిషన్ వేయడం ఇదే ప్రథమం. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదనేది వీటి ప్రధాన ఆరోపణ.

ఈ నేపథ్యంలో న్యాయ వ్యవస్థ ఈ విషయంలో కల్పించుకొని, కేంద్రాన్ని కట్టడి చేయాలని కోరాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక 124 మంది నాయకులపై సీబీఐ విచారణ జరిపితే అందులో 119మంది విపక్షనేతలే. అదే 2004-14 మధ్యకాలంలో 72 మంది రాజకీయ నాయకులపై విచారణ జరపగా వీరిలో కేవలం 43 మంది విపక్షనేతలని, ఈ గణాంకాలను పరిశీలిస్తే మోదీ ప్రభుత్వం విపక్షనేతలపై కక్ష కట్టినట్టు తేలుతుందని అవి పేర్కొన్నాయి. రాజ్యాంగానికి లోబడి నిర్వహించే రాజకీయ కార్యకలాపాలకు ఈ వైఖరి చాలా ప్రమాదకరమని అవి తమ పిటిషన్‌లో పేర్కొన్నాయి. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఏప్రిల్ 5న కేసును తిరస్కరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్, జె.బి. పార్దీవాలాతో కూడిన ధర్మాసనం 14 పార్టీలు దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి తిరస్కరించింది. 'మీరు ఒక నిర్దిష్ట విషయంలో కోర్టు తలుపు తట్టండి అంతేకాని ఏవో కొన్ని గణాంకాలను చూపుతూ చర్యలు తీసుకోమనడం ఉచితం కాదు. బాధిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించవచ్చు. రాజకీయ నాయకులు కూడా దేశ పౌరులే. అందువల్ల అరెస్టుల నుంచి ప్రత్యేక రక్షణను పొందజాలరు. కక్షసాధింపు వంటి అంశాలకు పరిష్కారం రాజకీయ పరంగా లభిస్తుంది తప్ప, కోర్టుల్లో కాద'ని స్పష్టం చేశారు. విపక్షాల తరపున వాదించిన అభిషేక్ సింఘ్వి న్యాయ మూర్తులను తన వాదనతో అంగీక రింపజేయలేక పోవడంతో, కేసును ఉపసంహరించు కోక తప్పలేదు.

దేశంలో రాజకీయాలు నేరమయం కావడం 1970 తర్వాత నుంచి ప్రారంభమైంది. వీటిపై నియమించిన వోహ్రా కమిటీ 1993 అక్టోబర్‌లో సమర్పించిన నివేదికలో రాజకీయనాయకులు గ్యాంగ్ లీడర్లుగా ఏ విధంగా మారుతున్నది స్పష్టంగా వివరించింది. ఫిబ్రవరి 13, 2020న జస్టిస్ నారిమన్, జస్టిస్ ఎస్.రవీంద్రభట్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం రాజకీయ పార్టీలు లోక్‌సభ, అసెంబ్లీలకు పోటీచేసే తమ అభ్యర్థుల కుటుంబాల నేరచరిత్రను ప్రచురించాలని ఆదేశించింది. అటువంటి అభ్యర్థిని ఎందుకు ఎంపిక చేసిందీ, అతని అభ్యర్థిత్వాన్ని ఆమోదించిన 48 గంటల్లోగా సదరు రాజకీయపార్టీ ప్రచురించాలని కూడా స్పష్టం చేసింది.

కానీ నేటివరకు రాజకీయ పార్టీలు దీన్ని పాటిస్తున్న దాఖలాలు లేవు. 2004 (24%), 2009 (30%), 2014 (34%), 2019 (43%) సంవత్సరాల్లో వరుసగా నేరచరితుల సంఖ్య పెరుగుతూ వస్తోందే తప్ప తగ్గడంలేదు. ఈవిధమైన నేరమయ రాజకీయాలు, అవినీతి, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి నేర చరితులకు, వారిని నిలబెట్టిన పార్టీలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రచారం చేయడం తప్ప మరోమార్గం కనిపించడంలేదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# ఉత్తమ పర్యాటక గ్రామం ధోర్డో : ఐరాస ప్రకటన









"అత్యంత విలువైన సాంస్కృతిక వారసత్వానికి, సహజసిద్ధమైన అందానికి చిహ్నంగా కచ్ ప్రాంతంలోని ధోర్డో ప్రాంతం ఎంపిక కావడం అత్యంత ఆనంద దాయకం. ఈ గౌరవం భారత పర్యాటకం సామర్థ్యాన్ని నిరూపించడమే కాకుండా ప్రత్యేకించి కచ్ ప్రాంత ప్రజల అంకిత భావానికి కూడా ప్రతీక.

– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

గుజరాత్ లోని ధోర్డోను కచ్ ఎడారిలో పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న చిట్టచివరి గ్రామం. ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ (యుఎన్ డబ్ల్యుటిఒ) అక్టోబరు 19వ తేదీన గుజరాత్‌లోని కచ్ జిల్లాలో గల ధోర్డోను ఉత్తమ పర్యాటక గ్రామంగా ప్రకటించింది. ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు పొందిన ధోర్డో గ్రామాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ముఖ్యమంత్రిగా తన పాలనాకాలంలో గుజరాత్‌లోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే కార్యానికి శ్రీకారం చుట్టిన మోదీకి ఇది ఎంతో హర్షాన్ని కలిగించే విషయం అని చెప్పడం అతిశయోక్తి కాబోదు. గుజరాత్‌లో నీటమునిగిన ద్వారక ఆవశేషాలు, సోమ్‌నాథ్, ద్వారాకాధీశుని ఆలయాలు, మధేరా సూర్య దేవాలయం, డూంగర్ దత్తాత్రేయుని ఆలయంతో పాటు ఆధునికతకు అద్దంపట్టే సైన్స్ సిటీవంటివన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే కచ్ ప్రాంతం ఒక ఎత్తు.

గుజరాత్ పర్యటనకు వెళ్ళినప్పుడు, కచ్ ప్రాంతాన్ని చూడకపోతే మీ పర్యాటక అనుభవం పరిపూర్ణం కాదు అని చెబుతూ ఉంటారు. 'కచ్ నహీ దేఖాతో కుఛ్ నహీ దేఖా' అన్న నినాదం అలా పుట్టిందే. ఎందుకంటే, ఇక్కడ ప్రకృతి తన అద్భుతాలను ప్రదర్శిస్తూ ఉంటుంది. ఎడారి ప్రాంతమే కదా అని భావించి, నిర్లక్ష్యం చేయడానికి లేదు. ప్రకృతి దేని అందాన్ని దానికి ప్రసాదిస్తుంది. నిజానికి ఎడారి అనగానే వెంటనే మన కళ్ళముందు కదిలేవి ఇసుకతిన్నెలు. కానీ కచ్ ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ అవి పెద్దగా దర్శనమివ్వవు. టెక్టోనిక్ కార్యకలాపాల ద్వారా ఈ ప్రాంతం సముద్రంలో నుంచి బయటపడిందిట. ప్రత్యేకించి రుతుపవనాల సమయంలో వర్షపాతం సందర్భంగా ఈ ప్రాంతంలో సముద్రపు నీరు వరదలై పారుతుంది. చలికాలం ప్రవేశించిన నాటి నుంచి వాన నీరు ఆవిరైపోయి ఆ ప్రాంతం ఉష్ణ మండల ఉప్పు ఎడారిగా మారిపోతుంది. మంచా అని భ్రమించేట్టుగా ఒక పెద్ద తెల్లని ఉప్పు పొర పరిచినట్టుగా కనిపిస్తుంది. చంద్రుడు ప్రకాశించే రాత్రుల్లో చంద్రుడు భూమి పైకి దిగి వచ్చాడా అన్న అనుభూతిని కలిగిస్తుంది.

ఉప్పు మండల ఎడారిగా ఉన్న ప్రాంతంలో కూడా ఇంత సౌందర్యం ఉంటుందని ఊహించలేం! 2006 సంవత్సరంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో నరేంద్ర మోదీ సరిహద్దుల్లోని ఈ చివరి గ్రామాన్ని తొలి గ్రామంగా పరివర్తన చేయాలని భావించారు. అయిదు సంవత్సరాల క్రితం భూకంపానికి గుర్తు పట్టలేనంతగా ధ్వంసం అయిన ఈ ప్రాంతం రూపురేఖలు మార్చాలని కలలు గన్నారు. కచ్‌లో విలాసవంతమైన అతి పెద్ద టెంట్ సిటీని ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో పరిశీలించారు. కాని, ఆ ప్రాంతంలో అంత భారీ మానవ నిర్మిత మౌలిక వసతి నిర్మాణం సాధ్యం కాలేదు. ఆయా రంగాలకు చెందిన నిపుణులను కూడా దీనిని సాకారం చేసేందుకు తీసుకువచ్చారు. ఇక్కడ ప్రపంచ శ్రేణి పర్యాటక కార్యకలాపాలతో కూడిన సదుపాయం ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించారు. కచ్ ప్రాంతంలో బన్నీ పచ్చికబయళ్ళు గల రక్షిత ప్రాంతంలో రాత్రి 8 గంటల తర్వాత తళుకు తళుకు మంటూ గాల్లో తిరుగుతూ కనిపించే చిన్న, పెద్ద దీపాలు నృత్యం చేస్తున్నట్టు ఉంటుంది. ఇవి మెర్క్యురీ దీపాల్లా మెరుస్తూ ఉంటాయి. కాగా, చిత్తడి నేలల్లో జీవపదార్థం కుళ్ళినప్పుడు ఉత్పత్తి అయ్యే మెథేన్ కారణంగానే ఇవి ఇలా మెరుస్తూ కనిపిస్తాయని కొందరు శాస్త్రవేత్తల భావన.

మట్టితో నిర్మించిన ఇళ్లలో నివసిస్తున్న అనుభూతిని పర్యాటకులకు అందించేందుకు కొత్తగా వచ్చినవారికి ఆతిథ్యం ఇవ్వడంలో స్థానిక ప్రజలకు శిక్షణ ఇచ్చారు. ఫలితంగా ఒకప్పుడు జీవం లేనిదిగా కనిపించే ధోర్డోలో అనేక హొటళ్లు, ఇతర వసతులు ఏర్పడి, పర్యాటక పరిశ్రమ ఆవిర్భవించింది. కాని, ఈ చర్యలేవీ సరిపోలేదు. తొలుత గుజరాత్ సిఎంగాను, ఆ తర్వాత పిఎంగాను నరేంద్ర మోదీ మీడియాలో ధోర్డో గురించిన వార్తలు ప్రముఖంగా రావాలని భావించి 'రాన్ ఉత్సవ్' నిర్వహణను అన్నిరకాలుగాను ప్రోత్సహించారు. శతాబ్దాల చరిత్ర గల కచ్‌కు చెందిన మట్టి, వెండి, తోలు హస్తకళా ఉత్పత్తులను ప్రోత్సహించారు. ఇది కచ్ ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజాన్ని అందించింది. దాంతో నేడు ధోర్డో గ్రామం పెద్ద పర్యాటక కేంద్రంగా ఆవిర్భవించింది. ప్రతీ ఏడాది లక్షలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తూ ఉంటారు. స్థానిక ప్రజలకు కోట్లాది రూపాయల వ్యాపారావకాశం అందుబాటులో ఉంది. పిఎం నరేంద్ర మోదీ ఎంతో శ్రమకోర్చి తీసుకున్న చర్యల కారణంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ధోర్డోను ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తించింది. ధోర్డో గ్రామానికి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ, ప్రధానమంత్రి 2009, 2015 సంవత్సరంలో తాను ఆ గ్రామాన్ని సందర్శించినప్పటి చిత్రాలను ఎక్స్‌పై పంచుకున్నారు.

**– న్యూ ఇండియా సమాచారం నుండి**

# జి-20 శిఖరాగ్ర ఫలితం ప్రపంచ వ్యవస్థలో వేగం



జీ-20కి భారతదేశ అధ్యక్షత నవంబరు 30వ తేదీ వరకు ఉంటుంది. భారత అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగిన నాయకుల శిఖరాగ్ర సదస్సు ప్రకటన రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ వ్యవస్థను పునర్నిర్మిం చేందుకు సహాయకారిగా నిలుస్తుంది. ప్రధాన శిఖరాగ్రం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదన మేరకు ఒక దేశం దృశ్యమాధ్యమ విధానంలో శిఖరాగ్రం నిర్వహించడం ఇదే ప్రథమం.

న్యూఢిల్లీలో జి-20 ముగింపు రోజున ఒకవైపు బ్రెజిల్‌కు బాధ్యతను అప్పగిస్తూనే, నవంబర్ 30వరకు అధ్యక్షత బాధ్యతలు భారత్‌కే ఉంటాయని, ఈ సమావేశంలో ఆమోదించిన అంశాల పరిస్థితి ఏమిటన్న విషయాన్ని నవంబర్‌లో దృశ్యమాధ్యమం ద్వారా సమీక్షించుకుందామని ప్రధాని మోదీ ప్రకటించడం, అందుకు స్పందిస్తూ బ్రెజిల్ అధ్యక్షుడు తాము కూడా భారత్ వేసిన మార్గంలోనే పయనిస్తామని ప్రకటించడం మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అద్దం పడుతున్నది.

న్యూఢిల్లీ జి-20 నాయకుల శిఖరాగ్ర సదస్సు ప్రకటన అమలును వేగవంతం చేయడానికి కీలక అంశాలపై ఏడు వెబినార్లు నిర్వహించనున్నారు.

న్యూఢిల్లీలో జి-20 నాయకుల ప్రకటన అమలులో ఇప్పటి వరకు జరిగిన పురోగతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శి పి.కె.మిశ్రా అక్టోబరు 18వ తేదీన సమీక్షా సమావేశం నిర్వహించారు. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, జి-20 షెర్పా, జి-20 చీఫ్ కోఆర్డినేటర్‌లతో పాటు విదేశాంగ శాఖ, ఆర్థిక వ్యవహారాల శాఖ, నీతి ఆయోగ్ సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగానే జి-20 వర్చువల్ సమావేశం, వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ శిఖరాగ్రం 2.0కు ఏర్పాట్ల గురించి కూడా సమీక్షించారు. న్యూఢిల్లీ ప్రకటన అమలును వేగవంతం చేసే చర్యల్లో భాగంగా అత్యున్నత స్థాయి పర్యవేక్షక యంత్రాంగం ఏర్పాటు చేయడంతో పాటు ఏడు వరుస వెబినార్లు నిర్వహిస్తారు.

న్యూఢిల్లీలో నాయకుల ప్రకటన సమర్థవంతంగా అమలు చేయడానికి సంబంధిత రంగానికి చెందిన నిపుణుల నుంచి సమాచారం సేకరిస్తారు. ఇందుకోసం దేశంలోని మేధావులు అందరితో ఒక సెమినార్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశ 'నాయకుల ప్రకటన' విజయవంతంగా అమలుచేయడానికి ప్రభుత్వ అంకితభావాన్ని ప్రతిబింబించడంతో పాటు జి-20 అధ్యక్షత 'సమ్మిళితం, ఆకాంక్షాపూరితం, ప్రజా కేంద్రీకృతం" అయిన నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమంలో ప్రపంచ సహకారాన్ని సాధించడాన్ని ప్రోత్సహిస్తుంది. భారతదేశ అధ్యక్షతన 200 పైగా సమావేశాలు జరిగాయి. జి-20ని అసలు, సిసలు 'ప్రజా కేంద్రీకృత జి-20' గా మార్చింది భారతదేశమే. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోనూ సమావేశాలను నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సాధారణ ప్రజలకు కూడా జి-20 అంటే ఏమిటో తెలియచెప్పారు. అలాగే వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులకు భారతదేశంలోని సాంస్కృతిక, భాషాపరమైన , ప్రాంతీయ వైవిధ్యతలను పరిచయం చేయడం ద్వారా భారత్ అంటే ఏమిటో వారికి తెలియచెప్పారు.

వెబినార్‌ల కోసం ప్రతిపాదించిన అంశాలు ఇవే...

- శక్తిమంతమైన, సుస్థిర, సమతూక, సమ్మిళిత అభివృద్ధి
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్.డి.జిస్) పురోగతి వేగవంతం
- సుస్థిర భవిష్యత్ కోసం హరిత అభివృద్ధికి లాంఛనప్రాయ అంగీకారం
- 21వ శతాబ్దికి బహుముఖీన సంస్థలు
- సాంకేతికపరమైన మార్పులు, డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులు
- మహిళా-చోదక అభివృద్ధి
- ఉగ్రవాదం, మనీ లాండరింగ్ పై పోరాటం

జి20 సదస్సులో ప్రసంగిస్తూ, ప్రజాస్వామ్యానికి మాతృక భారత దేశమని, చర్చలు, ప్రజాస్వామిక సూత్రాలపై ప్రాచీనకాలంగా దానికి గల విశ్వాసం తిరుగులేనిదని, అంతర్జాతీయ సమాజానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియచెప్పడం కూడా ఒక కీలక విషయంగా చెప్పుకోక తప్పదు. దీనితో పాటుగా ప్రపంచ వేదికపై తమ ప్రవర్తన అన్నది భారతీయతకు మౌలిక సూత్రమైన 'వసుధైవ కుటుంబకం' అన్న భావనపై ఆధారపడి ఉంటుందని, ఈ భావన ప్రతి భారతీయుడినీ భూమి పట్ల బాధ్యతాయుతంగా అనుసంధానమయ్యేలా చేస్తుందని కూడా ఆయన చెప్పడం భారతదేశం పర్యావరణ మార్పు విషయంలో ఎంత బాధ్యతతో ప్రవర్తిస్తుందో పట్టి చూపుతూ పాశ్చాత్య దేశాల వినిమయ ధోరణిని ఎత్తి చూపింది. నాయకుల ప్రకటన ప్రపంచ వ్యవస్థను తిరిగి తీర్చి దిద్దేందుకు ఉపయోగపడే నేపథ్యంలో 'ఒక భూమి', 'ఒక కుటుంబం' స్ఫూర్తితో భారత జి-20 అధ్యక్ష ఫలితాల అమలు దిశగా భారతదేశం ముందుకు సాగుతోంది. ★



# జలవనరులు వెలవెల రైతన్నలు విలవిల

**రాష్ట్రంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులు రాబోయే కరవును సూచిస్తున్నాయి. పదేళ్లలో ఎన్నడూ లేనంత తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధాన జలాశయాలైన తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, వెలిగోడు, సోమశిల, కండలేరుల్లో నీరు అడుగంటింది. వీటిలో గత సంవత్సరం ఇదే సయయానికి 807.69 టీఎంసీల నీటి నిల్వలు ఉంటే ప్రస్తుతం 343.41 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. వర్షాలు పడక, ప్రాజెక్టుల నీటిమట్టం, భూగర్భజల నీటిమట్టం తగ్గిపోవటంతో సాగులో ఉన్న పంటలు ఎండిపోయి దిగుబడులపై ప్రభావం పడింది. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 34.39 లక్షల హెక్టార్లు కాగా 24.98 లక్షల హెక్టార్లు మాత్రమే సాగైంది.**

శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు చేయని ప్రయత్నం లేదు. కొందరు బోర్లు, బావులు తవ్వించి అయినా పంటను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు చెరువులు, కుంటల్లో అడుగంటిన బురద నీటినే మోటార్లు, డీజిల్ ఇంజిన్ల సాయంతో కిలోమీటర్ల కొద్దీ పైపులైన్లు వేసి తరలిస్తున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి తుడుపు తున్నారు. నాలుగైదు తడులు ఇవ్వాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇరిగేషన్ అధికారులను కలసి ఒక్క తడికైనా నీరివ్వాలని ప్రాధేయ పడుతున్నారు. అయినా ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేదు. ఎండ తీవ్రత అంత కంతకూ పెరుగుతోంది. ఈశాన్య రుతుపవనాలు వచ్చినా వర్షాభావం కొనసాగుతోంది. మరో నెల పొడి వాతావారణం కొనసాగితే పశుగ్రాసానికీ కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఖరీఫ్‌లో పంట వేయలేక పోయిన రైతులు రబీలో వేద్దామన్నా. పంటకు నీరు అందుతుందనే నమ్మకం లేదు. విత్తనం నాటితే మొలకెత్తే వాతావరణం లేని పరిస్థితి ఉంది.

రాష్ట్రంలోని 20 జిల్లాల్లో జూన్ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నా, భారత వాతావరణ శాఖ రికార్డుల ప్రకారం 26 జిల్లాల్లోనూ వానలోటు ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు నెలలో 10శాతం కూడా వాన పడలేదు. 679 గ్రామీణ మండలాలకుగాను 446 మండలాల్లో తీవ్ర వర్షాభావం కొనసాగుతోంది. 221 మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షమే పడింది. కేవలం12 మండలాల్లోనే అధికవర్షాలు కురిశాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు మినహా, రాయలసీమ, కోస్తాలోని మిగతా జిల్లాల్లో సగానికి పైగా మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. పంట వేసిన రైతులు గాలిలో దీపం పెట్టినట్లు భావిస్తున్నారు. వర్షాభావంతో పాటు, ఎండ తీవ్రతతో విత్తనం వేసినా మొలకెత్తడం కష్టమని, వాన పడితే చూద్దాంలే అన్నట్లు చాలామంది. రైతులు ఉన్నారు. ఈ సమయంలో రాయలసీమ, దక్షిణకోస్తాలో వానలు పడితేనే ఈ ప్రాంతాల్లో రబీ శనగ, వేరుశనగ, అపరాలు ఎక్కువగా సాగు చేసే అవకాశం ఉంది.

బాపట్ల జిల్లాలో సాగునీరందక వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కాలువల మరమ్మతులు చేపట్టక పోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని దుస్థితిని ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్నాడులో జిల్లాలో 3.14 లక్షల ఎకరాల్లో పత్తి, మిరప, కందిపంటల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. అన్నదాతలు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను కలసి సాగునీరు ఇప్పించాలని మొర పెట్టుకుంటున్నారు.

కృష్ణాజిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 4.10 లక్షల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. ప్రకాశం బ్యారేజీకి సమీపంలో ఉన్న కంకిపాడు, ఉయ్యూరు తదితర మం డలాల రైతులకు సైతం సాగునీరు సక్రమంగా అందడం లేదు. శివారు ప్రాంతా లైన కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తి వెన్ను, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోనూ నీరులేక ఎండిపోయే స్థితికి చేరాయి.

ప్రకారం జిల్లాలో ఖరీఫ్‌లో 5.36 లక్షల ఎకరాలకుగాను, రెండొంతులు మాత్రమే సాగైంది. వ్యవసాయశాఖ సమాచారం ప్రకారం 3.53 లక్షల ఎకరాలలో సాగైనట్లు ఉండగా ప్రధాన మెట్ట పంటలైన కంది, పత్తి విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఖరీఫ్‌లో రెండొంతుల విస్తీర్ణంలో మాత్రమే పైర్లు పడ్డాయి. అక్టోబరులో వర్షాలు పడక రబీ పంటల్లో ఏ ఒక్కటీ ముందుకు సాగలేదు. ప్రధానంగా ఈ సమయంలో జిల్లావ్యాప్తంగా పొగాకు విస్తారంగా సాగు చేస్తారు.

అన్నమయ్య జిల్లాలో పంటల పరిస్థితి దయనీయంగా తయారైంది.. ఈసారి వేరుశనగ పంట రైతును కుదేలు చేసింది. జిల్లాలో 40 వేల ఎకరాల్లో వేరుశనగ వేశారు. పంటకు అవసరమైన నీరందక మూడుకాయలు, ఆరు బుడ్డలుగా దిగుబడి ఉండడంతో బావురుమంటున్నారు. ఒకప్పుడు ఖరీఫ్ కాలంలో కళకళలాడే పంటభూములు ఇప్పుడు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో వందకు పైబడి చెరువులు, కుంటలు, లక్షకు పైబడి బోరుబావులు వంటి నీటి వనరులు వర్షాభావంతో పూర్తిగా అడుగంటాయి.

ఉమ్మడి కడప జిల్లాలో పెన్నానదిలో అరకొర వరదనీరు పోతుందే తప్ప, బాహుదా, చెయ్యేరు, గుంజనేరు, పుల్లంగేరులలో వర్షాలు లేక చుక్కనీరు లేకుండా ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాలకు పైబడి అరటి, మామిడి, నిమ్మ, బొప్పాయి, చెరువుల కింద సుమారు లక్ష ఎకరాల వరకు వరి పంటను సాగు చేస్తారు. అయితే గత రెండేళ్లుగా పూర్తిస్థాయిలో వర్షం కురవక పోవడంతో చెరువులన్నీ చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి.

అనంతపురం జిల్లాలో కరువు ఘంటికలు మోగుతున్నాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో

వర్షాలు పడక దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఖరీఫ్‌లో రైతులకు ఖర్చు మాత్రమే మిగిలింది. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలుపడి ఉంటే దాదాపు 4 లక్షల హెక్టార్లల్లో పంటలు సాగయ్యేవి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ సారి 2.40 లక్షల హెక్టార్లల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగు చేశారు. కీలక సమయంలో వర్షాలు లేకపోవడంతో పలు ప్రాంతాల్లో వేరుశనగ ఎండిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో పొలాల్లో చూసేందుకు పైరు పచ్చగా ఉన్నా కాయలు కాయలేదు. కొన్ని చోట్ల చెట్టుకు రెండు, మూడు కాయలు కాశాయి. చాలా చెట్లను పెరికి చూస్తే ఊడలు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

ఈసారి పంట దిగుబడి రాకపోవడంతో బాధిత రైతులు గుండెలు బాదుకుం టున్నారు. ఇప్పటికే విడపనకల్లు, గుత్తి మండలంలోని గొందిపల్లి, జక్కల చెరువు, గాజులపల్లి, కొత్తకోట, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో వేరుశనగ పంటను తొలగిం చారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా పంటను తొల గించేందుకు సిద్ధమవుతున్నారు.. వేరుశనగతోపాటు ఆముదం, పత్తి పంట కూడా చేతికందే పరిస్థితి కనిపించడం లేదు.

విజయనగరం జిల్లాలో పంటల సాగు దినదినగండంగా మారింది. ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలిపి 2.9 లక్షల ఎకరాల్లో సాగవగా, అత్యధికంగా 2.35 లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఇందులో లక్ష ఎకరాల వరకు నీటి ఎద్దడి నెలకొంది.

**విద్యుత్ కనోతలు**

లో ఓల్టేజీ సమస్యతో పాటూ విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి.వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్న ప్రభుత్వ హామీలు నీటి మూటలయ్యాయి. కనీసం ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు.

**మిర్చి రక్షణకు తంటాలు**

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టిన పంట కళ్లముందే ఎండి పోతుంటే ఆందోళన చెందుతున్నారు. ట్యాంకర్లతో రక్షక తడులు అందిస్తున్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు 80వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు చేశారు. ట్యాంకర్ల కోసం రూ.25-30 వేలు వెచ్చించవలసి వస్తోంది.

**స్పందించని ప్రభుత్వం**

పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడంలేదు. సమగ్ర సాగునీటి సరఫరా విధానాలను ప్రభుత్వం విస్మరించింది. వర్షాభావం వ్యవసాయంపై ప్రభావం పడింది. దీంతో గ్రామీణ రైతు కూలీలు పెద్ద ఎత్తున వలసలు పోతున్నారు. వందలాది గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అయినా, ముఖ్యమంత్రి వ్యవసాయం, ఉద్యాన, జలవనరుల శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించ లేదు. ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించలేదు. కరువు మండలాలుగా ప్రకటించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్న కనీస విజ్ఞత రాష్ట్ర ప్రభుత్వానికి కొరవడిందని విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల నుంచి ఆదుకునేందుకు వెంటనే సమీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని రైతాంగం ముఖ్య మంత్రిని కోరుతోంది.

ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. రబీ పంట కాలానికి అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలి. నష్టపోయిన పంటలను ఎన్యుమరేషన్ చేసి ఆహార పంటలకు నష్టపరిహారం చెల్లించాలి. వాతావరణ పంటల బీమా, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి వలసల నివారణకు చర్యలు చేపట్టాలి. ఖరీఫ్ కాలంలో రైతులు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల అప్పులను రద్దుచేసి, రబీ పంట కాలానికి తిరిగి వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. రబీలో పంటలు వేసే రైతాంగానికి 90శాతం సబ్సిడీతో విత్తనాలు, పశుగ్రాసం, దాణా ఉచితంగా అందించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**






3

# ఉపాసనతో పాటే విపరీత వ్యాఖ్యలు

రాముడేకాక వాల్మీకి రామాయణ గ్రంథం కూడా ఉపాసనా వస్తువులలో చేరిపోయింది. సుందరకాండను అనుష్ఠానంగా పఠించేవారు, ఆ కాండలోని శ్లోకాలను మంత్రశాస్త్రంగా ఉపయోగించే ఉపాసకులు నేటికీ ఉన్నారు. తండ్రి ఆజ్ఞకు బద్ధుడై రాజ్యాధికారాన్ని త్యజించి, వనవాసం వంటి అత్యంత కఠిన మైన పనికి సిద్ధపడిన వానికీ, తన ప్రియ భార్య కోరికపై మాయామృగాన్ని వేటాడిన మహాపురుషునికీ వందనం అనే వారిలో కూడా, తమ వ్యక్తిగత బలహీనతలను కప్పిపుచ్చుకోవడానికి ఇతర గ్రంథాలకు వలెనే రామాయణాన్ని కూడా వాడుకున్న ఉదాహరణలు దొరకుతాయి. మహాభారతంలోని సభాపర్వంలో యుధిష్ఠిరుడు తిరిగి జూదమాడడానికి సిద్ధమయి ఇలా అంటాడు.

*'అసంభవం హేమమృగస్య జన్మ*
*తథాపి రామో లులుభే మృగాయ।*
*ప్రాయః సమాపన్న విపత్తికాలే*
*ధియో పి పుంసాం మలినా భవన్తి'*

బంగరులేడి ఉండడం అసంభవమే అయినా శ్రీరామచంద్రునివంటి మర్యాదా పురుషోత్తముడు దాని వెనుక పరుగెత్తాడు. కనుక ఆపద వస్తున్నప్పుడు మహాపురుషుల బుద్ధి కూడా భ్రష్టమయిపోతుంది.

**రామాయణం పురాణమా?**

రామాయణం మనః కల్పితమైన కావ్యమా? ఇతిహాసమా? పురాణమా? అనే ప్రశ్న అత్యంత వివాదగ్రస్థమైనది. కొందరు శ్రద్ధ వల్ల రామాయణాన్ని పురాణాలలో చేర్చుతారు. కాని రామాయణం పురాణం కాదు.

పురాణమంటే ప్రాచీన చారిత్రక సంఘటనల, లేదా జానపదగాథల సంఘటనల సంగ్రహమని సాధారణంగా భావించుకుంటారు. కాని అది సరికాదు. పురాణాలను నిశితంగా పరిశీలిస్తే వానిలో వైదిక కల్పన (cosmology and cosmography) స్వరూపం వర్ణితమైనట్లు తెలుస్తుంది. ఈ వర్ణన లేని సాహిత్య విభాగాన్ని పురాణమని పిలువలేం. మహాభారతం వంటి జనన్మాన్యమైన గ్రంథాన్ని కూడ పురాణమని పిలువకపోవడానికి కూడా కారణమిదే. 'పురాణ శబ్దం అర్థం తెలుసుకుంటే ఇది మరింత స్పష్టమవుతుంది. పుర+అన్ వల్ల 'పురాణ' శబ్దం ఏర్పడింది. 'పుర' అంటే 'సప్తలోకాత్మకమైన విశ్వము' అని అర్థం. 'అన్' ధాతువు 'ప్రాణన' అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసాలను విడవడమనే అర్థంలో వాడతారు. ఈ రెండు శబ్దాలూ కలవగా వచ్చే అర్థం 'సప్తలోకాత్మకమైన విశ్వ జీవన వ్యాపారం' . పురాణ వాఙ్మయమంతటితో దీని వర్ణనమే ఉన్నది. ఇతర విషయాల వర్ణన కేవలం అనుషంగికం. శోభను పెంచడానికి జరుగుతుంది. కనుకనే దానిలో కాల విపన్యాసం ఇత్యాది అనేక దోషాలు కూడా కనబడతాయి. రామాయణానికి ఈ విషయాలతో ఏ మాత్రం సంబంధం లేదు. ఒక మహారాజ కులంలో జన్మించిన ఒక సర్వశ్రేష్ఠుడైన మహాపురుషుని సమగ్రమైన చరిత్రను వర్ణించడం రామాయణంలో కనిపిస్తుంది. వర్ణిస్తున్న విషయానికి సంబంధించని విషయాలకు శ్రీరామచంద్రుని కుటుంబంలోని వ్యక్తుల విషయాలను సైతం వాల్మీకి మహర్షి ప్రస్తావించలేదు. లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల వంటి రామాయణ ప్రముఖ పురుషుల భార్యలైన ఊర్మిళ, మాండవి, శృతకీర్తుల ప్రస్తావన సైతం వారి వివాహ ప్రకరణలో తప్ప మరెక్కడా రాదు. అస్వాభావికమైన విస్తరణకు ఆయన విరోధిగా కనబడతాడు. పురాణ వాఙ్మయ ఆత్మ విశ్వకోశ కల్పనకు వివరణ. రామాయణంలో అట్టి వివరణను ఆశించలేం. కనుక వాల్మీకి రామాయణం పురాణం కాదు. మరి రామాయణం ఏమిటి కావ్యమా? లేక ఇతిహాసమా!

– బాలాశాస్త్రి హరదాస్

*'జాగృతి' 04.05.1964 సంచిక నుంచి*

ఆధ్యాత్మికం

# ఎదిగిన కొద్దీ.. ఒదిగి..



శ్రీ రమణ భగవాన్‌ల నిరహంకారానికి ఈ కింది ఉదాహరణలను మనం చదవొచ్చు. ఒకసారి, శ్రీరమణ భగవాన్, ఇంకొక సాధువూ ఒక చిన్న బాటలో ఒకరికొకరు ఎదురైనారు. ఒక్కరు మాత్రమే ముందుకు అడుగేయటానికి ఆ బాటలో వీలుంది. ఆ సాధువు 'ఆయనే ముందుగా తనకు దారి ఇచ్చి నేను ముందుకు సాగిన తర్వాత ఆయన దారిన ఆయన వెళ్లవచ్చును కదా!' అని భావించాడు. ఆ సాధువు మదిలో ఆ ఆలోచన మెదలగానే శ్రీరమణ భగవాన్ పక్కకు తప్పుకొని ఆ సాధువును 'వెళ్లండి' అని సైగతో సూచించారు. అప్పుడా సాధువు, శ్రీరమణుల నిరంహంకారతకు మనసులోనే జోహారులర్పించి కదలిపోయినాడు. తరువాతనే శ్రీరమణ భగవాన్, తన దారిన తాను ముందుకు సాగారు.

ఒక గొప్ప విద్వాంసుడు భారతదేశం పర్యటించి శ్రీ రమణ భగవాన్ సన్నిధికి తిరువణ్ణామలై చేరి, 'ఏ శాస్త్రాన్ని అయినా మీరు నాతో వాదిస్తారా? లేక నాకు జయపత్రికనొసగి, పరాజితులమైనట్లు, నన్నభినందిస్తునట్లు

# సర్వ ధర్మ సర్వ విజ్ఞానకోశం భారతం

3




విశ్వవ్యాప్త అనంత చైతన్యం నాలుగు విధాలుగా సృష్టిక్రమాన్ని కొనసాగిస్తోంది. అవి,

1. ఉద్భిజ్జములు: భూమి నుండి పైకి పొడుచుకొని వచ్చేవి, సకల వృక్షజాతులు.

2. స్వేదజములు : మురికిలో పుట్టేవి

3. అండజములు : గుడ్ల నుండి పుట్టేవి

4. జరాయుజములు : మావిలో పుట్టేవి, మానవులతో సహా సకల జంతువులు.

ఈ చతుర్ముఖ సృష్టిలే మన పూర్వులు 'చతుర్ముఖ బ్రహ్మ'గా అభివర్ణించారు. ఆత్మ సాక్షాత్కారం కోసం అంతర్ముఖంగా సాగే చైతన్య కలాపం బ్రహ్మదేవుని ఐదవ ముఖం. అందుకే ఇది కనిపించదు.

***'సర్గశ్చ ప్రతి సర్గశ్చ***
***వంశో మన్వంతరాణిచ,***
***వంశాను చరితం చేతి***
***పురాణం పంచ లక్షణం'***

అష్టాదశ పురాణాలను వెలయించిన వేద వ్యాసుడు మహాభారతాన్ని 'ఇతి హాసంగా' పేర్కొన్నారు. పురాణ లక్షణాలతో పాటు ఇంకా ఎన్నో విశేషాలు మహాభారతంలో ఉన్నాయి. పంచమ వేదమైన మహాభారతం సర్వ ధర్మ సంగ్రహం, సర్వ విజ్ఞానకోశమని ఐదువేల ఏళ్లుగా భారతీయులు భావిస్తున్నారు.

***'ధర్మేవ అర్థకామేచ***
***మోక్షేచ, భరతర్షభ!***
***యదిహాస్తి తదన్యత్ర,***
***యన్నేహాస్తి నతత్ క్వచిత్'***

'ధర్మ, అర్థ, కామ, మోక్షమనే చతుర్విధ పురుషార్థాలకు సంబంధించిన విషయాలు మహాభారతంలో ఉన్నవే ఇతర చోట్ల ఉన్నాయి. మహాభారతంలోని లేనివి మరెక్కడా లేవు.

**కుడి ఎడమల ఫలితం**

ప్రతీపుడు పౌరవ వంశపు చక్రవర్తి. పాండవులకు పూర్వుడు. ఒక ప్రశాంత సంధ్యాసమయంలో ఆయన గంగానదీ తీరంలో కూర్చొని ఉంటాడు. దివ్య శోభలతో విలసిల్లే ఒక అందమైన యువతి అక్కడికి వస్తుంది. ఆమె దేవత, గంగాదేవి. ఆ యువతి వచ్చి ప్రతీపుని కుడి తొడపై కూర్చుంటుంది. అంతటితో ఊరుకోలేదు..తనను భార్యగా స్వీకరించమని కోరుతుంది. కానీ ప్రతీపుడు ధర్మం తెలిసినవాడు, అర్థకామాల కంటే ధర్మానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవాడు. "ఓ వరాంగనా! నీవు నా కుడి తొడపై వచ్చి కూచున్నావు. కొడుకులు, కూతుళ్లు, కోడళ్లు కుడితొడపై కూర్చుండడానికి అర్హులు. ఎడమ తొడ భార్య కూర్చుండ తగిన స్థానము, దానిని నీవు వదలిపెట్టితివి!" అన్నాడు.

***"ప్రాప్య దక్షిణ ఊరుం మే***
***త్వం ఆశ్లిష్టా వరాంగనే!***
***అపత్యానాం స్నుషాణాంచ***
***భీరు విద్ధి ఏతదాసనమ్!***
***సవ్య ఉరుః కామినీ భోగ్యః***
***త్వయాన చ విసర్జితః!"...***

'అందువల్ల కుడితొడపై కూర్చున్న నిన్ను కోడలుగా స్వీకరిస్తాను' అని ప్రతీపుడు గంగాదేవికి చెపుతాడు. గంగాదేవి ఆయన ధర్మనిష్ఠకు మెచ్చుకొని వెళ్లిపోతుంది.

ఈ ప్రతీపుడు శాంతనుని తండ్రి..శాంతనవుడైన భీష్మునికి తాత. శాంతనుడు (శంతనుడు) పూర్వజన్మలో ఇక్ష్వాకు వంశపురాజు. అతనికి స్వర్గ ప్రాప్తి కలుగుతుంది. అతని పేరు మహాభిషుడు. స్వర్గంలో ఉండగా, ఇతర స్వర్గవాసులతో కలసి ఆయన బ్రహ్మదేవుని దర్శనం కోసం వెడతాడు. ప్రమాదవశాత్తు గంగాదేవి వస్త్రాలు కొంచెం తొలగిపోతాయి. బ్రహ్మ సన్నిధిలో ఉన్నవారంతా తలలు వంచుకుంటారు. కానీ మహాభిషుడు మాత్రం లజ్జ లేకుండా గంగాదేవి వైపు చూస్తుండి పోతాడు. భూలోక వాసనలు తొలగని మహాభిషుడు మళ్లీ భూలోకంలో జన్మించాలని బ్రహ్మదేవుడు భావిస్తాడు. ఈ మహాభిషుడు ప్రతీపునికి కొడుకుగా జన్మించాలని వాంఛిస్తాడు. ఈ మహాభిషుడే శాంతనుడు. ఆయనకు భార్యగా కొంతకాలం భూలోకంలో ఉండాలని భావించిన గంగామాత, శాంతనుని తండ్రి ఎలాంటివాడో ముందుగా పరీక్షించింది.

**– తెలకపల్లె విశ్వనాథశర్మ**
***'జాగృతి' 24.12.2001 – 07.01.2002***
**సంచికల నుంచి**



**అక్కిరాజు రమాపతిరావు**

రాతపూర్వకంగా ఒప్పుకుంటారా?' అని ప్రశ్నించారు. దానికి రమణుల వారు 'మనమిద్దరం వాదించుకోవటం ఎందుకు? నాకు అన్యంగా ఏమిలేదు. ఎట్లా ఉండగలదు? మీరు కోరిన జయపత్రిక రాసి ఇస్తాను. దానిని తీసుకొని మీరు పోవచ్చు' అని ఆ పండితునికి చెప్పారు. అప్పుడా మహాపండితుడు తన అహంకారం పరిత్యజించి పశ్చాత్తప్తుడై, శ్రీ రమణ భగవాన్ పాదాలపై వొరిగి 'సత్యమే, పరిపూర్ణ ఆత్మ స్వరూపులైన మీకు నావంటి అహంకారితో వాదనా! నన్ను క్షమించండి' అని ఆయనను వేడుకున్నాడు.

ఒకసారి తనను దర్శించవచ్చిన అంధునితో 'మీరు అదృష్టవంతులు. మీకు దృశ్య బాధ తప్పింది' అని రమణమహర్షి ఆయనను అనునయించారు. దానికి ఆయన రమణులు తనతో పరిహాస మాడటం లేదు కదా! అని బాధపడ్డాడు. 'లేదు లేదు. నేను మీకు నిజమే చెపుతున్నానండీ! మనిషి మనసును ఎక్కువగా బాధించేదీ, బంధించేదీ పంచేంద్రియాలలో మొదటిది దృశ్యం. తరువాతది శ్రవ్యం' అని చెప్పడంతో ఆయన సమాధానపడ్డారు. ఇక్కడ నిశితంగా పరిశీలిస్తే, కళ్లు లేకపోవడం అదృష్టమని కాదు. అలాంటి వారిలో ఆత్మస్థైర్యం నింపడం, న్యూనతా భావనను తొలగించడం ప్రధానంగా భావించాలి. ★

**వివేకానంద సూక్తిశతి**

**Arise! Awake ! And Stop not till the goal is Reached.**



**లెండి యువకులారా లెండి వేగమె లెండి**
**విశ్రమించ వద్దు విడువ వద్దు**
**గట్టిపట్టుపట్టి గమ్యంబు చేరగా**
**వినుడి స్వామి సద్వివేకావాణి !**



**బండిరాజుల శంకర్**



చార్‌ధామ్ యాత్రను సులభతరం చేసేందుకు ఉత్తర కాశీ జిల్లాలో నిర్మిస్తున్న 'సిల్క్‌యారా' సొరంగం కుప్పకూలింది. ఈ వ్యాసం రాసేనాటికి దాదాపు పదిహేను రోజులు దాటింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన కార్మికులలో 41మంది అందులో చిక్కుకుపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. వారిని బయటకు తీసుకువచ్చే ప్రయత్నాలతో పాటు, మానసికంగా, భౌతికంగా కూడా ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన ఆహారాన్ని,

# హిమాలయాలపై ఏదీ

ఇటీవలి కాలంలో హిమాలయ ప్రాంతంలో ఇటువంటి ఘటనలు పర్యావరణ వేత్తలను, ప్రజలను భీతికి గురి చేస్తున్నాయి. కొద్ది ఏళ్ల కిందట కేదార నాథ్‌లో ప్రకృతి బీభత్సం, ఇటీవలి కాలంలోనే హిమాలయ పర్వత పాద ప్రాంతంలోని జోషీమఠం పట్టణంలో భూమి కుంగిపోవడం, ఇళ్లు కూలినప్పుడే ప్రణాళిక లేకుండా నిర్మాణాలు జరపడం, కిక్కిరిసిన జనాభా, సహజ నీటి ప్రవాహానికి అడ్డంకులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలు, ఇతర కార్య కలాపాలే ఇందుకు కారణమంటూ పర్యావరణవేత్తలు అభిప్రాయపడ్డారు. వాడియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ డైరెక్టర్ కళాచంద్ జైన్ ఇందుకు మూడు కారణాలు చెప్పారు. జోషీమఠ్ బలహీన పునాదులకు కారణం ఒక శతాబ్దం కింద వచ్చిన భూకంపంతో విరిగి పడిన కొండ చరియ అవశేషంపై వాటిని అభివృద్ధి చేయడమే కాకుండా, అది భూకంపాలు ఎక్కువగా సంభవించే అవకాశాలు గల జోన్ ఐదులో ఉంది. నిత్యం నీరు ప్రవహిస్తు న్నందున కాలక్రమంలో రాళ్ల సంఘటిత బలం తగ్గి, క్రమంగా శిథిలమవుతోందని విశ్లేషించారు.

కాగా, కేవలం 4.5 కిమీల పొడవుతో సిల్క్‌యారా-దందల్‌గావ్ మధ్య 2016లో ఈ సొరంగ నిర్మాణాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన చార్‌ధామ్ రోడ్డు పథకంలో భాగంగా జాతీయ హైవేలో బ్రహ్మఖల్ – యమునోత్రి సెక్షన్‌లో దీనిని ప్రారంభించారు. ఆ రహదారితో ద్వారా కేదార్‌నాథ్, బదరీనాథ్, యమునోత్రి, గంగోత్రిలను అనుసంధానం చేయాలని భావించారు. ఆ ప్రాజెక్టు ఇప్పుడు విషాదాన్ని ఎదుర్కొంటోంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు సొరంగ నిర్మాణం జరిగింది. ఇక్కడే కార్మికులు చిక్కుకుపోయారు. ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించినప్పటి నుంచే విస్తృతంగా జరుపుతున్న డ్రిల్లింగ్, నిర్మాణ కార్యకలాపాల పట్ల పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. ఈ పనుల కారణంగా భూమి కుంగడం, కొండ చరియలు విరిగిపడటం, పర్యావరణ విధ్వంసం జరుగుతాయేమోననే అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

భారత ప్రభుత్వం చైనాకు చెక్‌పెట్టేందుకు, యుద్ధం వస్తే సైన్యానికి అనువుగా ఉండేందుకు హిమాలయాలలో రహదారులు, సొరంగాల నిర్మాణం పనులను చేపట్టిందన్న వాదన ఉంది. ఇది అవసరం. పొరుగున ఉన్నది శత్రు దేశమైనప్పుడు, మన జాగ్రత్తల్లో మనం ఉంటూ, అవసరమైన చర్యలు తీసుకోవలసిందే. ఇటీవలి సంవత్సరాలలో చైనాతో గల్వాన్‌లో తలపడిన తర్వాత ఆ దేశం ఆ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలను చేపడుతున్న నేపథ్యంలో భారత దేశంకూడా దానికి దీటుగా ఉండాలి. అయితే, ఇరుదేశాల నుంచి ఈ రకమైన నిర్మాణాలే చేటు తెస్తున్నాయా అనే అనుమానాలు రేగుతున్నాయి.

**ఇలా ఎందుకు జరుగుతోంది?**

హిమాలయ ప్రాంతం అత్యంత సున్నితమైనది. భూగర్భశాస్త్రవేత్తల ప్రకారం హిమాలయాల వయసు చిన్నది. ఇక్కడ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే ముందు, ప్రాజెక్టులను నిర్మించే ముందు భూమి పరిస్థితులను, ప్రకృతిని పరిరక్షించేలా అధ్యయనాలు జరిపి మరీ చేపట్టాలని పర్యావరణవేత్తలు వాదిస్తు న్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సున్నితమైన, శిఖర పర్యావరణ వ్యవస్థలపై ఎక్కువగా దృష్టిపెట్టడం లేదని, కనుక అసలు ఈ ప్రాంతాలలో భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఉండటమే మంచిదని అభిప్రాయాలు ఉన్నాయి.

రుతుపవనాల కారణంగా తడిసిన కొండల నుంచి చరియలు విరిగిపడే సంఘటనలు రహదారులు, సొరంగాల కోసం భూమిని తొలచడంతో మరింత పెరుగుతున్నాయని వారు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి సున్నిత ప్రాంతంలో పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం కోసం పేలుడు పదార్ధాలను ఉపయోగించడం వంటివన్నీ కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నది నిపుణులు భావన. వీటితో పాటు పర్వత పాద ప్రాంతంలో రైళ్లు వేయడం, అవి పట్టాల నుంచి వేగంగా వెళుతున్నప్పుడు వచ్చే ధ్వనితరంగాలు కూడా ఈ పర్వతశ్రేణులను ప్రభావితం చేస్తాయన్నది వారి మాట.

**హిమాలయాలు ఎందుకు అంత సున్నితం?**

హిమాలయ పర్వత శ్రేణులు, టిబెట్ పీఠభూమి భారత్, యురేషియా ప్లేట్ల కదలిక, వాటి మధ్య అభిఘాతం కారణంగా ఏర్పడ్డాయని భూగర్భ శాస్త్రవేత్తల భావన. దాదాపు 50 మిలియన్ సంవత్సరాల కింద ప్రారంభమైన ఈ అభిఘాతం ఇంకా కొనసాగుతోందని చెబుతున్నారు. బ్రిటిష్ జియలాజికల్ సొసైటీ, భారతదేశం 225 మిలియన్ సంవత్సరాల కిందట ఆస్ట్రేలియా తీరంలో ఉం డేదని, దీనిని ఆసియా నుంచి టెథిస్ మహాసముద్రం వేరు చేసిందని పేర్కొంటోంది. కాగా, 200 మిలియన్ సంవత్సరాల కిందట మహాఖండమైన పంగియా నుంచి విడిపోయి ఆసియా దిశగా ఉత్తరంగా భారత్ భూమి ప్రయాణించడం ప్రారం భించింది. ఇక 80 మిలియన్ సంవత్సరాల కిందట ఆసియా ఖండానికి 6,400 కిమీ దూరంలో దక్షిణంగా ఉంటూ, ఏడాదికి 9నుంచి 16 సెంటీ మీటర్ల చొప్పున దాని దిశగా కదులుతూ వచ్చిందని, ఇదే సమయంలో టెథిస్ మహా సముద్రంలోని భూమి బహుశ ఆసియా కిందగా వచ్చి ఉంటుందని, ఈ రెండు ప్లేట్ల మధ్య మార్జిన్ కలిసి నేటి ఆండిస్ పర్వతాల వలే ఏర్పడి ఉంటాయని వారి అంచనా.

దాదాపు 40 నుంచి 50 మిలియన్ సంవత్సరాల నుంచి భారతీయ కాంటినెంటల్ ప్లేట్ల ఉత్తర దిశ కదలిక ఏడాదికి 4-6 సెంమీలకు నెమ్మదించిందని, ఇదే యురేషియా, భారత ఖండ ప్లేట్ల మధ్య తాకిడి లేదా రాపిడికి ప్రారంభానికి, నాటి టెథిస్ మహాసముద్రం మూసుకుపోవడానికి, హిమాల

మందులను పంపుతూ, మానసిక స్థైర్యాన్ని నిలుపుకునేందుకు సూచనలు చేస్తున్నారు. దేశం యావత్తు వారి సంక్షేమం కోసం ప్రార్థిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ సొరంగ వ్యవహారాలలో అంతర్జాతీయ నిపుణుడు డిక్స్‌ను కూడా పిలిపించడం ద్వారా కార్మికుల ప్రాణాలను కాపాడాలన్న తన నిబద్ధతను చాటుకుంది.

యాలు పెరుగుదల ప్రారంభానికీ సంకేతమని సొసైటీ చెబుతోంది. యురేషియా ప్లేటు నలిగిపోయి భారతీయ ప్లేటుపైకి వచ్చింది. అయితే రెండిటి మందం, అధిక ప్లవనశక్తి (బయాన్సీ) కారణంగా ఏ కాంటినెంటల్ ప్లేటు మరోదాని కిందకు రాలేదు. దీనితో ఈ కాంటినెంటల్ ఉపరితలం మందమై, ముడుచుకోవడం, భ్రంశనం జరుగుతూ సంపీడన శక్తి కారణంగా హిమాలయాలూ, టిబెటన్ పీఠభూమి పైకి వచ్చాయిట. ఇక్కడ ఉండే కాంటినెటల్ క్రస్ట్ సాధారణంగా కనిపించే సగటు మందం కన్నా

# తేలిక కాదు!

రెండింతలు అంటే 75 కిమీలు ఉంటుంది. ఇదే ఈ ప్రాంతంలో అగ్నిపర్వత కార్యకలాపాలకు చెక్ పెడుతోందట! ఒకవేళ అడుగున పర్వతం పేలినా, ఇంత మందంగా ఉన్న పొర నుంచి లావా బయిటకు వచ్చేలోపలే అది ఘనీభవిస్తుంది.

ఇప్పటికీ, భారత్ ఆసియాకు ఉత్తరం వైపుగా కదులుతున్నందున హిమాల యాలు ఏడాదికి 1 సెం.మీ. చొప్పున పెరుగుతూ వస్తున్నాయి. ఇదే ఈ ప్రాంతంలో నేడు నిస్సారదృష్టి భూకంపాలు (shallow focus earth quakes) కు కారణ మట. అయితే, అదే రేటుతో హిమాలయాలు ఎత్తు తగ్గడానికి వాతావరణం, కోత (ఎరోజన్) కారణమవు తున్నాయిట.

**ఉత్తరకాశీ సొరంగంలో రక్షణ చర్యల పరిస్థితి:**

సిల్క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడేందుకు ప్రభుత్వం పలురకాల చర్యలను చేపడుతోంది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒఎన్‌జిసి, ఎస్‌జెవిఎన్ఎల్, ఆర్‌వి ఎన్ఎల్, ఎన్‌హెచ్ఐడిసిఎల్, టిహెచ్‌డిఎల్ సంస్థలకు సొరంగాన్ని తొలిచి బాధితులను బయిటకు తెచ్చే నిర్దిష్ట బాధ్యతను అప్పగించారు. వీరితో పాటుగా బీఆర్ఓ, ఐటిబిపి కూడా ఇందులో పాలుపంచు కుంటున్నాయి. ఫస్ట్ ఎయిడ్‌ను అందించేందుకు, అవసరమైనవారిని వాయుమార్గం ద్వారా ఆసుపత్రు లకు తరలించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

ఈ కార్మికులందరినీ సజీవంగా బయటకు తీసుకురావాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, అధికారులు, గాలి సంపీడన గొట్టాల ద్వారా వారికి ఆక్సిజన్, విద్యుత్, ఆహారం పంపుతున్నారు. ఒక దశలో యంత్రాలు మొరాయించడంతో పనులు ఆగాయి. అమెరికాలో తయారు చేసిన ఆగర్ మెషీన్‌తో తొలచడం ప్రారంభించిన కొద్ది సమ యానికే అందులో సాంకేతిక లోపం ఏర్పడడంతో ఆ పని నిలిపివేశారు. రక్షణదళాలు తొలిచిన మార్గం ద్వారా పైపులను చొప్పిస్తున్నారు. దాని ద్వారానే వారికి ఆహారం, మందులు వగైరాలు వెడుతున్నాయి.

**అంతర్జాతీయ నిపుణుల యత్నాలు**

అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చేందుకు ప్రభుత్వం భూగర్భ నిపుణుడు ప్రొఫెసర్ ఆర్నాల్డ్ డిక్స్‌ను పిలిపించింది. ఆయన అండర్‌గ్రౌండ్ స్పేస్ సంస్థ అధ్యక్షులు కూడా. భూగర్భ, రవాణా మౌలిక సదుపాయాల నిర్మాణ రిస్కు, కార్యాచరణ భద్రత దృక్పథం నుంచి వాస్తవ భద్రతతో ముడిపడి ఉన్న సాంకేతిక సమస్యలపై ప్రత్యేకాధ్యయనం చేశారు. ఘటనా స్థలికి చేరుకోగానే డిక్స్ సిల్క్యారా సొరంగ ప్రాంతంలో తనిఖీ నిర్వహించి, రక్షణ కార్యకలాపాలలో నిమగ్నమైన ఏజెన్సీలతో మాట్లాడారు. బాధితులను బయిటకు తెచ్చేందుకు ఇంత మంది చేస్తున్న ప్రయత్నాలు గమనించిన డిక్స్ ఈ ఆపరేషన్‌లో గరిష్ఠ పరిష్కారాన్ని కనుగొనగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతేకాదు, సొరంగం సమీపంలో ఉన్న ఆలయంలో పూజలు కూడా నిర్వహించారు.

ఇటువంటి పరిస్థితుల్లో రక్షణ చర్యలు ఎంత కష్టమో తెలిసిన డిక్స్ లోపల ఉన్న కార్మికులను క్రిస్మస్ నాటికి బయిటకు తేగలమంటూ ప్రకటించడం బాధితుల కుటుంబాలను నిరాశపరిచినప్పటికీ, అసలు వారు బయటకు రాగలరనే హామీ కాస్త ఊరట కల్పించింది. అంటే, వారిని బయటకు తేవడానికి మరొక నెల సమయం పడుతుందని ఆయన గరిష్ఠంగా అంచనా వేశారు. యంత్రంతో తొలి చిన ప్రతిసారీ ఇదిగో ఈసారి వచ్చేస్తున్నారు అని అందరూ భావిస్తున్న తరుణంలో ఏదో ఒక సాంకేతిక లోపమో, భద్రతా కారణంగానో ఆ యత్నాలు ఆగిపోవడాన్ని మనం చూస్తున్నాం. బహుశ ఆయన అంత గడువు ఇవ్వడానికి కారణం అదే అయి ఉండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా సొరంగాల భద్రతకు గణనీయంగా అందించిన సేవల కారణంగా, ప్రపంచంలో ఎక్కడ ఇటువంటి ఘటన చోటు చేసుకున్నా ఆయనకు పిలుపు వస్తుంది.

ఇటువంటి దుర్ఘటనలు జరిగితే, తప్పించుకునే మార్గం లేదని, నిర్మాణంలో నిబంధనలను పాటించ లేదని, ఇందుకు కేంద్రం బాధ్యత వహించాలంటూ ప్రతిపక్ష ఎంపీ ప్రియాంక చతుర్వేదీ విమర్శించారు. అయితే ప్రధానమంత్రి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకూ అనుక్షణం ఈ ఆపరేషన్‌పై అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్న విషయాన్ని వార్తాపత్రికలు సహా మీడియా ప్రచురిస్తోంది. రక్షణ ఆపరేషన్‌లో చివరి దశను పూర్తి అప్రమత్తతతో, వేగంగా పూర్తి చేయాలని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ అధికారులకు ఆదేశాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శ్రద్ధను వెల్లడిస్తు న్నది. రాజకీయాల మాట ఏమైనా, ప్రభుత్వాలు ఇటువంటి సున్నిత ప్రాంతాలలో ప్రాజెక్టులు నిర్మించే ముందు అనేకానేక పరీక్షలు, పరిశీలనలు చేసిన తర్వాతే వాటిని చేపట్టాలి. నిర్మాణ సమయంలో జరిగింది కనుక నష్టం పెద్దగా వాటిల్ల లేదు, కానీ పూర్తి అయిన తర్వాత జరిగి ఉంటే, ఆస్తి నష్టం, ప్రాణనష్టం కూడా జరిగేవి. బహుశ, మన పెద్దలు చార్‌ధామ్‌ను అందుకే అత్యంత పవిత్రమైన దానిగా పరిగణించి భక్తి శ్రద్ధలతో వెళ్లేవారు తప్ప నేటి పర్యాటకులు చేసే విలాసయాత్రలా కాదు. ఏది ఏమైనా మన కార్మికులు సురక్షితంగా ఆ సొరంగం నుంచి బయిటపడాలని కోరుకుందాం. ★



అంతర్జాతీయ నిపుణుడు డిక్స్

'గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోదీ నిస్వార్థ నాయకుడు. భారత రూపాంతరం కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ అందుకోసం పాటు పడుతున్నారు. దీని మీద విమర్శలు ఎదురవుతున్నప్పటికీ ఆయన వెనకడుగు వేయడం లేదు' ఈ మాటలు కొత్తగా బీజేపీలో చేరుతున్న నాయకుడు ఎవరో అన్నవి మాటలు కావు. లేదా ఒక బీజేపీ ఎంపీ అన్నవీ కావు. కొన్నేళ్లపాటు నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శలకు దిగిన, తాను విమర్శల పాలైన ఒక యువతి అన్న మాటలు. ఆమె వికృత భావాలకు నిలయమైన జేఎన్‌యూ విద్యార్థిని. పేరు షెహ్లా రషీద్. కన్నయ్యకుమార్‌తో పాటు టుక్డే టుక్డే గ్యాంగ్ సభ్యురాలిగా అపకీర్తి పాలయ్యారు. మోదీ ముస్లింలను అణచివేస్తున్నారని, 370 రద్దుతో కశ్మీర్‌ను మరింత కల్లోల పరిచారని విమర్శించిన బృందంలో ఒకరు. దేశద్రోహ నేరం కింద అరెస్టయిన కన్నయ్యకుమార్‌ను విడుదల చేయాలని ఆందోళన చేసిన జేఎన్‌యూ విద్యార్థి నాయకులలో ఒకరు. మోదీ వ్యతిరేకత పేరుతో హిందుత్వను లక్ష్యంగా చేసుకున్న ప్రకాశ్‌రాజ్ వంటి అర్బన్ నక్సల్' ఆమె తనకు ఎంతో ఆప్తురాలని ప్రకటించిన సంగతి కూడా నిజం. ఆమె ఇప్పుడు చెబుతున్న మాటలు ఇవే. మోదీ ఎలాంటి విమర్శలను పట్టించుకోకుండా, భారత సమ్మిళిత వృద్ధి కోసం పాటుపడుతున్న నిస్వార్థ నేత. అంతేకాదు, జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడినాయని ప్రకటించి ఇటీవలి కాలంలో వార్తలలోకి ఎక్కారు.

# మోదీ గురించి మేము చెప్పిన

షెహ్లా ప్రకటనల వల్ల మోదీకి కొత్తగా వచ్చే కీర్తి లేదా లబ్ధి ఏమీ లేవు అని మొదట గ్రహించవలసి ఉంటుంది. కానీ ఆమె ప్రకటన చాలా విషయాలను, భారతదేశ ఉదారవాదుల, వామపక్ష మేధావుల వాస్తవ రూపాన్ని దేశం ముందు పెడుతుంది. జేఎన్‌యూ వంటి విశ్వవిద్యాలయంలో చదువుతున్న వారి మీద కూడా మేధో బానిసత్వం తీవ్రంగా పనిచేస్తున్న సంగతి అర్థమవుతుంది. సాధారణ ప్రజల ప్రాణాలను రక్షించడానికి ప్రధాని లేదా కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనైనా ఉదారవాదులు, మేధావులు స్వార్థ రాజకీయాల కోసం దుమ్మెత్తి పోయగలరు. పేదల ప్రాణాల కంటే, ప్రధానినీ, ఆయన సిద్ధాంతాన్నీ అభాసు పాలు చేయడమే ప్రధానమని అనుకునే శక్తులు ఈ దేశ విశ్వవిద్యాలయాలలో, మీడియాలో తిష్ట వేసుకుని కూర్చున్నాయి. ఆ విషయాలు అర్థం చేసుకోవడానికి షెహ్లా పరివర్తన దోహదం చేస్తుంది. అంత మాత్రానే ఆమె గతంలో చేసిన తప్పిదాలు, దేశాన్ని సంక్షోభంలోకి నెట్టివేయడమే పనిగా పెట్టుకున్న ముఠాలతో కలసి పనిచేయడం దేశం మరచిపోలేదు. అయితే పరివర్తన అవసరమన్న ఆమె దృష్టి ఆహ్వానించదగినదే. ఈ దేశంలో ముస్లింలు సర్వత్రా అణచివేతకు, హింసకు గురి అవుతున్నారంటూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన వారికి అండగా నిలవడం మూలంగా దేశానికి ఎంత నష్టం జరిగింది? అంతర్జాతీయ కుట్రలలో పావులుగా మారి దేశంలో కల్లోలానికి కారణమైన వారిని సమర్థించడం సమరసతకు ఎంత చేటు చేసింది? షాహీన్‌బాగ్, రైతుల పేరుతో వచ్చిన ఖలీస్తానీలు, కశ్మీర్ ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం వల్ల సాధారణ పౌరులు ఎంత క్షోభ పడ్డారు? ఈ విషయాలు సమీక్షించుకోవడానికి షెహ్లా పరివర్తన అక్కరకు వస్తుంది. అన్నిటికంటే కీలకమైన ప్రశ్న: పార్లమెంటు మీద దాడి చేసిన వారికి ఉరిశిక్షను అమలు చేయడాన్ని నిరసిస్తూ జేఎన్‌యూ ముఠా అల్లరి చేసింది. అందులో షెహ్లా ఒకరు. అప్పుడు వారందరి ప్రకటనలతో హోరెత్తించిన మీడియా ముఠా ఇప్పుడు ఎందుకు ఆమెను పట్టించుకోదు? ఆమె మాటలు ఎందుకు వినపడడం లేదు? అవి దేశం దృష్టికి తీసుకువెళ్లాలని ఆ వర్గం మీడియా ఎందుకు ఉబలాట పడడం లేదు? ప్రణయ్‌రాయ్‌లు, బర్ఖాదత్‌లు, రాజ్‌దీప్ సర్దేశాయ్‌లు ఎందుకు పోటీ పడడం లేదు?

అంతో ఇంతో చదువుకుని, చదువులో చురుకుగా ఉండే వాళ్ల బుర్రలలో విషం నింపడం ఇవాళ్టి కొన్ని విశ్వవిద్యాలయాలలో జరుగుతున్న ప్రక్రియ. సమ్యక్ దృష్టి నుంచి యువ మేధస్సులను తప్పించడం ఉదారవాదులూ, వామపక్ష మేధావులూ విప్లవంగా పరిగణిస్తున్నారు. షెహ్లా విషయంలోను ఇదే జరిగింది. ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఏం చెప్పారో చూద్దాం.

'నేను లాక్‌డౌన్ విధింపును సమర్థించాను. అందుకు ఇప్పటికి కూడా నన్ను వెనక్కి లాగే ప్రయత్నం జరిగింది. ప్రభుత్వాన్ని నీవెందుకు సమర్థిస్తున్నావు? అన్నదే వారి ప్రశ్న' అని చెప్పారు షెహ్లా. ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది నిజమే. కానీ అది లక్షల ప్రాణాలను రక్షించడానికి. ఆ పని మోదీ ప్రభుత్వమైనా, మన్మోహన్ ప్రభుత్వం ఉంటే, ఆ ప్రభుత్వమైనా చేయవలసింది అదే. కొవిడ్ 19 సమయంలో లాక్‌డౌన్ విధించినందుకు వామపక్ష, ఉదారవాద ముఠాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. అది విమర్శ కోసం చేసిన విమర్శ అని ఆమె అన్నారు. ఇది దారుణం కాదా! కోట్లాది సాధారణ ప్రజల ముందు చావు సిద్ధంగా ఉన్న క్షణంలో తీసుకున్న నిర్ణయాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకోవడం ఎలాంటి విజ్ఞత? మోదీ ఏం చేసినా మనం వ్యతిరేకించవలసిందేనని షెహ్లాకు సుద్దులు చెప్పింది ఆ వర్గం. నిజానికి కేంద్రానికి అప్పుడు లాక్‌డౌన్ విధించడం తప్ప మరొక మార్గం లేదు అని షెహ్లా అంగీకరిస్తున్నారు.

దేశంలో ముస్లింల పట్ల నిజంగానే వివక్ష కొనసాగుతున్నదా? అన్న ప్రశ్నకు షెహ్లా సమాధానం ప్రత్యేకంగానే ఉంది. విద్యావంతులు చెబుతున్న ప్రకారం, దేశంలో ముస్లింలు మైనారిటీలుగా కాకుండా, రెండో పెద్ద మెజారిటీ వర్గంగానే చెప్పుకుంటున్నారు. డాక్టర్ తన్వీర్ ఫైయాసల్ సమర్పించిన ఒక అధ్యయన పత్రం ప్రకారం ఢిల్లీ ముస్లింలు తమను మైనారిటీలుగా కాకుండా రెండో పెద్ద మెజారిటీ వర్గంగా చెప్పుకున్నారు. మైనారిటీ వర్గీకరణను వారి నిరాకరించారు. భారతదేశంలోకి మతోన్మాదం బీజేపీతోనే ప్రవేశించిందని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాకనే మొదలయిందని చెప్పడం కూడా సరికాదని ఆమె చెప్పారు. దేశంలో 70 ఏళ్ల నుంచి మతకల్లోలాలు ఉన్నాయని అన్నారు. మనం 70 ఏళ్ల క్రితమే మతం ప్రాతిపదికగా రెండు దేశాలుగా విడిపోయాం. కాబట్టి 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే మత కల్లోలాలు మొదలయ్యాయని చెప్పడం




# మాటలన్నీ అసత్యాలే!

అసంబద్ధం అన్నారామె. ఆ మత కల్లోలం అలాగే కొనసాగుతోందని చెప్పారు. అలాగే మనం మొదటి నుంచి ప్రతికూలాంశాలకే ప్రాధాన్యం ఇస్తూ సానుకూలాంశాలను విజయోత్స వాలుగా చేసుకోవడం మరిచామని ఆమె వెల్లడించారు. ముస్లింలకు వ్యతిరేకంగా గతంలో హింస జరిగింది. అలాగే వారి గురించి అవాంఛ నీయ ప్రకటనలు కూడా వచ్చాయి. కానీ వీటి మీద దృష్టి పెట్టినట్టుగా ఇక్కడ ముస్లింలకు జరిగిన మేలు గురించి చెప్పలేదు అని ఆమె అంగీకరించారు.

ఇంకెక్కడో కాకుండా ఈ దేశంలో ఉన్నందుకు ముస్లింలు అదృష్టంగా చెప్పుకోవాలని షెహ్లా వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా శ్రీనగర్ వచ్చినప్పుడు, 'ఈ దేశం మీ దేశం మీరు ఈ దేశంలో ఎక్కడైనా ఉండవచ్చు' అని ప్రకటించిన సంగతిని ఆమె గుర్తు చేశారు. కాబట్టి ఇక్కడ ఉండడం ముస్లింలు తమ అదృష్టంగా భావించాలని ఆమె అన్నారు. ఇక్కడ శాంతి ఉంది. అభివృద్ధి ఉంది. మనం మన పూర్వ వలస పాలక దేశాన్ని కూడా అధిగమించాం అని ఆమె అన్నారు.

కశ్మీర్ అంశంలో మీరు ఇప్పుడు ఎందుకు కేంద్రం విధానాలను శ్లాఘిస్తున్నారని అడిగితే, ఆ విషయం మీద చర్చకు సిద్ధమని, ఆ చర్చలోనే లోయలో ఎలాంటి మార్పు వచ్చిందో చెప్పగలనని అన్నారామె. అంటే దేశంలో అసలు సమస్యలే లేవని తాను అనడం లేదనీ, కానీ కశ్మీర్‌లో మాత్రం మార్పు నిజమని అన్నారు. కశ్మీర్ పరిణామాల గురించి, కోర్ట్ మార్షల్స్ గురించి అక్కడికి వెళ్లకుండానే చాలామంది మాట్లాడారని ఆమె అన్నారు. లోయలో సైనికాధికారులు మానవ హక్కులను హరిస్తున్నారంటూ 2019లో ఎక్స్‌లో పెట్టిన పోస్టుకు ఆమె సంతాపం వ్యక్తం చేశారు. వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండానే ఆ పోస్టు పెట్టినట్టు ఆమె అంగీకరించారు. తాను ఇలాంటి మాధ్యమాల ద్వారా విడుదల చేసిన సమాచారం భారత వ్యతిరేక శక్తులకు ఉపయోగపడి ఉంటుందని కూడా ఆమె అంగీకరించారు. ఎవరో కశ్మీర్‌లోయలో సైన్యం లైంగిక అత్యాచారాలకు పాల్పడుతోందని ప్రచారం చేశారు. దానిలోని నిజానిజాలు తెలుసుకోకుండా ఇలాంటి పోస్టులు పెట్టాను అన్నారామె. ★

# 'నాగన్న' అకాల మరణం

దాదాపు మూడు దశాబ్దాల పాటు సంఘ్‌తో అనుబంధం కలిగి, ఎందరినో ప్రభావితం చేసిన గుండ్ల నాగరాజు నవంబర్ 21న స్వర్గస్తులయ్యారు. ఆయన నల్గొండ విభాగ్ కార్యవాహగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నాగరాజు మరణం ఆ ప్రాంత కార్యకర్తలను, నాయకులను విచారానికి గురి చేసింది.



బొమ్మలరామారం మండలం ప్యారారంకి చెందిన నాగరాజు గుండ్ల ఆగయ్య, సత్యమ్మల రెండో సంతానం. డిగ్రీ చదువుతుండగా సంఘంతో పరిచయం అయింది. చదువు పూర్తవుతూనే 1987లో సంఘప్రచారక్‌గా వచ్చారు.

వనపర్తి నగర, శంకరపల్లి ఖండ ప్రచారక్‌గా, రంగారెడ్డి తూర్పు జిల్లా ప్రచారక్‌గా, 1995లో కరినగర్ జిల్లా ప్రచారక్‌గా ఉన్నారు. సుమారు 14 సంవత్సరాలు ప్రచారక్‌గా జీవితం గడిపారు. 1999 డిసెంబర్‌లో ప్రచారక్ బాధ్యతల నుంచి తప్పుకొని, గృహస్థ జీవనం గడుపుతూ అనేక బాధ్యతలు చురుకుగా నిర్వహించారు. నల్గొండ జిల్లా సహ కార్యవాహగా, 2008లో భువనగిరి జిల్లా కార్యవాహగా, 2010లో నల్గొండ విభాగ్ సహకార్యవాహగా, 2020లో విభాగ్ కార్యవాహగా బాధ్యతలను స్వీకరించి ఒక గృహస్థ కార్యకర్తగా విభాగ్‌లోని కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచిన ఆయన నెలలో 25 రోజులు పర్యటిస్తుండేవారు.

తన కార్యకలాపాలకు అడ్డురాని ఎల్.ఐ.సి. ఏజెంటు వృత్తిని ఎంచుకుని ఆయన పని చేసేవారు. సంఘ పట్ల ఆయన అంకిత భావం సంఘ వివిధ క్షేత్రకార్యకర్తలపై కూడా ఎంతో ప్రభావం చూపింది. భువనగిరి జిల్లాలో ప్రతి గ్రామంలో శాఖ విస్తరణకై సంఘ శతాబ్ది సంవత్సరం లక్ష్యంగా పనిచేశారు.

శిబిరాలు, వర్గలలో అందరికన్నా ముందుండేవారు. గృహస్థ జీవితం ఆరంభించిన తరువాత కూడా ప్రతి సంవత్సరం సంఘ శిక్షావర్గలలో శిక్షక్‌గాగాని లేదా ప్రబంధక్‌గా గాని ఉండటం వారి సమయ సమర్పణకొక నిదర్శనం. ఎందరో కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చి జిల్లాలో, విభాగ్‌లో అనేకమంది స్వయంసేవకులను తయారు చేసిన కార్యకర్త నాగరాజు. ఎంత బాధ వచ్చినా, వ్యక్తం చేయకుండా ఎదుటివారి బాధలు పంచుకొని సహాయ పడడం వారి సహజ గుణం. ఆ కారణంగానే స్వయంసేవకులు అందరూ ఆయనను ముద్దుగా నాగన్న అని పిలిచేవారు.

అయోధ్యలో రామ మందిరం నిర్మాణం జరగాలని ఆయన కోరిక. కానీ అది పూర్తి అవుతున్న సమయంలో ఆయన కన్ను మూశారు. వారి ఆత్మకు సద్గతులు కలగాలని ప్రార్థిద్దాం. ★

# కాల్పుల విరమణ సరే,

ఇజ్రాయెల్, పాలస్తీనాలు రెండూ తమ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా నాలుగు రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలన్న నిర్ణయాని కొచ్చాయి. గత ఆరు వారాలుగా ఇజ్రాయెల్ బాంబుదాడులతో రక్తమోడుతూ, ఆహారం, నీరు, ఇంధనం లేక అల్లాడుతున్న గాజాకు ఈ రకంగా కొంత ఊరట లభించినట్లయ్యింది. మరోవైపు రెండు దేశాలు తాము బందీలుగా ఉంచుకున్న కొందరు పౌరులను విడుదల చేయటానికి అంగీకరించాయి. వివాదం ముగియటా నికి తొలి అడుగు పడినట్టేనా? ఇక శాంతికి బీజం పడుతుందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గాజాలో ఈ తాత్కాలిక విరామం మరి కొంతకాలం కొనసాగే అవకాశం ఉందని అమెరికా ప్రకటించటం ఆశావహ పరిణామంగా చెప్పుకోవాలి.

ఇజ్రాయెల్, హమాస్ మధ్య గత నెల నుంచి జరుగుతున్న భీకరపోరుకు కాల్పుల విరమణ రూపంలో తాత్కాలిక విరామం లభించింది. ఒప్పందంలో భాగంగా గాజా, ఇజ్రాయెల్, హమాస్ మధ్య రెండు విడతలుగా బందీల విడుదల సాగింది. తొలుత హమాస్ 13 మంది ఇజ్రాయెలీలు, నలుగురు థాయ్‌లాండ్‌వాసులను విడుదల చేసింది. వారంతా ఇజ్రాయెల్‌కు చేరుకున్నట్టు ఆ దేశ మిలిటరీ ధ్రువీకరించింది. వారిని ఆస్పత్రికి తీసికెళ్లిన తర్వాత కుటుంబాలకు అప్పచెబుతామని తెలిపింది. తమ వద్ద ఉన్న బందీలను హమాస్ పంపిన కొద్దిసేపటికే ఇజ్రాయెల్ సైతం 39మంది పాలస్తీనావాసులను జైలు నుంచి విడుదల చేసింది. వీరంతా జెరూసలేం సహా వెస్ట్ బ్యాంకులోని తమ సొంత ప్రాంతాలకు వెళ్లనున్నారు. వీరిని తీసికెళ్లిన రెడ్ క్రాస్ ఇంటర్నేషనల్ బస్సు వెస్ట్ బ్యాంకు చేరుకున్నట్లు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. హమాస్ విడుదల చేసిన బందీల్లో ఏడుగురు చిన్నపిల్లలు, ఆరుగురు మహిళలు ఉన్నట్టు



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఒప్పందంలో భాగంగా నాలుగు రోజుల్లో 50 మంది బందీలను హమాస్, 150 మంది పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ విడుదల చేయవలసి ఉంది.

తొలిదశలో థాయ్‌లాండ్ కు చెందిన 10మందిని, ఫిలిప్పైన్స్ జాతీయునికి హమాస్ స్వేచ్ఛ కలిగించింది. రెండో దశలో కాస్త జాప్యం చోటుచేసుకుంది. గాజాకు మానవతా సాయం అందించటంలో ఆలస్యమైందని, దాంతో బందీల విడుదల అనుకున్న సమయానికి కావటం లేదని హమాస్ తెలిపింది. బందీల విడుదలకు ఖతార్ మధ్యవర్తిత్వం వహించింది. అమెరికా దాన్ని ముందుకు నెట్టింది. తెరవెనక ఎన్ని దేశాలు ప్రయత్నించినా చర్చల్లో హమాస్ పొలిటికల్ వింగ్‌కు నాయకత్వం వహిస్తున్న ఇస్మాయిల్ హనియేకు ఆతిథ్యం ఇచ్చిన ఖతర్ పాత్ర కీలకం అని చెప్పాలి. ప్యాకేజీలో రెండు కీలక అంశాలు. బందీల విడుదల, మానవతా సాయం ఈ రెండింటిని యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ తీర్మానం ఆమోదించింది.

హమాస్ అక్టోబరు 7న ఇజ్రాయెల్, గాజా సరిహద్దులో జరిపిన తీవ్రవాద దాడుల్లో 1200 మంది పొట్టన పెట్టుకోవటంతో పాటు దాదాపు 240 మందిని బందీలుగా తీసుకుపోయింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాపైన ప్రతీకార చర్యగా వైమానిక దాడులు జరిపి 14,800మందిని మందిని పొట్టనపెట్టుకోవటం తెలిసిందే. తర్వాత నానాటికీ లెక్కలు పెరుగుతూ వచ్చాయి.

గాజాలోకి ప్రవేశించే సరిహద్దులను ఇజ్రాయెల్ మూసివేసింది. దీనితో ఆహారం, నీరు, ఇంధనం, మందులు చేరే మార్గం లేకుండా పోయి, పలు అత్యవసర సేవలపై తీవ్ర ప్రభావం పడింది. దాదాపు 2.2 మిలియన్ల పాలస్తీనీయులకు అవసరమైన వస్తువులను నిలువరించటం తగదని, మానవతా సాయం అందించటానికి ఇజ్రాయెల్ ముందుకు రావాలని యూఎన్ ఏజెన్సీలు కోరాయి. దాంతో ఇజ్రాయెల్ 1399 లారీలోడ్ల మానవతా సాయం అందించటానికి అనుమతించింది. నవంబరు 21,22 తేదీలలో ఈజిప్టు రఫా సరిహద్దు లారీలు గాజాలోకి ప్రవేశించాయి.

ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య కుదిరిన ఒప్పందంపైన అమెరికా అధ్యక్షుడు జో బైడన్ స్పందిస్తూ, గాజాలో ఈ తాత్కాలిక విరామం కొనసాగేందుకు అవకాశా లున్నాయని చెప్పారు. సంధి ప్రారంభమైన తీరును ఆయన స్వాగతించారు.

కానీ ఒప్పందం ముగిసిన తర్వాత యుద్ధం కొనసాగుతుందన్న అభిప్రాయాన్ని రెండు దేశాలూ ప్రకటించాయి. హమాస్‌ను సర్వనాశనం చేయాలన్న నిర్ణయానికి తాము కట్టుబడి ఉన్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. హమాస్‌పైన యథావిధిగా దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటిం చారు. గాజాలో ఉత్తరాదిన గల ఇజ్రాయెల్ సైనిక దళాలు తమ తమ స్థానాల్లోనే ఉన్నాయి. కాల్పుల విరమణ సమయాన్ని తాము వ్యూహాలను బలపరచుకోవటానికి సైన్యాన్ని పటిష్టపరచుకోవటానికి వినియోగించుకుంటామని హమాస్ సీనియర్ నాయకుడు ఇజ్జత్ రిష్క్ ప్రకటించారు. మరో వైపు గాజా నుంచి దక్షిణాదికి పారిపోయిన వందల వేలమంది తిరిగొచ్చే అవకాశం లేదు.

**ఏ దేశం మద్దతు ఎంత?**

అమెరికాలో ఇజ్రాయెల్ కి మిత్రదేశంగా ఉంది. ఇప్పటి వరకూ ఈ దేశానికి 260 బిలియన్ డాలర్ల సైనిక, ఆర్థిక సహకారాన్ని అందించింది. దానితో పాటు అదనంగా ఎయిర్ డిఫెన్స్ మిస్సైళ్లు, గైడెడ్ బాంబులు, మందుగుండు సామాగ్రి అందిస్తానని హామీ ఇచ్చింది. దీనితో పాటు లెబెనాన్ హెజ్బొల్లాను అదుపు చేయటానికి తూర్పు మెడిటేరియన్ ప్రాంతానికి రెండు ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ గ్రూపులను పంపింది. ఇజ్రాయెల్‌లో అమెరికా లాబీలు ఉన్నాయి. మిలిటరీపరంగా కూడా ఈ రెండు మిత్రదేశాలు. అమెరికా నుంచి ఇజ్రాయెల్ ఆయుధాల కొనుగోలు, డబ్బు రూపంలో అత్యధిక సాయం పొందింది. 2016లో భద్రతా మండలి ఇజ్రాయెల్ సెటిల్మెంట్ల గురించి ఓటింగు నిర్వహించినప్పుడు అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా తన వీటో అధికారాన్ని ఉపయోగించ లేదు. డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షునిగా ఎన్నికయిన తర్వాత ఈ రెండు దేశాల మధ్య స్నేహం కొత్త ఊపిరిపోసుకుంది. అమెరికా తన రాయబార కార్యాలయాన్ని టెల్ అవివ్ నుంచి జెరూసలేం తరలించింది. దీనితో జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించిన తొలి దేశంగా అమెరికా అయ్యింది. ట్రంప్ తన పదవీ కాలం చివర్లో ధనిక అరబ్ దేశాలతో ఇజ్రాయెల్ సంబంధాలను మెరుగుపరచటం లో సఫలమయ్యారు. జో బైడెన్ అధికారం చేపట్టిన తర్వాత ఇజ్రాయెల్, పాలస్తీనా ఘర్షణలకు దూరంగా జరిగే వ్యూహాన్ని అవలంబించారు. ఇజ్రాయెల్ కు మద్దతు ఇచ్చినా

# యుద్ధ విరమణ..!

ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తున్నారు.

ఇరాన్, ఇజ్రాయెల్ ప్రధాన శత్రువు. హమాస్‌కు మద్దతుగా నిలుస్తోంది. దానితో పాటు హెజ్‌బొల్లాకు కూడా. హమాస్ పైన దాడులు ప్రారంభమైన నాటి నుంచి హెజ్బొల్లా తీవ్రవాదులు ఇజ్రాయెల్ దళాలపై కాల్పులు జరుపుతూ ప్రతిఘటిస్తున్నాయి. హమాస్ దాడుల్లో ఇరాన్ పాత్రపైన విమర్శలు వచ్చాయి గానీ టెహ్రాన్ ఖండించింది. ఈజిప్టు, సిరియా, ఇరాన్ సహా పలు అరబ్ దేశాలు పాలస్తీనాకు మద్దతు ఇస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను సభ్యత్వంలేని దేశం ‘అబ్జర్వర్‌స్టేట్’గా గుర్తిస్తుంది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనే హక్కు చర్చల ద్వారా ఐక్య రాజ్యసమితి సంస్థల్లో సభ్యత్వం పొందే హక్కు పాలస్తీనాకు ఉంది. 2011లో పాలస్తీనా ఐక్య రాజ్యసమితిలో పూర్తి సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకుంది గానీ అది సాకారం కాలేదు. ఐక్యరాజ్య సమితి సభ్యదేశాల్లో 70శాతం కన్నా ఎక్కువ దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తాయి.

రష్యా, చైనాలు హమాస్ దాడులను వ్యతిరే కించటానికి తిరస్కరించాయి. తాము రెండు దేశాలకు మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నాయి. మధ్య ప్రాచ్యంలో శాంతి లోపించటానికి అమెరికా విధానాలే కారణమని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా నిలవటంతో ఈ అంశంలో చైనా గుర్రుగా ఉంది. తక్షణం ఇజ్రాయెల్ గాజా ప్రజలపైన విధిస్తున్న సామూహిక శిక్షను నిలిపివేయాలని, సంక్షోభం ముదరకుండా వీలయి నంత త్వరగా మానవతా సాయం అందించటానికి ముందుకు రావాలని చైనా పిలుపు నిచ్చింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి సౌదీ అరేబియా, జోర్డాన్, ఈజిప్టు, పాలస్తీనియన్ నేషనల్ అథారిటీ, ఇండోనేషియా విదేశాంగ మంత్రులు, ఇస్లామిక్ కోఆపరేషన్ హెడ్స్‌ను బీజింగ్‌కు ఆహ్వానించి రెండు రోజులపాటు చర్చలు జరిపారు. అంతర్జాతీయ సమాజం చొరవచూపి ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధానికి తెరవేయ వలసిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**మరి భారత్ పాత్ర ఏమిటి?**

ఇజ్రాయెల్ –హమాస్ వివాదంలో భారత్ ప్రత్యేక భూమికను పోషించింది. వివిధ సందర్భాల్లో సంయుక్త ప్రకటనలు, వ్యక్తిగత ప్రకటనలు ఇవ్వటమే కాదు. ప్రధాని మోదీ స్వయంగా రెండు వర్చువల్ సమావేశాలు నిర్వహించి యుద్ధానికి స్వస్తి పలకవలసిన అవసరం గురించి మాట్లాడారు. జీ–20 ముగింపు సమావేశంలోనూ, ‘వాయిస్ ఆఫ్ ది గ్లోబల్ సౌత్ సమ్మిట్’లోనూ ఈ అంశానికి ప్రాధాన్యత ఇచ్చారు. అమెరికా, ఆస్ట్రేలియాలతో కలిసి ‘మానవతా విరామాలు’ ప్రకటించవలసిందిగా కోరింది. పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండు దేశాల్లో ప్రశాంతత నెలకొనాలని ఆశించింది. ఈజిప్టు ద్వారా గాజాకు 70టన్నుల మానవతా సాయాన్ని అందించింది. ఇందులో 16.5 టన్నుల మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. మరో వైపు 11 దేశాల బృందం పాల్గొనే బ్రిక్స్ ప్లస్ సమావేశానికి మోదీ హాజరుకాలేదు. గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడిన ఇజ్రాయెల్ పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారణ చేపట్టాలని దక్షిణాఫ్రికా డిమాండ్ చేయడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. ఇజ్రాయెల్ కాల్పుల ఉపసంహరించాలని కోరుతూ అక్టోబరు 26న ఐక్యరాజ్య సమితిలో, సభ్యదేశాల ఓటింగ్ కు దూరంగా ఉంది. కానీ నవంబరు 9న ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాల్లో అనుసరిస్తున్న విధాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఓటింగులోనూ పాల్గొంది.

అలీన ఉద్యమానికి నాయకత్వం వహించిన దేశంగా, భారత్ గ్లోబల్ సౌత్ విధానానికి కట్టుబడి ఉంది. పాలస్తీనా ఆశయానికి అండగా నిలుస్తోంది, అదే సమయంలో ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక, రక్షణ, తీవ్రవాద వ్యతిరేక సహకారం, వ్యాపార ఒప్పందాలకు కట్టుబడి ఉంది. 1992 నుంచి ఈ రెండు దేశాల మధ్య బంధం కొనసాగుతోంది. కార్గిల్ యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ భారత్ కు తగినన్ని ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని అందించింది.



**పశ్చిమదేశాలపైన ప్రభావం ఎలా ఉంటుంది?**

ఇజ్రాయెల్‌తోనూ, పాలస్తీనాతో దౌత్య సంబంధాల విషయంలో భారత్ భిన్నమైన వైఖరి అనుసరిస్తోంది. గత కొన్నేళ్లుగా భారత్ యూఏఈ తోనూ, సౌదీ అరేబియాతో ప్రత్యేక సంబంధాలను కలిగి ఉంది. ఆ దేశాలు ఇజ్రాయెల్ తో సంబంధాలు మెరుగుపరచుకోవటానికి ఎంతో కాలం పట్టదనే అభిప్రాయంతో భారత్ ఉండేది. దానివల్లనే రెండు కీలకమైన అంశాల్లో భారత్ భాగస్వామ్యం వహించింది. అవి ఇండియా– ఇజ్రాయెల్.. యూఏఈ.. యూఎస్(ఐ2యూ2) ట్రేడ్ ఇనీషి యేటివ్, ఇండియా మిడిల్ ఈస్ట్ –యూరప్ ఎనమిక్ కారిడార్. ఇజ్రాయెల్–హమాస్ వివాదంలవల్ల దీనిపైన ప్రభావం పడింది.

ఇజ్రాయెల్‌కు ప్రధాన శత్రువైన ఇరాన్‌తో ప్రత్యేకమైన సంబంధాలు ఏర్పడ్డాయి. చాబహార్ పోర్టు, ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్ పోర్టు కారిడార్ వంటి ప్రాజెక్టుల ద్వారా ఈ బంధం మరింత దృఢమైందని చెప్పాలి. ఇప్పటికే ఇజ్రాయెలీ కంపెనీలు నిర్మాణ రంగంలో పాలస్తీనా కార్మికుల స్థానంలో భారత్‌కు చెందిన లక్షమందికి అవకాశం ఇస్తామని ప్రకటించాయి.

ఏది ఏమైనా ఇజ్రాయెల్ పాలస్తీనాల మధ్య వివాదం సద్దుమణిగి ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి నెలకొనాలంటే, పాలస్తీయన్ల సార్వభౌమత్వాన్ని అంగీకరించాలి. గాజా నిర్బంధానికి ముగింపు పలకాలి. వెస్ట్ బ్యాంకు, తూర్పు జెరూసలెంలో ఆంక్షలు ఎత్తివేయాలి. ఇజ్రాయెల్‌ను అంగీకరించాలి. సరిహద్దులు, యూదుల సెటిల్మెంట్లు, పాలస్తీనా శరణార్థులు, స్వదేశానికి తిరిగి రావటం తదితర అంశాలపై రెండుపక్షాలు ఆమోదయోగ్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలి. అప్పటివరకూ యుద్ధానికి, దాడులకు విరామమేగానీ, ముగింపు అనేది ఉండే అవకాశమే లేదు. ★

# డిసెంబర్ 10 ధన్వంతరి జయంతి

**'జాగృతి' జాతీయ వార పత్రిక తన ఏడున్నర దశాబ్దాల అక్షర యజ్ఞ ప్రస్థానంలో అనేక అంశాలను స్పృశిస్తూ వస్తోంది. అలాంటి వాటిలో మరో ముఖ్యాంశం ఆయుర్వేద వైద్య విధానం. దీనిపై ఎన్నో సంచికలలో, ఎన్నో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ప్రధానంగా 'ఆంధ్రాయుర్వేద పరిషత్' స్వర్ణోత్సవాల సందర్భంగా వెలువడిన ప్రత్యేక సంచిక (13.1.1975)లో ఆయుర్వేద వైద్యం ఆవిర్భావం, చికిత్సా విధానం, విదేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన వైనం, అనంతర కాలంలో దీనిపై కమ్ముకున్న నిర్లక్ష్యపు నీడలు... తదితర అంశాలను విశ్లేషించింది. ఆయా రచయితల వ్యాసాల సారాంశంతో 'ధన్వంతరి' జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం..**

ఆయుర్వేదం ఎంత ప్రాచీన దేశీయ వైద్యమో, అంత ఆధునికమని, మన దేశానికి ఒకే సంస్కృతి, ఒకే నాగరికత, ఒకే జాతీయపతాకం ఉన్నట్లు, ప్రాచీన వైద్యంలో ఆయుర్వేదం భారతదేశ జాతీయ సమగ్ర వైద్య విధానమని ఎందరో వైద్య నిపుణులు శ్లాఘించారు. ఇది దేశదేశాలను విశేషంగా ఆకర్షించిందని, విదేశీయులకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. 'మన దేశానికి దండయాత్రకు వచ్చిన అలెగ్జాండర్ వంటి వారు సహితం మన విజ్ఞాన ఔన్నత్యాన్ని గుర్తించి తమతో గ్రంథాలను తీసుకు వెళ్లినట్లు చరిత్ర చెబుతోంది. 'అలెగ్జాండర్ కాలానికి ముందు నుంచే ఎందరెందరో కేవలం ఆయుర్వేదం అధ్యయనానికి ఇక్కడికి వచ్చేవారు. బాగ్దాద్ రాజ్యంలో భారతీయ వైద్యులు నిపుణులుగా ఉంటూ వచ్చారు. ఎన్నెన్నో గ్రంథాలను అరబిక్, పర్షియన్ భాషలలోకి అనువదించడంలో వారు సాయపడ్డారు. ప్రస్తుతం కూడా అమెరికా, ఐరోపా దేశాల విద్యార్థులు ఏటేటా అధిక సంఖ్యలో భారతీయ విజ్ఞానం ఎడల అధికాధిక ఆసక్తి చూపడం గమనిస్తున్నాము. వారిచటికి వచ్చి వ్యాధులను నయం చేయడంలో మనం అనుసరించే విధానాలను పరిశీలించి తమతమ దేశాలలో అన్వయించుకోవ డానికి ప్రయత్నిస్తున్నారు. ఈ దేశములోని ప్రాచీన విజ్ఞానం, వేదాంతముల ఎడ అమెరికా, యూరోప్‌లలో ఆసక్తి అంతకంతకు ఎక్కువవు తున్నది' (ప్రపంచ జైత్రయాత్రకు బయల్దేరేందుకు ఇది సమయము/) అని ఆయుర్వేద వైద్యనిపుణులు కేఆర్ శ్రీకాంతమూర్తి వివరించారు.

'సర్వ కాలావస్థలకు అనుగుణము, సమగ్రము, సంపూర్ణమైనది ఆయుర్వేద విజ్ఞానం'అని 'ఆంధ్రాయుర్వేద పరిషత్' అప్పటి అధ్యక్షులు పీబీ శరకోపాచార్యులు పేర్కొన్నారు. 'ఆయుర్వేదము ఒక శాస్త్రము, కళ, భారతీయ జాతీయ వైద్యములు. మానవ కళ్యాణము కొరకై భగవద్దత్తమైనవి. భారత సమాజ నైతిక విలువలు,ఆర్థిక సామాజిక స్థితులు, ఆచార్య వ్యవహారములు, పర్వములు, నిత్యనైమిత్తిక కర్మలు ఈ దేశమున లభించు ద్రవ్యములతో సముచ్చయం చేస్తూ రచించుకోవాలి. అట్టి వైద్యము ఆయుర్వేదము' అని నిర్వచించారు. 'దీని రచనా విధానము, అంగము పరిశీలించిన దీని ఘనత ద్యోతకమగును' అనీ పేర్కొన్నారు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

దేహానికి మనస్సుకు చికిత్స చేసే సమగ్ర వైద్యం ఆయుర్వేదశాస్త్రము' అని మరో ఆయుర్వేద వైద్య నిపుణులు డా. గంటేల వెంకటేశ్వరశాస్త్రి అన్నారు. 'శరీరము, ఇంద్రియములు, మనస్సు, ఆత్మ–ఈ నాలుగింటి సంయోగమునకే ఆయువని శాస్త్రంలో చెప్పారు. పై నాలిగింటిని వివరముగా తెలియజేయు శాస్త్రమునకు ఆయుర్వేదమని పేరు. దీనియందు మనకు ప్రత్యక్షముగా కనిపించు శరీరమునకు సంబంధించిన విషయములే గాక, అనుమాన ప్రమాణము ద్వారా గ్రహించదగిన యింద్రియములు, మనస్సు, ఆత్మ అను వానిని గురించి కూడా వివరముగా చెప్పారు. కనుకనే ఆరోగ్యవంతుని లక్షణములను చెప్పుచూ ఆయుర్వేదములో 'సమ దోషస్సమానిశ్చ సమధాతు మలక్రియః/ ప్రసన్నాత్మేంద్రియ మవా/ స్వస్థయిత్యభి ధీయతే..' వాతాది దోషములు హెచ్చుతగ్గులు లేక సమస్థితిలో నుండువాడు. జఠరాగ్ని సమస్థితిలో కలవాడు. రసరక్తాది ధాతువులు, వాని మలము యొక్క వ్యాపారము సమముగా నుండువాడు ఆరోగ్య వంతుడని చెప్పి, ప్రసన్నమైన ఆత్మ, ఇంద్రియములు, మనస్సు కలిగి యుండుట గూడ ఆరోగ్యవంతుని లక్షణముగా చెప్పబడినది' అని వివరించారు.

చరకుడు, బౌద్ధ నాగార్జునుడు, జీవకుడు, భావమిశ్రకుడు, శార్ఙధరుడు తదితరులు, రుషులు తమ తపోబలం, యోగసిద్ధులు, దివ్య దృష్టితో ఎన్నో ఓషధులు కనుగొన్నారు. గురుశిష్య సంప్రదాయ ముగా భావితరాలకు అందించారు. ఈ వైద్యం పుట్టు పూర్వోత్తరాల గురించి డాక్టర్ వైవీఎన్ మోహనరావు తమ వ్యాసం (జాతీయవైద్యం ఆయుర్వేదం.. సనాతనము, నిత్యనూతనమునగు శాస్త్రమిది)లో 'ఆయుర్వేదము వేదముల అంతర్భాగము. సృష్టికి పూర్వము సృష్టి కర్తయగు బ్రహ్మకు వేదములు శబ్ద రూపమున వినబడినవి. అట్లు వినబడినవానిని బ్రహ్మ స్మరించెను. ప్రజలను సృష్టించి, ఆ ప్రజల మేలుగోరి–మొదట దక్ష ప్రజాపతికి ఆయుర్వేదమునుపదేశించెను. అతడు దేవతలలో ప్రచారం కోసం అశ్వనీదేవతలకుపదేశించాడు. వారి నుండి ఇంద్రుడు నేర్చుకొన్నాడు. అతని నుంచి భరద్వాజ మహర్షి నేర్చుకొని వచ్చి భూలోకమున ప్రచారము చేశాడు. భరద్వాజులు నుండి ఆయుర్వేదము పరంపరగా పునర్వసు (ఆత్రేయుడు), అగ్నివేశాదులు, చరకుడు, ధన్వంతరి (కాశీరాజు దివోదాసు), సుశ్రుతుడు, నాగార్జునుడు, దృఢబలుడు, ఆ తర్వాత వ్యాఖ్యాతరులగు




చక్రపాణి, దల్హణుడు, గయదాసు, శివదాసు..వీరి ద్వారా వాడుకలోకి వచ్చినది' అని వివరిచారు. 'మానవుని తీర్చిదిద్ది ఆయువును పెంపొందించి ఇహలోకమందు సుఖమును, పరలోక మందు మోక్షమును ప్రసాదించునట్టి గొప్పశాస్త్రమా యుర్వేదము. ఆయుర్వేదములో ఫిలాసఫీ, రెలిజియన్స్, సైన్సు.. అంతా ఇమిడియున్నది. ఇందు పారా సైకాలజీ, ఇమ్యూనాలజీ, బాక్టీరియాజీ, క్రిమిరోగముల గురించి, వాక్సినేషన్ గురించి వివరముగా చెప్పబడినది' అనీ వెల్లడించారు

'ఆయుర్వేదము పాతకాలపు భావముల వారి వైద్య విధానము' అని వ్యాఖ్యానాలు ఎదుర్కొన్నా, ఆనాడే సాంకేతికతను ప్రదర్శించింది. అదే విషయాన్ని డా.డి.హనుమంతరావు తమ వ్యాసం ('ఇంజక్షన్ విధానము ఆయుర్వేద సమ్మతమే'/ జాగృతి,5.4.63) వివరించారు. తరువాతి తరాలు చెబుతున్నట్లు ఇంజక్షన్ ప్రక్రియ ఆధునికం కాదని సోదాహరణగా తెలిపారు. 'పూర్వము సూచీముఖ యంత్ర ప్రయోగము ద్వారా ఔషధమును

# భారతీయ దివ్యౌషధం 'ఆయుర్వేదం'



శరీరములోనికి పంపునట్లు బౌద్ధ సాహిత్యము చెప్పుచున్నది' అని పేర్కొన్నారు. 'వేదకాలము మొదలు వాగ్భటుని కాలము వరకు మన దేశమున ఆయుర్వేద వైద్యాంగములగు 'సూచీముఖ యంత్ర, శల్యతంత్రము' మిక్కిలి ఉచ్ఛదశలోనున్నట్లును శుశ్రుతాది శస్త్రచికిత్స నిపుణులు గొప్పగొప్ప రోగములకు శస్త్రచికిత్సలు, సూచీముఖ యంత్ర ప్రయోగములు జయప్రదముగా జరిపినట్లును కూలంకషముగా చదివిని వారికి బోధపడగలదు. రెండు వేల సంవత్సరముల పూర్వమే శస్త్రచికిత్స యందు సూచీముఖ యంత్ర ప్రయోగము నందును పూర్వాచార్యులకు గల నైపుణ్యములను జూచి ఈ కాలపు వారు ఆశ్చర్యపొందుచుండ, నత్యంత స్వల్ప విషయమగు ఇంజక్షన్‌ల పద్ధతి ఆయుర్వేదమున లేదనుట గాని, దేశీయవైద్యులు దీనిని వాడరాదనుటగాని అసమంజసము! ' అని పేర్కొన్నారు.

బౌద్ధులు దేశంలోని తక్షశిల, నలందా, ఉజ్జయిని, కాశీ మున్నగుచోట్ల విశ్వవిద్యాలయాలు నెలకొల్పి ఆయుర్వేద విద్యను ప్రోత్సహించారు. వారి వల్లనే ఆయుర్వేదము నవమానకారాము ధరించిందని ఆ వైద్య నిపుణులు చెబుతారు. అంతటి ఈ వైద్య విద్య ప్రాభవం పరపాలకుల కాలంలో మసకబారింది. దేశంలో జరుగుతున్న యుద్ధాలు, విదేశీయులైన మహమ్మదీయుల పరిపాలన కారణంగా ఆయుర్వేదము క్షీణించింది (జాగృతి/ 5.4.1963). దీని పట్ల నిరాదరణ పెరగసాగింది. 'పాలకులను బట్టే పాలితులు' అన్నట్లు వారి నిర్లక్ష్యానికి తోడు ప్రజల్లోనూ విశ్వాసం సన్నగిల్ల సాగింది. స్వతంత్ర భారతంలోనూ అదే పరిస్థితి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సుమారు పాతికేళ్ల వరకు అదే పరిస్థితి కొనసాగింది. 'బానిసకాలములో భారతీయులు చాలా విజ్ఞానమును కోల్పోయినారు. అట్టి వానిలో ఆయుర్వేదమును ఒకటి. పలు గ్రంథములు అలభ్యములైనాయి. పండితులు కరవైనారు. ఆ విద్యా విధానం అస్తవ్యవస్థితమైనది. ఓషధులను గుర్తించువారు లేరు. పెంచు యోజనలు లేవు. అనేకములు అలభ్యములు. స్వతంత్రావరణతో ఈ పరిస్థితి యందు మార్పు వచ్చి యుండవలసింది. కాని తగినంత మార్పు రాలేదు' (ఆయుర్వేద అభివృద్ధి/సంపాదకీయం/13.5.1975) అని ఆందోళన వ్యక్తమైంది. ఆయుర్వేదము పాతకాలపు భావములవారి వైద్య విధానమయినది. దానికి ప్రజల ఆదరణ, ప్రభుత్వ ప్రోత్సాహము రెండూ అల్పంగానే ఉన్నాయి. ఆయుర్వేదీయ వైద్యునిది ద్వితీయశ్రేణి మాత్రముగనే నున్నది. ఈ ఔషధములు వెదకి సంపాదించవలసినవి గానే ఉన్నవి. ఉద్ధరించువారు లేక దీనమై నిలిచి యున్నది' అనీ పేర్కొంది.

ఆయుర్వేదం సనాతన వైద్య విధానమైనా, ఇతర వైద్య పద్ధతులను నిరాదరించలేదు. అంకితభావం, చిత్తశుద్ధితో దీనిని అభ్యసించి, చికిత్స అందించడంతో పాటు ఇతర శాస్త్రాలను అధ్యయనం చేయాలని ఆయుర్వేద పూర్వాచార్యులు సూచించించారు. 'ఆయువును పెంపొందించి సుఖ జీవితమును నిర్దేశించు శాస్త్రమాయుర్వేదము. దయా, ధర్మ, సత్య, శుచిత్వ సౌజన్యములు, త్యాగము, సౌశీల్యము, ప్రశాంత జీవనంతో అభ్యసించిన విద్యతో పాటు దయ, శుచిత్వం, సౌహార్ద్రం, నిర్మలమైనట్టి మనస్సు, ఏకాగ్రత, పట్టుదల, …ఇట్టి గుణములతో రోగులను ప్రేమగా చూసుకుంటూ అన్యశాస్త్రములను కూడా పఠించి, క్రొంగొత్త వివరములను కాయకల్ప చికిత్సలోనూ, శస్త్ర చికిత్సలోనూ వర్తింపచేయాలి' (జాతీయ వైద్యం ఆయుర్వేదం) అని హితవు చెప్పారు.'ఆయుర్వేద సిద్ధాంతాన్ని ఆధునిక వైద్య విధానాన్ని మేళవించాలి' అంటూ డా. వై.సూర్య నారాయణరావు తమ వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

'ఈ మధ్యకాలమున ప్రపంచమున ఆధునిక వైద్య విధానములు వెల్లివిరిసినవి. ఎన్నెన్నో నూతన విధానములు గుర్తింపబడినవి. నూతన విధానముల ఔన్నత్యమును గుర్తించుట యోగ్యుడగు అధ్యయ నపరుని లక్షణము. ప్రాచీన మౌలిక విజ్ఞానము, ఆధునిక విధాన విజ్ఞానమును సమన్వయించుకొని ఈ భవనము నిర్మించగల అవకాశము నన్వేషించుట దేశ కాలానుగుణయమైన కృషి కాగలదు' అని 'జాగృతి' సంపాదకీయం అభిప్రాయపడింది.

వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆయుర్వేదం ఆధునిక వైద్య ప్రభావాన్ని తట్టుకుంటూ తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. అయితే ప్రభుత్వపరంగా అంతగా ప్రోత్సాహం లేదని నాటి వార్తా కథనాలను బట్టి తెలుస్తోంది. సుమారు ఐదు దశాబ్దాల నాటి పరిస్థితికి నేటి స్థితి అంత భిన్నంగా ఉండకపోవచ్చు. విజయవాడ ఆయుర్వేద కళాశాల అప్పటి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరంరాజు కృష్ణమూర్తి వ్యాసం (అధ్వాన్న స్థితిలో ఉన్న ఆయుర్వేద కళాశాలలు)లో 'ఆంధ్రదేశమునందు ఆయుర్వేదము చాలా ప్రజాదరణ పొందిన వైద్యము. నేటికినీ భారతావనిలో ఆయుర్వేద వైద్యులకు ప్రత్యేక స్థానము కలదు. కానీ కాలక్రమేణ ఆధునిక వైద్యమునందలి ఇంజక్షను విధానము,రోగ నిర్ణయ పద్ధతులు, యక్స్ రే, శస్త్ర కర్మ విధానముల ద్వారా ప్రజాదరణ పొందుచున్నవి. అయినప్పటికీ ఆయుర్వేదం ప్రతి గ్రామమునందే గాక ప్రతి గృహమునందు గూడ ఉపయోగించబడు తున్నది' అని తెలిపారు.

ఆయుర్వేదం పట్ల పాలకుల, పాలితుల తీరుతెన్నులను అటుంచితే ఈ ఔషధ తయారీలో శ్రద్ధాసక్తులు కనబరచాలని నిపుణులు చెప్పారు. 'ఆయుర్వేదానికి మంచిరోజులు రావాలంటే ఔషధాల తయారీ శాస్త్ర ప్రకారం జరగాలి' అని ఆయుర్వేద వాచస్పతి డాక్టర్ ప్రకాశచంద్ర శతపథి అభిప్రాయ పడ్డారు. 'ఆయుర్వేద శాస్త్రమున సోముడు ప్రధానుడు. ఈ సోముడు శరీరంలో మనోంద్రియ మునకు అధిష్ఠానుడు. వాతపిత్త శ్లేష్మములలో శ్లేష్మం సోమాంశయే. కనుకనే ఓషధులను చంద్రుడు సర్వసంపన్నుడుగా నుండు తరిన గ్రహించాలి. గనుకనే ఆయుర్వేద తంత్రజ్ఞులు'శరద్యఖిల కార్యార్థం గ్రాహ్యం పరమౌషధమ్/'శరత్కాలమున ఓషధులు వీర్యమంతముగా నుండుటచే ఆ కాలముననే సర్వ ద్రవ్యములు సంగ్రహించ వలయునని తెలిపినారు. ఉదాహరణకు: పుష్యామగ చూర్ణమున్నది. ఇందులోని ఓషధులన్నీ పుష్యమీ నక్షత్రములో కూడిన దినముననే సంగ్రహించి ఆ రోజునే యీ ఔషధాన్ని తయారు చేయాలి' అని వివరించారు.

దేవతల నుంచి రుషులకు, వారి నుంచి మానవ వైద్యులకు పరంపరంగా అందుతున్న ఆయుర్వేదం, ఎన్ని వైద్య విధానాలు వస్తున్నా తన ఉనికిని కాపాడుకుంటూనే ఉంది, ఉంటుంది. ★

# కాంగ్రెస్ ముందు 'హెరాల్డ్' గండం

జవాహర్‌లాల్ నెహ్రూ ఆలోచనా విధానాన్ని, వారసత్వాన్ని అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ తరచూ విమర్శిస్తుంటుంది. కానీ ఆ పని ఆయన వారసులమని చెప్పుకునే వారే చేస్తున్నారనే స్పృహ కాంగ్రెస్ నేతలకు కలగడం లేదు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో నెహ్రూ స్థాపించిన 'నేషనల్ హెరాల్డ్' పత్రిక ఆస్తులను కొల్లగొట్టేందుకు చేసిన ప్రయత్నాలతో అడ్డంగా దొరికిపోయారు సోనియా, రాహుల్. ఇప్పుడా పత్రిక ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)అటాచ్ చేసింది. కాంగ్రెస్‌కు 2024 సార్వత్రిక ఎన్నికల ముందు హెరాల్డ్ గండం ఎదురైంది.

దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ప్రచారం హోరెత్తిన వేళ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరమైన మరోవార్త పత్రికల్లో ప్రముఖంగా కనిపించింది.. దీంతో నేషనల్ హెరాల్డ్ వ్యవహారం మరోసారి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఈ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు సంబంధం ఉన్న యంగ్ ఇండియన్, అసోసియేటెడ్ జర్నల్(ఏజేఎల్)కు చెందిన రూ. 751.90 కోట్ల విలువైన ఆస్తిని అటాచ్ చేసినట్లు ఈడీ వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసుపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ కొనుగోలులో మోసం జరిగినట్లు ఇప్పటికే బయటపడింది.



అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు ఢిల్లీ, ముంబయి, లక్నో నగరాల్లో రూ.661.69 కోట్ల ఆస్తులు ఉన్నాయని దర్యాప్తులో తేలినట్లు తెలిపింది.

దీంతోపాటు ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో యంగ్ ఇండియన్ రూ.90.21కోట్లు కలిగి ఉందని తెలిపింది. మరోవైపు నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌లను ఇదివరకే విచారించిన ఈడీ వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది.

ఈ మొత్తం వ్యవహారం 2012లో ప్రముఖ రాజకీయ నాయకుడు, న్యాయవాది సుబ్రహ్మణ్యస్వామి చేసిన ఫిర్యాదుతో దేశం దృష్టికి వచ్చింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు ఏజేఎల్ ప్రచురణకర్తగా ఉంది. సోనియా, రాహుల్ సహా కొందరు కాంగ్రెస్ నేతలు ప్రమోటర్లుగా ఉన్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ దానికి యాజమాన్య సంస్థ. యంగ్ ఇండియన్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయి పడ్డ రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును కేవలం రూ.50లక్షలు చెల్లించడం ద్వారా సొంతం చేసుకోవాలని సోనియా, రాహుల్ తదితరులు కుట్ర పన్నినట్లు సుబ్రమణ్యస్వామి ఫిర్యాదు చేశారు.

వార్తాపత్రికలను ప్రచురించడానికి రాయితీ ధరలకు భూమిని పొందిన అసోసియేటెడ్ జర్నల్.. 2008లో తన కార్యకలాపాలను మూసేసింది. ఆ ఆస్తులను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందనేది ప్రధానమైన ఆరోపణ. ఏజేఎల్‌తో వందల కోట్ల ఆస్తులు సంపాదించేందుకు కుట్ర జరిగినట్లు తేలింది.

**నేషనల్ హెరాల్డ్ మొదలైంది ఇలా..**

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భారతీయుల వాణిని వినిపించేందుకు జాతీయవాద పత్రికల స్థాపన అవసరాన్ని ఆనాటి పెద్దలు గుర్తించారు. ఇందులో భాగంగానే 1938లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవాహర్‌లాల్ నెహ్రూ 'నేషనల్ హెరాల్డ్' పేరుతో ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. ఏజేఎల్ ఆధ్వర్యంలో ఈ పత్రిక కొనసాగింది. నేషనల్ హెరాల్డ్‌లో 5 వేల మంది స్వాతంత్ర్య సమరయోధులు వాటాదారులు కాగా జవాహర్‌లాల్ నెహ్రూ ప్రధాన దాతగా ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి నేషనల్ హెరాల్డ్ అధికారిక పత్రికగా మారింది. ఇదే సంస్థ ఆధ్వర్యంలో హిందీలో 'నవజీవన్', ఉర్దూలో 'క్వామీ అవాజ్' దినపత్రికలు ఉన్నాయి. ఈ పత్రికలు నష్టాల్లో కొనసాగడంతో 2008లో మూసేయక తప్పలేదు. నేషనల్ హెరాల్డ్ మూతపడే నాటికి రూ.90.25 కోట్ల మేర కాంగ్రెస్ పార్టీకి బకాయిపడింది. ఇదంతా వడ్డీలేని రుణం.



**తెరపైకి యంగ్ ఇండియన్ లిమిటెడ్**

2009 కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యూపీఏ రెండోసారి అధికారంలోకి వచ్చింది. అప్పుడే కుట్రకు తెర లేపారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తులపై కన్నేసిన కాంగ్రెస్ పెద్దలు 2010లో లాభాపేక్షలేని

దాతృసంస్థ ముసుగులో యంగ్ ఇండియన్ లిమిటెడ్(వైఐఎల్)ను స్థాపించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆ సంస్థకు డైరెక్టర్. సోనియా గాంధీ, కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్ వైఐఎల్ భాగస్వాములు. తర్వాత కాలంలో మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్ మృతి చెందారు. 2010 నాటికి ఏజేఎల్ 1057 మంది షేర్ హోల్డర్లను కలిగి ఉంది. వారిలో కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి శాంతి భూషణ్ తండ్రి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మార్కండేయ కట్జు తండ్రి కూడా ఉన్నారు.

ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తనకు బకాయిపడిన ఏజేఎల్‌ను 2011లో యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు అప్పగించింది. దీనికి గాను కాంగ్రెస్ పార్టీకి వైఐఎల్ కేవలం రూ.50 లక్షలను చెల్లించింది. ఇలా నేషనల్ హెరాల్డ్ హక్కులను సొంతం చేసుకుంది.




స్వామి కేసుతో మలుపు

రాహుల్ గాంధీ డైరెక్టర్‌గా ఉన్న వైఐఎల్ మూలధన పెట్టుబడి రూ. 5 లక్షలు మాత్రమే. అయితే కోల్‌కతాకు చెందిన డొల్ల సంస్థ డొటెక్స్ మర్చెండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి కోటి రూపాయల రుణం తీసుకుని అందులోంచి రూ.50 లక్షలను కాంగ్రెస్‌కు చెల్లించి నేషనల్ హెరాల్డ్‌పై హక్కులు పొందింది. ఏజేఎల్‌కు చెందిన మూతపడిన మీడియా సంస్థలను, ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా ఉన్న రూ.2వేల కోట్లకు పైగా విలువైన ఆస్తులను వైఐఎల్ మోసపూరితంగా స్వాధీనం చేసుకుంది. ఈ మొత్తం వ్యవహారం సుబ్రహ్మణ్య స్వామి దృష్టికి వచ్చింది. నేషనల్ హెరాల్డ్ విషయంలో భారీ కుంభకోణం జరిగిందని, సోనియా, రాహుల్ గాంధీ తదితరులకు దీనిలో ప్రమేయం ఉందని ఆరోపిస్తూ సుబ్రమణ్య స్వామి 2012లో ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ మొత్తం వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొంటూ ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సోనియా, రాహుల్‌కు నోటీసులు జారీ చేశారు.

## ఈ ప్రశ్నలకు బదులేది?

నేషనల్ హెరాల్డ్ నుంచి రావాల్సిన బకాయి రూ.90.25 కోట్లకు గాను వైఐఎల్ నుంచి రూ.50 లక్షలు మాత్రమే తీసుకున్న కాంగ్రెస్‌పార్టీ...మిగతా రుణ మొత్తం రూ.89.75 కోట్లను మాఫీ చేసింది. ఏజేఎల్‌లో మిగిలిన వాటాదారులు శాంతి భూషణ్, మార్కండేయ కట్జు తదితరుల అనుమతిలేకుండానే ఆ సంస్థకు చెందిన వందల కోట్ల విలువైన ఆస్తులు సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన వైఐఎల్‌కు మళ్లాయి.

వాస్తవానికి నేషనల్ హెరాల్డ్‌కు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.90.25 కోట్ల అప్పు కూడా అక్రమమే. ఇన్‌కంటాక్స్ చట్టం మేరకు రాజకీయ పార్టీలు ప్రైవేటు కంపెనీకి రుణం ఇవ్వటం చట్టవిరుద్ధం. రుణం మొత్తం ఇవ్వకుండా మాఫీ ఎలా చేశారు? అన్నది మరో ప్రశ్న.

2010 నవంబర్‌లో కంపెనీ పెడితే డిసెంబర్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఏజేఎల్ ముందు ఓ ప్రతిపాదన పెట్టారు. 'కాంగ్రెస్ పార్టీ నుంచి మీరు తీసుకున్న అప్పును మేం తీసుకుని తీరుస్తాం. దానికి బదులు కంపెనీలో వాటాలు ఇవ్వాలి' అన్నది ఆ ప్రతిపాదన. బోర్డు అందుకు అంగీకరించి 90 కోట్లకు సరిపడా షేర్లను మంజూరు చేసింది. సోనియా, రాహుల్ కాంగ్రెస్ పార్టీకి 50 లక్షలు చెల్లించారు. ఇది చాలంటూ పార్టీ మిగిలిన రుణం మాఫీ చేసింది. అంటే 50 లక్షలకు నేషనల్ హెరాల్డ్ ఆస్తులన్నీ తల్లీకొడుకులకు వచ్చాయన్నమాట. మూతపడిన పత్రిక మీద వీళ్లకు అంత ప్రేమ ఎందుకనేది ప్రశ్న.

నేషనల్ హెరాల్డ్ వ్యవహారంపై ఈడీ గత ఏడాది ఎఫ్ఐఆర్ నమోదుచేసి విచారణ జరుపుతోంది. ఇప్పటికే సోనియా గాంధీ, రాహుల్ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పవన్ బన్సాల్‌లను ప్రశ్నించింది. ఏజేఎల్‌కు రూ.800 కోట్ల ఆస్తులు ఉన్నాయని, యంగ్ ఇండియన్ లాభదాయక సంస్థ కాకపోతే దాని భూములు, భవనాలను అద్దెకు ఇవ్వడం వంటి వాణిజ్య కార్యకలాపాలు ఎలా చేపడుతోందని ఈడీ విచారణ జరుపుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఏజేఎల్, వైజేఎల్ ఆస్తులను జప్తు చేసింది.

## కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు అసోసియేట్ జర్నల్ ఆస్తులను ఈడీ అటాచ్ చేయడం బీజేపీ భయాన్ని సూచిస్తోందని అన్నారు. 'నేషనల్ హెరాల్డ్ స్వాతంత్ర్య ఉద్యమానికి గొంతుక. భారత జాతీయ కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమంలో తన పాత్రకు గర్వకారణం' అని గొప్పగా చెప్పుకొచ్చారు. కానీ ఆధారాలు సహా దొరికిపోయి కేసులు మెడకు చుట్టుకున్న తర్వాత ఎంత వాదించినా ఫలితం ఏమిటి?

ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ తిప్పికొట్టారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యోద్యమాన్ని, దానితో ముడిపడిన నేషనల్ హెరాల్డ్ ఆస్తులను సొమ్ము చేసుకుందని ఆరోపించారు. నిజాయతీ లోపించిన వారిపై, ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఒక కుటుంబం చేసిన తప్పిదాలకు కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు

## ఇదేనా నెహ్రూ స్ఫూర్తి?

జవాహర్‌లాల్ నెహ్రూ వారసత్వాన్ని, ఆలోచనా విధానాన్ని బీజేపీ అణచివేస్తోందని కాంగ్రెస్ నాయకులు తరచూ గొంతు చించుకుంటారు. ఇక్కడేమో నెహ్రూ స్థాపించిన పత్రిక స్ఫూర్తిని ఆయన వారసులుగా చెప్పుకునే 'గాంధీ'లు నీరు గార్చారు.. ఆ సంస్థ ఆస్తులను అక్రమ మార్గంలో కొల్లగొట్టేందుకు ప్రయత్నించారు.

వాస్తవానికి కుట్ర జరిగింది అమలులో పెట్టింది యూపీఏ (కాంగ్రెస్) హయాంలోనే! అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నది మన్మోహన్ సింగ్. కానీ ఇదంతా ఇప్పటి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ కుట్ర అంటూ కాంగ్రెస్ పార్టీ అంటోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని బయటకు తెచ్చింది సుబ్రహ్మణ్య స్వామి. ఆయనకు బీజేపీతో ఇప్పుడు సంబంధాలు అంతంత మాత్రమే. మొత్తానికి అడ్డంగా దొరికిపోయిన కాంగ్రెస్ పెద్దలు చట్ట ప్రకారం పడే శిక్ష కోసం ఎదురు చూడక తప్పదు. 2024లో రానున్న సార్వత్రిక ఎన్నికల వేళ వారికి 'నేషనల్‌హెరాల్డ్' గండం పొంచివుంది.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

పెరుగుతున్న ఘర్షణలు, పోటీతత్వం, ఇటీవలి తీవ్రవాద దాడులు ప్రపంచాన్ని సంక్లిష్ట స్థితిలోకి తోసివేశాయి. శామ్యూల్ హంటింగ్టన్ ప్రతిపాదించిన 'క్లాష్ ఆఫ్ సివిలైజేషన్స్' (నాగరికతల ఘర్షణ) సుదూర భావిలో జరుగబోయే ఘటన కాదు, నేటి వాస్తవం, పొంచి ఉన్న ముప్పు.ఈ నూతన వాస్తవం అంతర్గతంగా ఉన్న హిందూ జాగృతిని ప్రేరేపించింది. అలసత్వంలో మునిగి ఉన్న ప్రజలు, ముఖ్యంగా భారతీయులు ఉలిక్కిపడ్డారు. భారతీయ నాగరికత కొనసాగింపును, దాని ప్రాచీనతను నిరంతరం తక్కువ చేసి చూపే కథనాల యుద్ధంలో, ఈ అభిభాషణను వలస భావనను నుంచి విముక్తమయ్యేందుకు జరుగుతున్న న్యాయమైన ప్రయత్నం వేగాన్ని పుంజుకుంది.

గతంలో లేనివిధంగా, మూలాలతో తిరిగి అనుసంధానం కావడం, తాము ఎంతో ప్రియంగా భావించే ప్రాచీన భావాల అర్థాన్ని తెలుసుకునే దిశగా కొత్త ఆసక్తి పెరుగుతోంది. పూతలు పూయని వాస్తవాల ధార్మిక అన్వేషణకు తోడ్పడేలా,'రామ అండ్ అయోధ్య', 'ది బాటిల్ ఫర్ రామా: కేస్ ఆఫ్ ది టెంపుల్ ఎట్ అయోధ్య', 'సతీ: ఎవాంజలిస్ట్స్', 'బాప్టిస్ట్ మిషనరీస్', 'ది చేంజింగ్ కలోనియల్ డిస్కోర్స్', 'ఫ్లైట్ ఆఫ్ డైటీస్ అండ్ రీబర్త్ ఆఫ్ టెంపుల్స్: ఎపిసోడ్స్ ఫ్రమ్ హిస్టరీ', 'వాసుదేవ కృష్ణ అండ్ మథుర' వంటి తన రచనల ద్వారా డా॥ మీనాక్షీ జైన్, విద్యా సంస్థలపైనే కాదు ఇతివృత్తంపై కూడా ఆధిపత్యం చెలాయిస్తూ వచ్చిన పక్షపాత చరిత్ర రచన పట్టు నుంచి విడిపించారు. తన తాజా పుస్తకం 'ది హిందూస్ ఆఫ్ హిందుస్తాన్: ఎ సివిలైజేషనల్ జర్నీ' ద్వారా జాతీయ ఐక్యత అన్న భావనకు డా॥ జైన్ చక్కని స్పష్టతను అందించారు.

**ప్రచురణ:** ఆర్యన్ బుక్స్ ఇంటర్నేషనల్, 2023
**పేజీలు :** 318,
**ధర :** రూ.995






ఈ భావనకు ఒక నేపథ్యాన్ని కల్పిస్తూ, పుస్తకం ముందుమాట ఇలా ప్రారంభమవుతుంది– 'బ్రిటిష్ పాలనాకాలంలో, వలస పాలనాధికారులు/ పండితులు విశాలమైన, వైవిధ్య భరితమైన దేశాన్ని వశం చేసుకునే క్రమంలో ' మనం తరచుగా వినే ఐరోపా భావాలు భౌతిక, రాజకీయ, సామాజిక లేదా మతపరమైన ఐక్యత అన్నవాటిని భారత జాతి, భారతీయులు ఎన్నడూ కలిగి లేరని ప్రకటించారు' (స్ట్రాచీ, 1911;5).

ప్రతిరోజూ సంకల్పం, శుద్ధి మంత్రమైన 'గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మి సన్నిధిన్ కురు' అని సంప్రదాయకంగా ఉచ్చరిస్తారు భారతీయులు. తమ ప్రాచీనతకు



డా. రామహరిత

నీరాజనాలు పడతారు. అయినా వలస ప్రభువుల విశ్వసనీయ సాంస్కృతిక సిపాయిలు మాత్రం విపరీత భావాలు కలిగిన విన్‌స్టన్ చర్చిల్ 'భారత్ కేవలం భౌగోళిక వ్యక్తీకరణ మాత్రమే' అంటూ ఎనిమిది దశాబ్దాల కిందట వదరిన విషయాన్నే పట్టుకొని వేళ్లాడుతున్నారు.

తన శైలిలోనే డా॥ జైన్ తిరుగులేని వాస్తవాల అండతో తన ప్రస్తుత రచనలో రామజన్మభూమిపై వచ్చిన కల్పిత చరిత్రలను చీల్చి చెండాడారు. 'భారత్ కేవలం భౌగోళిక నిర్మితి' మాత్రమే అన్న ఉద్దేశపూర్వక ప్రచారాన్ని ధ్వంసం చేశారు. భారత్ మూలాల జాడను తీస్తూ డా॥ జైన్, అధర్వణ వేదంలో తొలి జాతీయ గీతంలోని 63 శ్లోకాలను పాణిని, కాత్యాయనుడు, పతంజలి భారత్‌ను మహా పృథ్విగా పూజ్య భావంతో అభివర్ణించిన త్రిపీఠికలలోని మహా గోవిందసుత్తాంతను ప్రస్తావించారు. భారత్ ఆకారం ఎడ్లబండిలా – ఉత్తరంలో దీర్ఘ చతురస్రంగా, దక్షిణంలో శంఖులాగా ఉంటుందని పోల్చారు.

భారతీయ మహాకావ్యాలు రామాయణ, మహాభారతాలు, పురాణాలు దేశంలోని నదులు, పర్వతాలు, అడవులు, ఎడారులు వంటి భౌగోళిక అంశాలపై సుసంపన్నమైన సమాచారంతో నిండి ఉంటాయి. భారత్‌ను తొమ్మిది (నవ ఖండ) భాగాలుగా విభజించడం గురించి పురాణాలు ప్రస్తావించాయి. ఈ భావననే ప్రాచీన ఖగోళ శాస్త్రజ్ఞుడు పరాశరుడు అనుసరించాడు. వరాహమిహిరుని బృహత్ సంహిత వాస్తవంగా ఈ భాగాల స్థలవర్ణనాత్మక వివరాలను అందిస్తుంది. రాజశేఖరుడు 10వ శతాబ్దంలో రచించిన కావ్యమీమాంస భారత్‌ను – మధ్యదేశ, ఉదీచ్య, ప్రాచ్య, దక్షిణాపథ, అపరాంత అనే ఐదు భాగాలుగా విభజించింది. ఇవి కొన్ని పురాణాలలోని భువనకోశ అధ్యాయాలను పోలి ఉంటాయి. వాస్తవానికి 'ఫైవ్ ఇండీస్' అన్న చైనా భావనను ఆ విభజనతో గుర్తించవచ్చు. కాళిదాసు కుమారసంభవం, మేఘదూతం కూడా భారత భౌగోళిక వివరణలతో ఉంటాయి.

ఉత్తరంలో హిమాలయాల నుంచి దక్షిణాన సముద్రం వరకు విస్తరించి ఉన్న ప్రదేశాన్ని వర్ణించే 'జంబూద్వీపం' అన్న పదప్రయోగం వీటన్నింటిలో కనిపిస్తుంది. పురుషోత్తముడు, అలెగ్జాండర్‌ల పోరాటాన్ని చరిత్రకెక్కించిన వారు భారతీయుల వద్ద తమ భూభాగం ఆకారం, పరిమాణామాల గురించి కచ్చితమైన సమాచారం ఉందని తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలు ఎరాటోస్థనీస్ (276 బీసీఈ

# సత్యనిష్ఠతో చరిత్ర




**8వ శతాబ్దంలో ఇస్లామిక్ దాడుల నుంచి పరిస్థితులు నాటకీయంగా మారాయి. ఆలయాల ధ్వంసం, బలవంతపు మత మార్పిడి, పూజారుల హత్యలు, విగ్రహాలను పగలగొట్టడం వంటి కారణాల వల్ల విదేశీయుల పట్ల ప్రతికూలత పెరిగింది. అరబ్, తుర్కీ దాడులు సంపన్నతను నాశనం చేయడంతో ప్రజలు సురక్షితమైన ప్రాంతాలకు పారిపోవలసి వచ్చింది.**

–194 బీసీఈ), స్ట్రాబో (64 బీసీఈ–21 బీసీఈ), అర్రియాన్ (86 బీసీఈ– 160 బీసీఈ) రచనలలో భద్రంగా ఉన్నాయి. రెండు వేల సంవత్సరాల తర్వాత, గ్రీకు చరిత్రకారులతో ఏకీభవిస్తూ 'వారు (ప్రాచీన భారతీయులు) తమ భూమి ఆకారం, విస్తీర్ణం గురించి కచ్చితమైన జ్ఞానాన్ని కలిగి ఉన్నారు' అని అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ పేర్కొన్నారు.

శాశ్వతమైన భారత నాగరికతను వాయు పురాణం, మార్కండేయ పురాణం, విష్ణు పురాణం, మత్స్యపురాణాలు విస్తృతంగా ప్రస్తావించాయి. భరతవర్ష అన్న పదంతో దొరికిన తొలి శాసనం బీసీఈ 2వ శతాబ్దానికి చెందిన హతిగుంఫ శాసనం. కనుక, భరతవర్ష అనేది కేవలం 'భౌగోళిక లేక భౌతిక ప్రస్తావన' అన్న తప్పుడు ప్రచారానికి బలం లేదు.

తన రచనలో భారతీయ నాగరికతకు సంబంధించిన మహత్తర లక్షణాన్ని కూడా అద్భుతంగా పొందుపరిచారు డా. జైన్. అదే సాంస్కృతిక ఆచారాలు, పద్ధతుల కొనసాగింపు– శివారాధన, శక్తి ఆరాధన, చెట్లు, యజ్ఞకుండాలు, యజ్ఞానికి మట్టి గరిటెల వాడకం, హిందూ గుడుల పక్కనే కోనేరుల నిర్మాణం, స్తంభారాధన లేదా కొన్ని యోగ విన్యాసాలైన స్కంభాండ్ వంటి వాటన్నింటినీ సంపుటీకరించారు. విశ్వ స్తంభమైన ఈ వైదిక స్కంభ, బలి ప్రదేశం లేక యుప అన్నవి చక్రస్తంభ, గరుడస్తంభగా రూపాంతరం చెందేలా విస్తరించాయి. అనంతర కాలాలలో బౌద్ధం, జైనంలో పూజనీయ స్తూపాలుగా విస్తరించాయి. క్రమంగా, భిన్న విశ్వాసాలకు చెందినవారు కలసి జీవించడం అన్నది భారతీయ నాగరికత విశిష్ట లక్షణమైంది.

వ్యవసాయ పద్ధతులలో నాట్లు వేసే దిక్కులు, వడ్లను దంచే పద్ధతి, ఇంటి పనులు, బండ్ల ఉపయోగం, హరప్ప కాలపు విశిష్ట లక్షణమైన వంపు తిరిగిన దూలంతో నాగలి వంటి వాటిల్లో ఈ కొనసాగింపు బలంగా కనిపిస్తుంది. అన్ని మత విశ్వాసాలను రాజులు పోషించడంతో వివిధ ఆరాధనలు వారి పవిత్ర నిర్మాణాలు దేశవ్యాప్తంగా విలసిల్లాయి. ఉదయగిరి, దేవగఢ్, బాదామి, ఎల్లోరా గుహలు, ఖజురాహో తదితర ప్రాంతాలు సాటిలేని సమకాలీనతకు సాక్ష్యంగా నిలుస్తాయి. స్థానికులపై విదేశీ విశ్వాసాలు రుద్దిన జాడలు లేవు. విదేశీ పాలకులే స్థానిక విశ్వాసాలను స్వీకరించి, భారతీయ సమాజంలో భాగమయ్యారు.

ప్రాచీన భారత శాసనకర్తలు వలసవచ్చిన విదేశీయుల భారతీయీకరణకు సౌలభ్యాన్ని కల్పించారు. భారతీయ సమాజంలోకి వలస వచ్చిన వారిని, వారి జాతులను చేర్చుకోవడం అన్నది గౌతమ అక్షపాదుని న్యాయసూత్రాల (6 బీసీఈ నుంచి 2 బీసీఈ మధ్య)లో, వాత్స్యాయనుడి న్యాయదర్శనంలో, గార్గి సంహితలో కనిపిస్తుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ ఏకీకరణం అన్నది 'శాస్త్రానికి సంబంధించిన వివిధ శాఖలలో విదేశీబృందాలు సాధించిన విజయాలకు గుర్తింపు'నకు లోబడి ఉంటుంది.

భారత్ సంప్రదాయకంగా జ్ఞానాభిలాషుల భూమిగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా నిర్దిష్టశాస్త్రం లేదా విజ్ఞానక్షేత్రాలలో నైపుణ్యం ఆధారంగా విదేశీ పాలకులను అంగీకరించడం అన్నది ప్రాచీన భారత సమాజపు పురోగమన వైఖరికి అద్దం పడుతుంది. దాని అరుదైన శాస్త్రీయ దృక్పథం అన్నది జ్ఞాన సముపార్జనకు అత్యధిక ప్రాధాన్య మిచ్చింది. ఈ ఒక్కటే, భారతీయ సమాజం సంప్రదాయమైందని, పిడివాదంతో కూడినదని, విదేశీయులపట్ల వైముఖ్యం అంటూ నెహ్రూ–మార్క్సువాదులు రూపొందించిన ఇతివృత్తాన్ని ధ్వంసం చేస్తుంది.

గ్రీకులు (యవనులు), ప్రాచీన ఇరానియన్లు, కుషాణులు, శకులు (స్కితియన్లు – పార్థియన్లు), హూణుల సహా విదేశీయులు హిందూ విశ్వాసాలను, వారి సాంస్కృతిక, ఆధ్యాత్మిక పద్ధతులను పూర్తిగా స్వీకరించారు. అయితే, 8వ శతాబ్దంలో ఇస్లామిక్ దాడుల నుంచి పరిస్థితులు నాటకీయంగా మారాయి. ఆలయాల ధ్వంసం, బలవంతపు మతమార్పిడి, పూజారుల హత్యలు, విగ్రహాలను పగలగొట్టడం వంటి కారణాల వల్ల విదేశీయుల పట్ల ప్రతికూలత పెరిగింది. అరబ్, తుర్కీ దాడులు సంపన్నతను నాశనం చేయడంతో ప్రజలు సురక్షితమైన ప్రాంతాలకు పారిపోవలసి వచ్చింది.

19 అధ్యాయాలతో కూడిన పుస్తకంలో, 'ది మేకింగ్ ఆఫ్ ఎర్లీ ఇండియా అండ్ అడ్వెంట్ ఆఫ్ ఇస్లాం' అన్న శీర్షికలతో రెండు ప్రధాన భాగాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయం కూడా స్వతంత్రంగా ఉండటంతో పుస్తకం చదవడం సులువు. అయితే, తొలినాళ్లలో వచ్చిన విదేశీయులు భారత సమాజంలో భాగం ఎందుకయ్యారు, తర్వాత వచ్చిన వారు ఎందుకు కాలేదు అన్న విషయంపై వెలుగు ప్రసరించే 18–19వ అధ్యాయాలు కచ్చితంగా ప్రత్యేకమైనవి. సంస్కారహీనమైన సమాజంగా అవమానకరమైన రీతిలో భారతదేశాన్ని చిత్రీకరిస్తూ, ముస్లిం ఆక్రమణదారులను కొనియాడుతూ అత్యంత జాగ్రత్తగా నిర్మించిన వాదనను ఇది తునాతునకలు చేస్తుంది.

ప్రాథమిక, ద్వితీయ మూలాల విశ్వసనీయ ఉల్లేఖనలను ఉదారంగా ఉపయోగిస్తూ, భారతీయ నాగరికతలోకి టైమ్ ట్రావెల్ చేయాలనుకునే ఉత్సాహవంతమైన ధార్మిక పాఠకుడికి ఒక ముఖ్యమైన ప్రాథమిక పుస్తకం. హరప్ప, వైదిక నాగరికతల మధ్య గల సంబంధాన్ని, కొనసాగింపును ముందుకు తీసుకురావడంతోనే ఈ పుస్తకం ప్రత్యేకతను సంతరించుకుంది. కీలక మైలురాళ్లను, హిందూ తిరుగుబాటుకు సంబంధించిన కథనాలు, ముస్లిం ఆక్రమణదారులను తిప్పికొట్టేందుకు హిందూ సమాఖ్య సాహసోపేత ప్రయత్నాల నుంచి తిరుక్కురల్ పై బలమైన ప్రభావాన్ని చూపిన ధర్మశాస్త్రాల వరకు ఈ పుస్తకం చరిత్ర ప్రేమికులకు ఒక విందు వంటిదే.

ప్రాచీన హిందూ నాగరికతకు తగిన స్థానాన్ని నిరాకరించిన పచ్చకామెర్ల దృక్పథాన్ని అద్భుతంగా ఈ విద్వత్ గ్రంథం తిప్పికొడుతుంది. ★

# తర్కం వితండవాదం కాకూడదు



కథ ఆనందం అందించినా మనల్ని ఆలోచింప జేయాలి. అందులోని వస్తువు సమకాలీన సమాజానికి ఉపయోగపడాలి. ఏ సాహిత్య ప్రక్రియకైనా విశ్వశ్రేయస్సే లక్ష్యం.

"సంసారం సాగరం దుఃఖం" అన్నారు ఆదిశంకరులు.

జీవితంలో సర్వం దుఃఖం– ఆ దుఃఖాంతమే నిర్వాణం అని బుద్ధుని ఉవాచ. ఇటువంటి దుఃఖ నివారణ–తదుపశమనం ప్రతిపాదించేందుకే మానవుని అన్వేషణ.

కర్మ–భగవత్కటాక్షం వీనితో గ్రహస్థితి–పూజాపురస్కారాలు ఇత్యాదుల మీది అచంచల విశ్వాసం మనిషిని క్రుంగిపోకుండా ముందుకు సాగనిస్తాయి.

అయితే దీపం గాలిలో పెట్టి దేవుడా! నీదేభారం అంటే కుదరదు గదా!

దేవుడు కూడా పురుషకారం ఏ మాత్రం ఉందో పరిశీలించటం జరుగుతుంది.

రోగం నయంకావాలంటే వైద్యుని సలహాలు మందుల సహాయం అత్యవసరం.

ఆ రోగాన్ని డాక్టర్ మందులు వేసి నయంచేస్తున్నాడా? లేక దేవుడు తన మంత్రాలతోనో గ్రహాల స్థితిగతులద్వారానో నయం కావిస్తున్నాడా?– అంటే..

అస్తి నాస్తి విచికిత్స ఒకవైపు రోగనిదానం చేసి మందులువాడి వైద్యుడు చేసిన చికిత్స మరోవైపు ఇదీ ద్వైధీభావన! ఈ మాటకన్నా ఇంగ్లీషు మాట మనకీనాడు బాగా అర్థమౌతుందనుకుంటాను.

"Dilemma" డైలమా

"అటా? ఇటా?"– ఈ డోలాందోళిత మనఃస్థితిని ద్వైధీభావమంటారు.

సోమయాజులుగారు తన మంత్ర సాయం కోరివచ్చిన ఆర్తులకి మంత్రం వ్రాసి యిచ్చి మననం చేసికొనమని గ్రహశాంతి చెప్తూనే– "మందులు మానకండి!" అని హెచ్చరిస్తారు!! అది ఆయన చిత్తశుద్ధి!

ఆక్సిడెంట్‌కి గురియైన సోమయాజులు గారబ్బాయికి చికిత్స చేస్తూనే డాక్టర్ గారు "మీరనే గ్రహస్థితిని మార్చలేను గాని మీ అబ్బాయికి నయం చేయగలను!"–అని ఒక విధంగా ప్రోత్సహిస్తారు!

ఈ కథలో రచయిత చూపిన నేర్పంతా sides తీసుకోలేదు. అదీ రచయిత బాధ్యత!

అక్కడ డాక్టర్ కాని సోమయాజులు గారు కాని తమ తర్కానికే confine అయిపోయే మూఢతని ప్రదర్శించక పోవటం ఇటువంటిదే!

రెండు విభిన్నధోరణుల నడుమ ఒక synthesis రచయిత చూపించారు.

ఏ జ్ఞానవిజ్ఞానాలైనా సమాజ శ్రేయస్సుకి ఉపయోగపడాలి. నిజాయితీగా ధర్మమార్గాన పయనించేవారు దేవదూతలే!

నిస్వార్థం పరోపకార ధర్మంతో వ్యవహరించారు. వారి తర్కం వితండ వాదం కాకూడదు– కుతర్కమూ కారాదు.

నియమబద్ధమైన తర్కం సశాస్త్రీయం! సహేతుకం! సమంజసం!!

ప్రపంచం అణుమయం.

ప్రపంచం నారాయణమయం.

ఈ రెండు statements సరైనవే!–

"అణువణువూ నారాయణమయమని" విశ్వసించినపుడు!! నారాయణ వాదంలేని అణువాదం అర్థరహితం!

ఈ ద్వైధీభావనని మరువరాదని రచయిత ఈకథ ద్వారా చక్కని సందేశాన్ని మనకందించారు.

సుమతీ శతకంలోని "అప్పిచ్చువాడు"– పద్యం ఈ కథ ఆరంభం! గొప్పగా ఉంది కదండి! వైద్యుడు – ద్విజుడు ఉన్న ఊళ్లోనే ఉండమన్నాడు.

డబ్బు– నీరు మనిషికి ఎంతో అవసరం. కాని రోగం నయం చేసే డాక్టర్ యోగం సరిచేసే మంత్ర ప్రతిభ గల ద్విజుడు అంతే అవసరం.

కథ మధ్యలో రచయిత వ్రాసిన ఒక వాక్యం:– "దేవుడన్నిచోట్ల తానుండలేక వైద్యుల్ని" ఏర్పాటు చేసాడట! శాస్త్రం దైవస్వరూపానికి దర్పణం! "దైవం మానుష రూపేణ!"!!

మోచర్ల అనంత పద్మనాభరావుగారూ! శుభాభినందనలు!!

**(జాగృతి ప్రత్యేక సంచికలో దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన మోచర్ల అనంతపద్మనాభరావు 'ద్వైధీభావన'పై.)**

**– పొన్నపల్లి శ్రీరామారావు**

## ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్‌లో రాజ్యాంగ దినోత్సవం



ప్రతియేటా 26 నవంబరు రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవటం, ప్రపంచంలోని అన్ని దేశాల రాజ్యాంగాల కంటే పెద్దదైన, ధృఢమైన గొప్ప రాజ్యాంగాన్ని మనకందించిన డా।। బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్‌ను ఆ రోజున స్మరించుకోవటం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. నవంబర్ 27న జరిగిన ఈ కార్యక్రమంలో మూల రాజ్యాంగ ప్రతిలోని చిత్రాలను, ముఖ్యమైన అధికరణాలను ప్రదర్శించడం పలువురిని ఆకట్టుకుంది. ముఖ్యంగా, శ్రీరాముడు యుద్ధంలో విజయుడై, శ్రీలంక నుండి అయోధ్యకు, సీతాలక్ష్మణ పరివార సమేతంగా పుష్పక విమానంలో తిరిగి వస్తున్న చిత్రం, గీతాబోధ మొదలైన చిత్రాలను పలువురు ఆసక్తికరంగా తిలకించడం గమనార్హం.

ఈ ప్రదర్శనను ఏర్పాటుచేసిన న్యాయవాద పరిషత్, ఆంధ్రప్రదేశ్ కార్యకర్తలు పున్నారావు తదితరులను హైకోర్టువారు అభినందించారు. సీనియర్ కౌన్సిల్, కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ పరవస్తు కృష్ణ కూడా పాల్గొన్నారు. ★

మిత్ర

# శాపమైన పూలమాల



బుధ్నీ

ఒక ప్రధానమంత్రికి పూలమాల వేసి గౌరవించడం తన జీవితాన్ని మసకబారుస్తుందని ఆ 15 ఏళ్ల బాలిక ఊహించి ఉండదు. బుధ్నీ మేజాన్ అనే బాలిక తనకు లభించిన అరుదైన అవకాశానికి మురిసిపోతూ, తన తండ్రి వయసున్న వ్యక్తి మెడలో పూలమాల వేయడమే ఆమెకు శాపమైంది. ఈ ఘటన జరిగి ఆరు దశాబ్దాలు దాటినప్పటికీ, ఆమె మరణించిన తర్వాత మాత్రమే ఈ కథ బయటకు వచ్చింది.

బుధ్నీ మేజాన్ అనే 85 ఏళ్ల వృద్ధురాలు నవంబర్ 17వ తేదీ రాత్రి కన్నుమూసింది. ఆమెకు అధికారులు ఎంతో ఘనంగా అంత్యక్రియలు జరిపారు. బుధ్నీ గౌరవార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వృద్ధాశ్రమం నిర్మించాలని గ్రామస్థులు కోరారు. ఇంతకీ ఎవరు ఈమె? అంత గౌరవం ఎందుకు దక్కింది? సాంప్రదాయం కారణంగా సమాజం ఆమెను నెహ్రూ భార్యగా ముద్ర వేసింది. ఈ కష్టాలు ఆమె జీవితాన్ని ఎన్నో మలుపులు తిప్పాయి.

ప్రధానమంత్రి జవాహర్‌లాల్ నెహ్రూను దగ్గర నుంచి చూడబోతున్నానని 15 ఏళ్ల ఆ బాలిక ఎంతో సంతోషపడింది. కానీ దానివల్ల తన జీవితం సమస్యల్లో చిక్కుకుంటుందని అసలు ఊహించలేదు. అటు ప్రధాని నెహ్రూ కూడా తాను చేయబోయే పని ఆ బాలిక జీవితాన్ని అంధకారంలోకి నెడుతుందని భావించి ఉండరు. వాస్తవానికి ఇద్దరూ తప్పేమీ చేయలేదు.

1959 డిసెంబరు 6న పశ్చిమ బెంగాల్‌లోని దామోదర్ నదీలోయలో బరాకర్ నదిపై పంచేట్ రిజర్వాయర్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి జవాహర్‌లాల్‌నెహ్రూ వచ్చారు. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఆయనకు స్వాగతం పలకడానికి రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో పాలుపంచుకున్న కొందరు కార్మికులను ఎంపిక చేసింది. అందులో బుధ్నీ మేజాన్ కూడా ఉన్నారు. ప్రారంభోత్సవ మీటను కార్మికులతో నొక్కించాలని నెహ్రూ భావించారు. వెంటనే బుధ్నీని ఆహ్వానించి ఆ పని చేయించారు. అధికారుల సూచన మేరకు ఆమె నెహ్రూకు పూలమాల వేసింది. ప్రతిగా ఆయన కూడా బుధ్నీ మెడలో పూలదండ వేశారు. ఎంతో ఆహ్లాదంగా కార్యక్రమం పూర్తయింది. బుధ్నీ కూడా ఎంతో సంతోష పడింది. అప్పట్లో ఈ ఫోటో దినపత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. అసలు కథ ఇక్కడే మొదలైంది.



నెహ్రూతో బుధ్నీ

దేశ ప్రధాని నెహ్రూ బుధ్నీ మెజాన్‌కు ఇచ్చిన 'గౌరవం' కాస్తా శాపంగా మారిపోయింది. ఆమె జీవితం చాలా సమస్యాత్మకమైన మలుపు తిరిగింది. ఈ కార్యక్రమం తర్వాత బుధ్నీ తన స్వగ్రామమైన కర్బోనాకు తిరిగి వచ్చినప్పుడు గ్రామపెద్దలు అడ్డుకున్నారు. బుధ్నీ సంతాల్ తెగకు చెందిన గిరిజనురాలు. వారి కట్టుబాట్లు, సాంప్రదాయం ప్రకారం పూలమాలలు మార్చుకోవడం అంటే వివాహం చేసుకోవడమే. నెహ్రూ సంతాల్ తెగకు చెందిన వారు కాదు కాబట్టి బుధ్నీ ఇప్పుడు వారి సంఘంలో భాగం కాదు. గ్రామం ఖాళీ చేయాలని ఆదేశించారు.

బుధ్నీ మేజాన్‌కు అలా కష్టాలు ప్రారంభ మయ్యాయి. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌లో కార్మికురాలిగా కొనసాగడం ఆర్థికంగా ఆసరాగా ఉండేది. ఇంతలో 1962లో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించేశారు. ఇక ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న బుధ్నీకి ఆమెతో సన్నిహితంగా ఉండే సుధీర్ దత్తా అండగా నిలిచారు. ఆమెను జార్ఖండ్‌లోని తన గ్రామానికి తీసుకెళ్లారు. అప్పటి సామాజిక పరిస్థితుల కారణంగా చట్టబద్ధంగా వివాహం చేసుకోలేదు. అయినప్పటికీ వారు కలిసి జీవించ సాగారు. ముగ్గురు పిల్లలుకూడా కలిగారు.

ఈ వ్యవహారమంతా ప్రధానమంత్రి నెహ్రూ దృష్టికి వెళ్లిందో లేదో తెలియదు కానీ, 1985లో ప్రధానిగా ఉన్న నెహ్రూ మనవడు రాజీవ్ గాంధీ దృష్టికి వచ్చింది. అసన్సోల్ ఎంపీ ఆనంద గోపాల్ ముఖోపాధ్యాయ బుధ్నీ మెజాన్‌కు జరిగిన అన్యాయం గురించి రాజీవ్‌కి వివరించారు. ఆమెకు తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. బుధ్నీ తనకు ఇంటితో పాటు కుమార్తెకు ఉద్యోగం ఇప్పించాలని రాజీవ్‌కు విజ్ఞప్తి చేశారు. దీనితో శేష జీవితమైనా ప్రశాంతంగా గడపొచ్చని భావించారు. వీటి ఫలితంగా బుధ్నీకి దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌లో ఉద్యోగం తిరిగి వచ్చింది. పదవీ విరమణ తర్వాత కూడా అక్కడే ఉండిపోయారు.

బుధ్నీ మేజాన్ తన 85వ ఏట 17 నవంబర్, 2023 అర్ధరాత్రి వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో మరణించారు. స్థానిక పంచాయతీ తో పాటు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఆమెకు గౌరవ పూర్వకంగా అంత్యక్రియలు చేపట్టింది. సీఐఎస్ఎఫ్ జవానులు బుధ్నీ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఘనంగా అంతిమయాత్ర సాగింది. పంచేట్ స్మశాన వాటికలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. తన స్వగ్రామానికి తిరిగి వెళ్లాలని బుధ్నీ ఎంతో కోరుకున్నారు. కానీ గ్రామంలో ఆమెకు సరైన గౌరవం దక్కక పోవడం నిరాశ కలిగించింది. బుధ్నీకి తన జీవితకాలంలో సరైన గుర్తింపు లభించలేదని ఆమెతో పాటు పని చేసిన వారు చెబుతున్నారు. పంచేట్ ప్రాజెక్టు ప్రారంభమైనప్పుడు అక్కడి కార్మికులకు ఉచితంగా ఇళ్లు, విద్యుత్ ఇస్తామని నెహ్రూ హామీ ఇచ్చినా.. ఇవేవీ జరగలేదని వారు వాపోయారు.

బుధ్నీ మేజాన్ పూర్వీకుల గ్రామం ప్రస్తుతం మంభుమ్ జిల్లాలోని ఖైర్బానాలో ఉంది. పంచేట్ డ్యామ్ నిర్మాణం తర్వాత కనుమరుగైపోయి, వేరే ప్రాంతానికి తరలి పోయింది. అయితే నాటి ప్రధాని నెహ్రూతో ఆమె జ్ఞాపకాలు ఫోటో రూపంలో దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌లో సురక్షితంగా ఉన్నాయి. ఇంతకీ పంచేట్ గ్రామస్థులు కోరుకున్నట్లు ఆమె విగ్రహం ఏర్పాటు అవుతుందా? వృద్ధాశ్రమానికి ఆమె పేరు పెడతారా? ఈ రూపంలో అయినా బుధ్నీ మేజాన్ జ్ఞాపకాలు భావి తరాలకు అందుతాయి. ★

# జ్ఞానతృష్ణ

*పరభాషల్ పఠియించి ప్రౌఢఫణితిన్ భాషింపగా వచ్చు, నా*
*పర వేషాదుల దాల్చి మానవులు విభ్రాంతాత్ములైయున్నచో*
*ధరలోనన్ బులిజూచి నక్కయున్ వాతల్వెట్టుకొన్నట్లులౌ*
*ఖరదైతేయ మహోగ్ర గర్వదమనీ! జ్ఞాన ప్రసూనాంబికా!*

*– ఇది జ్ఞాన ప్రసూనాంబికాదేవి శతకపద్యం. రచయిత్రి గంటి కృష్ణ వేణమ్మ*

*ఈ శతకం కావ్యం 85 సంవత్సరాలనాడు ప్రచురితమైంది. రచయిత్రికి అప్పుడు కేవలం 20 సంవత్సరాలు! ఎవరీమె? ఏమిటా కావ్యం అంటే... సందర్భం ఏమిటంటే...*

అలనాటి సుప్రసిద్ధ కవయిత్రి కృష్ణవేణమ్మ. ఇంటిపేరు కర్రా, భర్త వెంకట సుబ్బయ్య. గంటి అనేది ఇంటిపేరు ఆయనకి. అది 1920వ సంవత్సరం.

తెలుగునాట ప్రొద్దుటూరు కృష్ణవేణమ్మ స్వస్థలం. ఆమె మాతృమూర్తి సుబ్బలక్ష్మమ్మ. పేరొందిన సాహితీవేత్త. పద్య కావ్యాలు అనేకం రచించారు. వర్ణనాత్మకత రీత్యా, చదువరులెందరినో ఆకట్టుకున్నారు. తండ్రి రామశర్మ పోలీసు అధికారి. చేసింది ఆ ఉద్యోగమైనా, అభిరుచి మాత్రం సాహిత్యంపైనే!

కుటుంబ పరిస్థితులు కలిసిరాలేదు బాలకృష్ణవేణికి. అందుకే బడి చదువులకు దూరం కావాల్సి వచ్చింది. ఇంట్లోనే విద్య. తల్లిదండ్రులే గురువులు.

అమ్మానాన్నతో పాటు తాత కూడా విద్యాబోధన చేసేవారు. ఆయనా సారస్వతరంగాన కీర్తి సంపాదించినవారే. కృష్ణవేణి తెలుగు భాష, వ్యాకరణం, సాహితీ ప్రక్రియలు చక్కగా నేర్చుకుంది.

***తల్లీ, యాశ్రిత కల్పవల్లీ, నిజభక్తౌఘౌఘ విధ్వంసినీ***
***ఫుల్లాంభోరుహ పత్రనేత్ర, నిను నే బూజింతునే వేళ నా***
***యుల్లంబందు వసింయించి సల్లలితమౌ సుక్తుల్ సుశబ్దాళితో***
***సల్లాపింపగజేయు నీ స్తవమున్ శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా!***

ఈ పద్యం చూడగానే మనకు 'తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్' అనే పద్యం గుర్తుకొస్తుంది.

'కల్పవల్లీ – తల్లీ, యుల్లంబందు – యుల్లంబందున, వసియించి–నిల్చి, సల్లలితమౌ–ఉక్తుల్, సుశబ్దాళితో సుశబ్దంబు, స్తవమున్ – వాక్కునను'

అక్కడ 'పూర్ణేందు బింబాననా' అంటే 'జ్ఞాన ప్రసూనాంబికా...' అని ఇక్కడ!

అమ్మా! సరస్వతీ! పుస్తకం చేతిలోకి తీసుకునే ముందు నిన్ను మనసున స్మరిస్తున్నాను. ఆ తర్వాతే చదువు మొదలు పెడుతున్నాను. తల్లీ! నీ నేత్రాలు వికాస ప్రసార కలువల్లా ఉన్నాయి. నీ మోము నిండుచంద్రుని తలపిస్తోంది. చల్లని మాతా! నా మదిలో ఉంటూ, మాటల్లో వెల్లివిరుస్తూ, నాతో నీ స్తోత్రాన్ని పలికించవమ్మా... అని అదివరకటి (తల్లీ నిన్ను దలంచి) పద్యానికి భావం.



జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

కృష్ణవేణమ్మ విరచిత పద్యంలో భావయుక్తత ఎంతైనా ఉంది. పత్ర నేత్ర, సల్లాపింపగ.. వంటి పద విశేషాలెన్నో ఉన్నాయి. శబ్దచాతురి, అర్థచమత్కృతి మరెంతో. ఈ పద్యాలన్నీ 'గృహలక్ష్మి' మాస పత్రికలో ప్రచురితమయ్యాయి. 'గృహలక్ష్మి' ప్రత్యేకించి వనితల కోసమే ఉద్దేశించినది. ఆ పత్రిక తొలి సంచిక వెలుబడిన నాటికి కృష్ణవేణమ్మకు ఎనిమిదేళ్లు! అందులోనే కనుపర్తి వరలక్ష్మమ్మ, గుమ్మడిదల దుర్గాబాయమ్మ రచనలు చేస్తుండేవాడు.

(అదే పత్రికలో విశ్వనాథకవిరాజు, వావిలికొలను సుబ్బారావు, శివరాజు వెంకటసుబ్బారావు వంటి ఉద్దండులు రాస్తుండేవారు).

మహిళాలోక సముద్ధరణే లక్ష్యమైన ఆ పత్రిక సంపాదకులుగా గరిమెళ్ల సత్యనారాయణ కొంతకాలం ఉన్నారు. గీతాలతో జాతిని కదిలించిన







స్వాతంత్ర్య ఉద్యమకవి.

ఆ అందరి ప్రభావమూ కృష్ణవేణమ్మ మీద అపారంగా ఉండేది. తనకు 14 ఏళ్ల వయసులో ఆ పత్రికను చూసి స్ఫూర్తి పొందారు. ఆంధ్ర వనిత, లలిత శ్రీలక్ష్మి ఆలోచనా ప్రభావం, ధైర్యం, వేదకాలపు స్త్రీలు, రాజ్ఞీ రుద్రమదేవి, భారతాంబ శీర్షికలకు ముగ్ధులయ్యారు.

తన మాతృదేవి విరచిత 'చంద్రకళావిలాసం' ఎంతగానో ప్రభావితం చూపిందని ఎన్నోసార్లు చెప్పేవారామె. ఆ పుస్తకం అప్పట్లో విద్వాన్ పరీక్షకు పాఠ్యగ్రంథమని కూడా సగర్వంగా ప్రకటించారు. కృష్ణవేణమ్మ రాసిన పరీక్షలకు నిర్వహణాధికారి వావిలికొలను వారే! తాను రచించిన పుస్తకమే ఆనాడు మద్రాసు విశ్వవిద్యాలయంలో పాఠ్యగ్రంథం.అంతేకాక, 'సరస్వతీ రామాయణం' కర్త. సత్యనారాయణ వ్రతకల్పాన్నీ రచించారు.

తెలుగు, సంస్కృతం, హిందీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం సంపాదించిందామె. కాశీనాథుని నాగేశ్వరావు స్థాపించిన 'భారతి' మాసపత్రికకూ ఆమె రచనలు చేశారు. 'సరసకవయిత్రి' అని ఆమెకు బిరుదు. 'గృహలక్ష్మి' పత్రిక అధిపతుల నుంచి స్వర్ణకంకణం స్వీకరించిన ప్రతిభా సంపన్నురాలు. ఎన్నెన్నో పురస్కారాలు బహుకృతులు అందుకున్నారు.

'సైరంధ్రి' పద్యకావ్యంలో ద్రౌపది మనోగతాన్ని, భావోద్వేగాన్ని ఎంతో గొప్పగా వెల్లడించారో చూడండి.

***కురుపతి, భీష్ముదున్, గృపుడు, కుంభజముఖ్యులు గల్గు కొల్వులో***

# కృష్ణవేణి

***నరసి వచింపరైరకట! యాదుది వేడిన ధర్మ సంశయం***
***బెరుగరె? ధర్మశాస్త్రముల నేటికి గాల్పనె! పెద్దవారలం***
***దురుగద, యేటి పెద్దలిక నేటికి వారల గౌరవింపగన్?***

(అంతటి నిండు సభలో పెద్దలందరూ ఉన్నారు కదా! ఎవరూ మాట్లాడరేం? స్త్రీ పరిస్థితిని అవగతం చేసుకోలేరా? ఆ సభలోని వారంతా! ధర్మం తెలియదా ఎవరికీ? ఎందుకయ్యా ఇన్నిన్ని ధర్మశాస్త్రాలు? పెద్దలూ పెద్దలూ అంటున్నారే మీరంతా? నోరు మెదపని వారిని ఎవరైనా ఎందుకు గౌరవించాలో చెప్పండన్నది ద్రౌపది ఘాటు ప్రశ్న)

ఇటువంటి సంభాషణల, సూటిచర్చల మిళిత రచనలెన్నింటినో చేశారు. ప్రశ్నించి జవాబులు రాబట్టే సంస్కృతిని పిల్లలకీ అలవాటు చేశారు. మొదటి నుంచీ!

తన శతకాలను ఇంటా బయటా బాలలతో చదివింపచేశారు. 'రాజరాజేశ్వరీ, కామాక్షీ' అంటూ మరో రెండు శతక రచనలు వెలయించారు. పురాణాలు, ఇతిహాసాలు, ప్రాచీన కావ్యాలమీద గట్టిపట్టు ఉన్న ఆమె 'గిరిజా కళ్యాణం' రచన చేపట్టారు. 'పవనద్యూతం' పేరిట కథాంశాలెన్నింటినో మరింత వెలుగులోకి తెచ్చారు. ఆమె జీవితకాలం 86 వసంతాలు. తెలుగుదనానికి తన కలంతో నూతన కళాకాంతులు తెచ్చారు.

❊ ***పాలన్ముంచిన నీట ముంచినను నీ పాదంబుల్లే నమ్మితిన్***
❊ ***పాముంబాలను పోసి పెంచికొన సంభావించునే ముద్దిడన్***
❊ ***వేమం దేనియవోసి పెంచినను... తీపి రానేర్చునే!....***

ఇలా అనేకానేక ఉపమానాలను తన రచనలన్నింటిలోనూ మేళవించారు.

***'నిను బూజించుట హస్తభూషణములౌ నిత్యంబు నిను బారుటే***
***ఘన రత్నాంచిత తారహారములు నీ గాథా సమాకర్ణనం***
***బన, తాటంక మణిద్వయమ్ము భవదీయానంద దివ్యాలయాం***
***గణమున్మెట్టుటే పాదభూషలు గదా...'*** అంటూ ఆధ్యాత్మికతను హృదయపూర్వకంగా రంగరించారు.

భాషాభివృద్ధి, నైతిక విలువల పరిరక్షణ, ధార్మికత విస్తృతి ఆశయాలుగా ఆమె సాగించిన పరిశ్రమ అంతులేనిది.

ఎన్ని సామెతలు, లోకోక్తులు, జాతీయాలు ప్రయోగించారో లెక్కకు అందవు. సరసి, జంబు, పద్మ వ్రజోతర మొదలైన గంభీర పదప్రయోగాలనీ సాగించారు. లౌకిక స్థితిగతులను తనదైన తీరున విశ్లేషించారు. యువతుల బాధ్యతలను, తక్షణ కర్తవ్యాలను విపులీకరించారు.

గంటి కృష్ణవేణమ్మ స్వదేశీవాసుల అంతరంగానికి అద్దం పట్టారు. పాలకులు ఏనాడూ కర్తవ్య విముఖులు కారాదని ఉద్బోధించారు. అవివేక నిర్ణయాలతో ప్రజలకు హాని కలిగించకూడదని హెచ్చరించారు. ఏ దశలోనూ రాజీపడని, తలొగ్గని మూర్తిమత్వం ఆమెది.

ఆమె కావ్యాల్లో ఒకటి సరస్వతీ దేవి ముందుమాటతో ఆవిష్కృతమైంది. ఆ సాహితీవేత్త 'కవి కలహంసి'గా ప్రతీతి. తన సంతానం లలిత, దత్తాత్రేయులకు సారస్వత సుగంధాలు వ్యాపింపజేశారు.

శ్లోకాల, పద్యాల రచనల్లో ఆరితేరిన ఆ సాహితీమూర్తి పరిపూర్ణ ఆత్మాభిమాని. రాజుల, జమీందారుల మెప్పుకోసం రాయలేదు. సాధారణ పౌరులు అందునా పడతుల పురోగతిని ఆశించి రచనా వ్యాసంగం నిర్వర్తించారు. ధన, అధికార ఉన్మత్తులైన వాళ్లకు కవిత్వాభిరుచి ఏ విధంగాను కలగదని తేల్చి చెప్పారు.

***పరకాంతారతులౌచు, నీచుల నుడుల్ పాటింపుచున్మత్తులౌ***
***ధరణీనాథులెరుంగ నేర్తురె కవిత్వాసారశైత్యంబు, సూ***
***కరముల్మెచ్చునె పుష్పసౌరభము పంకంబున్మదిన్మెచ్చెడిన్***
***ఖరముల్ మెచ్చునె గంధధూళి...***

అని ధాటిచురకలంటించారు. అన్ని కాలాలకూ వర్తించే అంశమది. నీతి నియమ రహితులైన పెత్తందార్లకు సాహిత్య పొడ కూడా తగలదు; గిట్టదం లేదు. ఆ విలువలు తెలిసి ఉన్నవారే కవితా ప్రక్రియలను మనసారా ప్రోత్సహిస్తారని ఆ రోజుల్లోనే తేల్చి చెప్పారు ఆమె. అక్షరాన్ని నమ్ముకుని అపార ధీరత కనబరచిన ఆ కవన విదుషీమణి చదువరులందరికీ ప్రాతఃస్మరణీయ! ★

## గిరిజా కళ్యాణమే వైభోగమే




***క్రమ కవితా పదరత్న కంకణంబు***
***కరమునందాల్చి లోకోపకార కృతుల***
***శారదాపీఠమర్చించు సరసమతివి***
***కృష్ణవేణమ్మ! నీ సాటి యెవ్వరమ్మ!***

ఈ మహాభినందన శతావధాని గడియారం వేంకట శేషశాస్త్రిది. నాడు తెలుగునాట సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులు ఆయన. 'మీ రచనాధార శుద్ధి శోభితం, సరళ సుందరం' అని ప్రశంసించారు ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అప్పటి అధ్యక్షులు దివాకర్ల వేంకటావధాని. అదొక అదొక రసప్రచుర బంధమైన మనోహర ప్రబంధమన్నారు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ.

***సకల గుణాభిరాము సురసన్నుత సుందర పా***
***దకమల నాగకంకణు సుధాకరమౌళి మహా***
***ధికు కరుణా సముద్రుని నదీవిటు హైమవతీ!***
***నికలుష చిత్తహారు సువివేకమునన్ దలతున్...***

***అంటూ స్వామిని అర్చించారు కవయిత్రీమణి.***

***పార్వతీ పరమేశ్వరుల వివాహ ఘట్టాన్ని అభివర్ణిస్తూ..***

***హరుజూడ మది దలంచును***
***హరుడును దను జూచుచుండ నరసి మనమునన్***
***దొరకొను సిగ్గున జూడక***
***సరసీరుహ నేత్రయపుడు జాణతనమునన్***

అని సుమనోహరత్వాన్ని ఆవిష్కరించారు కవనతిలక కృష్ణవేణమ్మ. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశులు ఆ వివాహ భోజన సమయాన సాగించిన సరస సంభాషణా చతురతను, ఛలోక్తుల రూపాన సమర్పించారామె. ఆ రచనా వైభవం, ప్రాభవం చదువుతున్నంత సేపూ చవులూరించేవే! పద్యకవితా శిల్ప ఘనత అంటే ఆ కవయిత్రిదే! ★

కథ

# అడవి

గోపాలకృష్ణ

“కన్నులనే కిటికీల నుంచే విశ్వసౌందర్యాన్ని ఆత్మ ఆస్వాదిస్తుంది.

ఓ చిన్న ప్రకృతి దృశ్యం విశ్వ సంకేతాలను తనలో ఇముడ్చుకుంటుందని ఎవరు ఊహించ గలరు?

**– ఇటాలియన్ శిల్పి, చిత్రకారుడు**
**లియోనార్డో డావిన్సి,**

* * *

'నేను చెబుతూనే ఉన్నాను. కారులో కాకుండా... హాయిగా అందరితో కలిసి... రైలులో వెళితే చక్కగా ఉంటుందని... నువ్వే.. ప్రకృతి, అడవి, జలపాతాలు, గాడిద గుడ్డు, నా శ్రాద్ధమంటూ కారులో బయలు దేరించావు. చూడు ఇప్పుడేమయ్యిందో...!' –నా భార్యపైన విపరీతమైన కోపం వచ్చింది నాకు.

'మీకు ఈ మధ్య కాలంలో అసహనం పెరిగిపోయింది. అయినదానికీ, కాని దానికీ నా మీద విరుచుకు పడుతున్నారు. నా మీద కోపగించు కుంటే సమస్యకు పరిష్కారం దొరకదు కదా? మీ సబార్డినేట్స్‌ను కసిరినట్లు నన్ను ట్రీట్ చేస్తున్నారు మీరు...' – నా భార్య నా మీద కయ్యమంది...

శ్రీకాకుళం జిల్లాలో, ఓ రెవెన్యూ డివిజన్‌కు నేనో గ్రూప్ వన్ అధికారిని. అధికారం ఇచ్చిన దర్పం నాకొంచెం ఎక్కువని నన్నందరూ ఆడిపోసు కుంటారు. కానీ, కొండ మీది కోతినైనా సరే సాధించే వరకూ నాకు నిద్రపట్టదు.

'మీరు క్రమంగా సున్నితత్వం కోల్పోతున్నారు...' ఇది నా భార్య నాకు చేసే కంప్లయింట్...

నిజమే...! నా భార్య ప్రకృతి ప్రేమికురాలు. నేను, నా పిల్లలు ఒకరకం ఆవిడ ఒక రకం. ఒకే ఇంట్లో రెండు వర్గాలు.

వారం రోజులు క్రిందట నేను ఓ అరెకరం నేల కొన్నాను. వంశధార నది ఒడ్డున. దాంట్లో మామిడి, వేప, కొబ్బరి చెట్లున్నాయి. వాటిని కొట్టించి ఓ మంచి ఇల్లు కట్టుకోవాలని నా ప్లాన్..

'వద్దండి.. మనకంటూ ఇంద్రభవనం అవసరం లేదు. చక్కని నదీతీరం.. చెట్లు.. గాలి.. ప్రకృతి మధ్య వెన్నెల్లో, వర్షంలో ఆనందాన్ని ఆస్వాదిద్దాం. అవసర మైన చోటు వరకు చెట్లను కొట్టండి. మిగిలినవి అలా ఉంచేయ్యండి.. ప్లీజ్..' – అది ఆమె వరుస..

ప్రేమ..! ఈ శషభిషలు మధ్య ఇంటి నిర్మాణం ఆగిపోయింది..

అయినా.. ఏమిటో దీనికా ప్రకృతి ప్రస్తుతానికి వస్తే..

నా బాల్యమిత్రుని తమ్మునికి పెళ్లి జగదల్ పూర్‌లో. రెండు గ్రూపులుగా ఒకరు బస్సులో, ఒకరు కె.కె.లైన్ పాసింజర్ రైలులో వెళ్లిపోయారు.

మా ఆవిడ, 'మనమిద్దరం లాంగ్ డ్రైవ్ చేసుకొంటూ సరదాగా కారులో వెళదామండి. పిల్లలకు పరీక్షల సమయం. అమ్మ ఎలాగూ వారి వద్ద ఉంటుంది. సరదాగా ఆ అడవి మార్గాన సన్నని రోడ్డుపైన, ఒకవైపు లోయలు.. మరోవైపు ఎత్తైన కొండలు... పచ్చని ప్రకృతి మధ్య... మీరు, నేను...





# తల్లి బిడ్డ

ఎస్.లలిత





**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

ఎన్ని సంవత్సరాలైందో... ప్లీజ్..' అంది..

ఎందుకో ఆమె మాటను కాదనలేకపోయాను...

ఆవిడకూ డ్రైవింగ్ వచ్చు..

విశాఖపట్నం నుంచి జగదల్‌పూర్ దాదాపు మూడు వందల కిలోమీటర్ల దూరం. రైలు, బస్సు సౌకర్యం ఉంది. సాలూరు, సుంకీ, జైపూర్ (ఒడిషా) మీదుగా వెళ్లవచ్చు. జైపూర్ వరకు రోడ్డు బాగుంటుంది. అక్కడి నుంచి గంటకు పదిహేను మైళ్ల వేగంతో కూడా ప్రయాణం చేయలేని పరిస్థితి. సన్నని బాటలు. పక్కా రోడ్లు లేవు..

చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ మధ్యలో ఉంది జగదల్‌పూర్. అటవీ ప్రాంతం.. మైదానప్రాంతం.. లోయలు.. కొండలు.. దట్టమైన అటవీ ప్రదేశాల మధ్య ప్రయాణం కొనసాగించవలసి వస్తుంది. మధ్యమధ్య పది పదిహేను ఇళ్లతో చిన్నచిన్న గూడేల లాంటి ప్రాంతాలుంటాయి.. మావోయిస్టులు నిరంతరం సంచరించే ప్రాంతం..

ఈమధ్యనే కుసుమ ప్రాంతంలో మాజీ ముఖ్యమంత్రి.. నల్వాజుడుం అధ్యక్షుడు మాధవ వర్మను పక్కా ప్రణాళికతో చంపారు మావోయిస్టులు..

చత్తీస్‌ఘడ్‌లో ఓ ఐదు ప్రాంతాలు షెల్టర్ జోన్స్ ఉన్నాయి. వాటిలో జగదల్ పూర్ ఒకటి. జగదల్‌పూర్–జైపూర్ మధ్య అటవీ ప్రాంతంలో ప్రయాణమంటే కొంచెం భయపడవలసినదే.. కాని సామాన్యులకు ఇవి అనవసరం కదా...

అవసరమైన తినుబండారాలు, టాంక్ నిండా పెట్రోలు పోయించుకొని... అవసరమైన మందులు, నీళ్ల బాటిల్స్ వంటి వాటితో ప్రయాణం మొదలు పెట్టాము. అరకు, బొర్రా, శివలింగాపురం చూసుకొని జైపూర్ మీదుగా వెళ్లాలనేది ప్లాన్..

ప్రయాణం సాఫీగానే జరిగింది. అవసరమయిన చోట ఆగుతూ.. బొర్రాగుహలను, అరకు అందాలను

ఆస్వాదించి హాయిగా ప్రయాణం చేస్తున్నాం. మధ్య మధ్య మాఆవిడ డ్రైవింగ్ చేసింది. సరదాగా ముందుకు సాగుతున్నాం. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన మా ప్రయాణంలో ఎన్నెన్నో సరదాలు.. సరసాలు.. సంతోషాలు.. కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా ఈ రీతిగా లాంగ్ డ్రైవ్ ప్లాన్ చేయాలని డిసైడయిపోయాను.

నాకు కూడా ఎందుకో ప్రకృతి అందాలపైన మమకారం పెరిగింది.

'అవునుగాని.. నీకెందుకోయి.. ప్రకృతిపైన మమకారం..' అడిగాను మా ఆవిడను.

కారు నడుతున్న ఆవిడ చెప్పడం ప్రారంభించింది.

'పరోక్షంగా తానుండి, ప్రత్యక్షంగా ప్రకృతి రూపంలో మనతో మాట్లాడే ప్రయత్నం చేస్తాడు పరమాత్మ. సూర్యాస్తమయంలోని అందాలను, చంద్రోదయం లోని సౌందర్యాన్ని, చుక్కలు పొదిగిన ఆకాశాన్ని.. తొలకరి కురిసిన వేళప్పుడు పరిమళాన్ని ఆస్వాదించిన వేళ.. అప్రయత్నంగా సృష్టికర్తపట్ల ఆరాధనా భావం కలిగి చేతులెత్తి నమస్కరించాలని పిస్తుంది. కానీ.. ఆధునిక మానవుడి పెను శాపమేమిటంటే ప్రకృతితో సాహచర్యం చేసే సమయం లేకపోవటం.. వేకువనూ, వెన్నెలనూ.. పూలనూ.. వాటి పరిమళాలనూ.. ఎగిరే పక్షులను.. కడలిని.. కెరటాలను.. వాటి మధ్యగల లయబద్ధమైన అనుబంధాన్ని గమనించి తన్మయం చెందే గుండె తడి ఇంకిపోతున్నది. ఒక్కసారి చుట్టూ గమనించండి. ప్రకృతిలోని నిశ్శబ్దం.. లాలిత్యం.. సందేశం..'

ఆగింది.. ఆమె ముఖంలో తన్మయత్వం.. సందేశం, మెరుపులు. నిజమే! ఆమె మాటలు వింటూంటే.. ప్రకృతి ప్రేమికులు అదృష్టవంతులని పిస్తుంది..

'సరే.. భోజనం సంగతి చూడండి.. మేడమ్ గారూ..!'

'ఎస్సార్..' అని నవ్వి.. కారును పక్కకు తీసి ఆపింది.. ముందుగానే సిద్ధం చేసుకొన్న పులిహోర, బొబ్బట్లు.. దద్దోజనం తిని కడుపునిండా నీళ్లు తాగి.. చిన్నపాటి ఖాణా పైన కూర్చున్నాం దగ్గరగా..

ఆ దారంట వెళుతున్న.. ఓ యువజంట.. మమ్మల్ని చూసి నవ్వింది... మేము చేతులూపాం..

తరువాత.. మా మధ్య కొంతసేపు నిశ్శబ్దం...

పావుగంట గడిపి బయలుదేరాం..

దూరంగా కొండల మధ్య దట్టమైన మబ్బులు. సమయం పన్నెండు కావస్తున్నది. వేగంగా గంటకు అరవై, డెబ్భైల మధ్య ప్రయాణం కొనసాగిస్తే, సాయంత్రం ఐదు, ఆరు మధ్య జగదల్‌పూర్ చేరుకోవచ్చు..

దట్టమైన మబ్బులు.. నల్లని భూతాల్లా..



## రచయిత్రి పరిచయం

**ఏకలవ్య పాఠశాల గుమ్మలక్ష్మీపురంలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నాను. నా మొదటి కథ తానా కథల పోటీలో ఎంపికైంది. ఇప్పుడు నాకథకు బహుమతిని ప్రకటించి ప్రోత్సహించిన జాగృతి వార పత్రిక సంపాదక వర్గానికి, న్యాయ నిర్ణేతలకు ధన్యవాదాలు.**

**- లలిత షావుకారు**
**ఏకలవ్య ఉపాధ్యాయిని**

వస్తున్నాయి..

కారును వేగంగా నడుపుతున్నది నా భార్య.. ముదితల్ నేర్వంగరాని విద్య గలదే.. అనిపించింది..

'ఆ మబ్బులను చూసారా.. ఎంతందంగా ఉన్నాయో.. ప్రకృతి అందాలను ఆస్వాదించవలసిన మనిషి, గాలిని.. నీటిని.. కాలుష్యంతో కబళించి వేస్తున్నాడు.. వన్య ప్రాణులను తన స్వార్థానికి పణంగా పెడుతూ.. ప్రకృతి సమతౌల్యాన్ని మంటగలుపుతూ.. ప్రకృతి వైపరీత్యాల రూపంలో పరమాత్మ ప్రదర్శించే ప్రకోపానికి గురవుతున్నాడు..

మహాకవి కృష్ణశాస్త్రి 'ఇక హిమవంతము వలదు.. ఇక నిశీధము వలదు.. నీ సన్నిధియే దేవదేవా!.. ఒక వసంతము పైన నొక ప్రభాతములోన.. ప్రకటింప దేవదేవా' అన్నారు.

అన్ని ప్రయాణాలు సుఖంగా జరిగిపోతే.. చెప్పుకోనేందుకు, నేర్చుకొనేందుకు ఏముంటుంది కనుకా...!?

జైపూర్.. చక్కని సిటీ.. తెలుగువారు దాదాపు ఎనభైశాతం ఉన్నారు.. కాని ఎవరూ తెలుగు మాట్లాడరు.. అంతా రైల్వేలో పనిచేస్తున్న వారే..

ఇక్కడి నుంచి.. ముందుకు వేగంగా వెళ్లే అవకాశం లేదు.. సమయం కోసం వాచీ చూసుకొన్నాను.. రెండు గంటలు కావస్తున్నాది.. మబ్బులు దట్టంగా ఉన్నాయి.. ఇప్పుడో.. అప్పుడో వర్షం వచ్చేలా ఉంది.. జగదల్‌పూర్ వరకూ రోడ్లు దరిద్రంగా ఉంటాయి.. వర్షం కూడా వస్తే చెప్పనవసరం లేదు.. దారిలో పలకరించే నాథుడు కూడా ఉండదు.

కారును.. నేను నడపడానికి నిశ్చయించుకొని.. డ్రైవర్ సీట్లో కూర్చున్నాను.. వేగంగా పోనిస్తున్నాను..

కుసుమ చేరుకున్నాం.. అటవీ ప్రాంతం.. జనాభా రెండు వేలకు మించదేమో... గిరిజనులే.. కోయిలే.. కొండ జాతి..

గాలి చల్లగా వీస్తున్నాది.. కుసుమ పరిధి దాటి.. మరింత అటవీ ప్రాంతానికి చేరుకున్నాము.. రోడ్డు అధ్వాన్నంగా ఉంది.. మెల్లగా వర్షం ప్రారంభమయ్యింది.. ఎర్రని నీరు.. రోడ్డుపైన.. ప్రక్కన చేరుతున్నది..

వైపర్స్ శబ్దం తప్ప.. మా మధ్య మాటలు లేవు..

మంచి.. నట్టడవి ప్రాంతం.. కీచురాళ్ల రొద.. దూరంగా పేరు తెలియని పిట్ట వికృతంగా అరుస్తున్నది.. నా భార్య.. నా భుజంపైన తలవాల్చి కళ్లు మూసుకొంది.. భయపడుతున్నట్లుగా ఉంది..

ఇంతలో.. హఠాత్తుగా చిన్నపాటి కుదుపుతో కారు ఆగిపోయింది..

నాకేం చేయాలో తెలియలేదు. పెట్రోలు సమస్య కాదు. ఏదో సాంకేతిక సమస్య. ఏం చేయాలి? వర్షం సన్నగా పడుతున్నది. రైన్ కోటు తీసి వేసుకొని కారు దిగాను. డిక్కీలో నుంచి సామాను తీసి, కారు ముందుకు వచ్చి.. ఓపెన్ చేసి చూడసాగాను.. నా అర్ధ జ్ఞానం.. అర్థం కాలేదు..

కాలం గడుస్తున్నది. ఐదు, ఆరు దాటుతున్నాది.. నాలో అసహనం బయలుదేరింది. అది కాస్తా కోపంగా మారింది. చీకటి రాత్రులు.. వర్షం.. ఒంటరిగా ఏం చేయాలి? ఎలా ఉండాలి? భగవంతుడా ఏమిటీ పరీక్ష? ఉద్యోగం వచ్చిన తరువాత తొలిసారిగా దేవుణ్ని ప్రార్థించాను. నా భార్య మీద విరుచుకుపడ్డాను..

క్రమంగా చీకట్లు ముసురుకుంటున్నాయి. రాత్రవుతున్న కొద్దీ అడవి చైతన్యమవుతోంది. మావోయిస్టులు తిరుగాడు ప్రాంతం. వన్యప్రాణులు నీటికి.. ఆహారం కోసం స్వేచ్ఛగా సంచరించే ప్రాంతం. బస్తరు ప్రాంతం ఇక్కడకు దగ్గరే. మంత్రగాళ్లకు ఆ ప్రాంతం ప్రసిద్ధి అంటారు.

నా భార్య ఏడుస్తున్నాది. నేను కోపాన్ని కంట్రోల్ చేసుకున్నాను. ఆమె దగ్గరకు వెళ్లా..

'ఊరుకో.. బాధపడకు.. ఆలోచిస్తాను... తినడానికి సామాన్లున్నాయి.. భయంలేదు.. నేను.. ఫోన్ చేస్తాను.. జగదల్‌పూర్ వచ్చేసినట్లే.. డోన్ట్ వర్రీ..' అని ఓదార్చాను.. కాని.. నాకు.. ఆమెకు కూడా తెలుసు.. పరిస్థితి ఎంత జటిలమో!

సమయం ఏడు వస్తున్నాది.. ఆకలి లేదు.. వర్షం ఆగింది.. చల్లని గాలి వీస్తున్నాది.. సెల్ అందుకొని.. నా మిత్రునికి ఫోన్ చేసాను. సిగ్నల్స్ లేవు..

ఇంతలో.. ఏదో.. అలికిడయింది.. మనుషులు వస్తున్నట్టుగా ఉన్నారు.. దూరంగా లాంతరు వెలుగు.. దాదాపు పదిమంది దాకా ఉండవచ్చు.

దీపాలు.. మా సమీపానికి వస్తున్నాయి.

వచ్చేశాయి.. వారంతా మా కారు దగ్గరకు వచ్చారు. వారి శరీరం నుంచి పసరు వాసన. వారి నోటి నుంచి కుళ్ళు వాసన. కోయిలాలు.. కొండజాతి వారు.. చిత్రమైన వేషధారణలో ఉన్నారు..

మమ్మల్ని వారి వెంట తీసుకుపోయారు.

ఎందుకు...? ఏమో...?

వారు ఏర్పాటు చేసిన గుడిసెలో పడుకున్నాం. నిద్రరాలేదు. దోమలు భయంకరంగా శబ్దం చేస్తున్నాయి. అందరూ అలాగే నిద్రపోయారు. హాయిగా.. ఎలా సాధ్యమది...

నాకు, నా భార్యకు విసరటానికి ఇద్దరిని ఏర్పాటు చేసారు. బయట వర్షం ఎక్కువయ్యింది..

ఆ ఇద్దరూ అలా తెల్లవార్లు విసురుతూనే ఉన్నారు..

తెల్లవారింది. వారిద్దరినీ చూసి నా కళ్ళంట నీరు. నాలో ఏదో పశ్చాత్తాపం. నా భార్య పసిపాపలా వారితో కలిసిపోయింది. దగ్గరున్న ఏటి వద్దకు వెళ్లాం.చల్లని నీటిలో స్నానం చేశాం. నా మిత్రుని ఫోన్ పనిచేస్తున్నాది. సిగ్నల్ అందుతున్నాయి.. పరిస్థితి చెప్పాను. గంటలో మెకానిక్‌ను పంపు తున్నానన్నాడు..

అంతలో దూరంగా.. ఓ పిచ్చుక గూడు కనిపించింది. నాకెందుకో.. నా రెండో పాప.. ఒకసారి, 'నాన్నా.. నాకో పిచ్చుక గూడు కావాలి కొనిపెట్టవా?' అని అడిగింది.

అది గుర్తుకు వచ్చి.. నా ప్రక్కనున్న గిరిజనుడికి అది చూపించి, హిందీలో అది కావాలని అడిగాను, ఎంతైనా ఇస్తానన్నాను...

అతను నవ్వుతూ నిలబడ్డాడు కాని ఆ గూడు తీసి ఇవ్వటానికి అంగీకరించ లేదు.. నా అహం దెబ్బతింది.. నాలోని మరో మనిషి బయటకు వచ్చాడు.. అధికారినన్న అహంకారం బుసలు కొట్టింది. వంద దగ్గర ప్రారంభమయిన నా పాట ఐదువేలు వరకూ వెళ్లింది.

అయినా అతను చలించలేదు.

చివరకు 'ఏం కావాలి.. ఎంతకావాలి..?' అన్నాను గర్వంగా..

'మీరేమిచ్చినా.. దానిని తీసి ఇవ్వను.. ఇవ్వలేను.. అన్నాడు వినయంగా..

అతని కళ్లలో ఇది అని చెప్పలేని దయ.. జాలి.. ప్రేమ.. నాకు కనిపించాయి.. గౌతముడు హంస కోసం చెప్పిన మాటల్లా ఉన్నాయి.

ఆశ్చర్యంగా... ఎందుకని అడిగాను..

అతను చెప్పిన సమాధానం నన్ను విస్మయపరిచింది..

'సార్.. తన పిల్లల కోసం ఆ తల్లి పక్షి ఎంత కష్టపడి ఆ గూడు కట్టుకుందో నేను చూసాను. అలా గతంలో కట్టుకున్న గూటిని ఎవరో తెంపుకుపోతే.. తన గూడు ఏమైపోయిందో తెలియక తల్లిపక్షి చెట్లన్నీ వెతికి, వెతికి అరచిన బాధ నాకు తెలుసు! మరో గూడు కట్టుకొనే వరకు ఆ పక్షి తన పిల్లలను ఎండ నుంచి .. వాన నుంచి కాపాడుకోలేక రెక్కల మాటున దాచుకుంటూ పడ్డ కష్టాలు నాకు తెలుసు' అన్నాడు..

**అటువంటి పచ్చటి పరిసరాలకు ఎంత దగ్గరగా ఉంటే.. మన జీవితం అంత రసవంతమవుతుంది. మనిషి ఎదుర్కొంటున్న ఎన్నోరకాల శారీరక, మానసిక సమస్యలకు పరిష్కారం హరిత సాహచర్యం లోనే లభిస్తుందన్నది వైద్యుల మాట. ఆహారమిచ్చి, విశ్రాంతినిచ్చి, ఆ ఆరడుగుల నేలనిచ్చి, కాల్చేందుకు కట్టెలనిచ్చిన ప్రకృతికి మనిషి ఏం చేస్తున్నాడు..!? కనీసం కృతజ్ఞతలైనా చూపనవసరం లేదా..? భద్ర పరచుకోవలసిన బాధ్యత లేదా..?**



సన్నగా నవ్వుతూ.. ఆ నవ్వు చల్లగా ఉంది.. హాయిగా ఉంది.. సిద్ధార్థుని నవ్వులా ఉంది.. పసిపాప నవ్వులా ఉంది..

నా కనులు చెమర్చాయి..చదువు.. అధికారం.. గర్వం ఉన్న నాలో ఆ మామూలు కుర్రాడిలో ఉన్నపాటి మానవీయత కూడా లేదు.. ప్రకృతి నియమాలను.. మూగజీవాల మనోవేదనను.. అర్థం చేసుకోలేని అజ్ఞానం నాది..

ఇంతలో నా భార్య వచ్చింది..

నా మిత్రుడు పంపిన మెకానిక్ వచ్చాడు..

కారు బాగయింది.. మేము బయలుదేరాం...

వారంతా.. ఒకరి చేయి ఒకరు పట్టుకొని.. వరుసగా నిలబడి మాకు వీడ్కోలు చెప్పారు.

వారికి సౌకర్యాలు లేవు.. కాని వారు సుఖంగా, ప్రశాంతంగా ఉన్నారు.

వైద్య సదుపాయాలు లేవు.. కాని.. ఆరోగ్యంగా, ధృఢంగా ఉన్నారు.

చదువు సంధ్యలు లేవు.. కాని.. సంస్కారముంది. సాటివారి కష్టాలకు స్పందించి.. సహాయమందించే మానవీయతా కోణముంది..

వారు ప్రకృతి పుత్రులు.. వారికి ప్రకృతి చదువు చెబుతుంది.. వైద్యమం దిస్తుంది.. ఐక్యతగా ఉండ మని చెబుతుంది.. వారు అలా నడుచుకుంటారు..

నేనో పాఠం నేర్చుకొన్నాను.

అటువంటి పచ్చటి పరిసరాలకు ఎంత దగ్గరగా ఉంటే.. మన జీవితం అంత రసవంతమవుతుంది. మనిషి ఎదుర్కొంటున్న ఎన్నోరకాల శారీరక, మానసిక సమస్యలకు పరిష్కారం హరిత సాహచర్యం లోనే లభిస్తుందన్నది వైద్యుల మాట. ఆహారమిచ్చి, విశ్రాంతినిచ్చి, ఆ ఆరడుగుల నేలనిచ్చి, కాల్చేందుకు కట్టెలనిచ్చిన ప్రకృతికి మనిషి ఏం చేస్తున్నాడు..!?

కనీసం కృతజ్ఞతలైనా చూపనవసరం లేదా..? భద్ర పరచుకోవలసిన బాధ్యత లేదా..?

కారు మెల్లగా వెళుతున్నాది..

మనం కొన్న నేలలో చిన్ని ఇల్లు కట్టుకొందాం.. మిగిలినదంతా నీ ఇష్టానికే వదిలేస్తాను. సరేనా?' అన్నాను నా భార్యతో..

ఆమె మొహంలో ఆనందం..

ఔను మరి.. స్త్రీలు కూడా ప్రకృతిలో భాగమే కదా..!

**వచ్చేవారం కథ .. లడ్డూ పెడతా గోవిందా**

**– కె.ఎ. మునిసురేష్ పిళ్లె**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సీనియర్ ప్రచారక్, అఖిల భారతీయ మాజీ బౌద్ధిక్ ప్రముఖ్, శ్రీ రంగాహరీజీ 2023 అక్టోబర్ 29 ఉదయం ఏడు గంటలకు స్వర్గారోహణ చేశారు. హిందూ మేధావులలో మహోన్నత బుద్ధిజీవి, అప్యాయత నిండిన, మెత్తటి మాటలతో ఎదుటివారికి తోడ్పాటునిస్తూ హృద్యంగా సంభాషించ గల వ్యక్తి, విశిష్టంగా ఆలోచించగలవారు, రాష్ట్రానికి అంకితమైన సంఘ రుషి జీవనయానం ముగిసింది. ఆయన వయసు 93 ఏళ్లు. 13 ఏళ్ల వయసుకే సంఘ స్వయంసేవకుడు అయ్యి, 80 ఏళ్లు వచ్చే వరకు చురుకుగా సంఘ కార్యకలాపాలలో పాలుపంచుకున్నారు. ఆయన 1983-1993 మధ్య కేరళ ప్రాంత ప్రచారక్‌గా, 1991 నుంచి 2005 వరకు అఖిల భారతీయ బౌద్ధిక్ ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సంఘ బాధ్యతల నుంచి తప్పుకున్నప్పటికీ, రాబిన్ శర్మ పుస్తకం- 'ది లీడర్ హూ హాడ్ నో టైటిల్' (బిరుదు లేని నాయకుడు) శీర్షికను నిజం చేస్తూ, శ్రీ రంగాహరీజీ సృజనాత్మకమైన రీతిలో చురుకైన స్వయంసేవక్‌గా వ్యవహరించారు.




**మన్‌మోహన్ వైద్య**

అఖిల భారత సహ సర్‌కార్యవాహ, ఆర్‌ఎస్‌ఎస్


# లక్ష్యం వైపు సాగిన మహిమాన్విత పాదాలు

హింసాత్మక, వేర్పాటువాద, రక్తరంజితమైన వామపక్ష సిద్ధాంతం క్షేత్ర స్థాయిలో చేస్తున్న సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని, కమ్యూనిజం పట్టి పీడిస్తున్న కేరళ గడ్డపై హిందుత్వను సమర్థించి, సమగ్ర జాతీయ సిద్ధాంతం, సంఘ జాతీయ ఆలోచనకి బీజాలు వేసిన వివేకవంతమైన, ఉత్సాహ వంతమైన కార్యకర్తలలో శ్రీ రంగాహరి ముఖ్యులు. క్రూర మనస్తత్వం కలిగిన కమ్యూనిస్టులతో జరిగిన హింసాత్మక ఘర్షణలలో అక్కడ 298 మంది సంఘ కార్యకర్తలు మరణించారు. వీరిలో 70 శాతం గతంలో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అనుసరించి, తరువాత స్వయంసేవకులు అయినవారే. అటువంటి స్వయంసేవకుల కుటుంబాలను ఆదుకుంటూ, వారి దుఃఖాన్ని సాంత్వనపరుస్తూ, ఓదార్పునిస్తూ, తాము ఇంకా సంఘపరివారంలోనే ఉన్నామనే భావన కలిగేలా చూడడం అన్నవి ఆ దుర్ఘటనల తర్వాత చేపట్టవలసిన సంక్లిష్ట చర్యలు. అంతటి బరువును భరించేలా హృదయాన్ని గట్టిపరచుకునేందుకు ఎలా కృషి చేస్తారో వివరించమని శ్రీ రంగాహరీజీని నేను ఒకసారి అడిగినప్పుడు, ఆయన భోరున విలపించడం ప్రారంభించారు. పైన పేర్కొన్న తరహా హింసాత్మక పరిస్థితులు, వాటి పరిసర ప్రాంతాలలో నిత్యం జీవించడం అన్నది వ్యక్తి కఠినమైన నిర్ణయాలు తీసుకునేలా ఒత్తిడి చేయడంవల్ల, అతడు బండబారి పోయే అవకాశాలు మెండుగా ఉంటాయి. అయితే, ఆ రోజు నేను పుష్పలమైన సున్నితత్వం, మృదుత్వం కలిగిన శ్రీ రంగాహరీజీ హృదయాన్ని చూడగలిగాను.

కేరళలలో కమ్యూనిస్టు గూండాలతో పోరాటం విస్తరిస్తున్న తరుణంలో, కమ్యూనిస్టు పార్టీల నాయకులతో చర్చల ప్రక్రియను ప్రారంభించాలన్న పిలుపు ఇచ్చారు. ఆ పిలుపు శ్రీ రంగాహరీజీదే.



సర్ సంఘచాలక్ మోహన్‌జీతో రంగాహరీజీ

అటువంటి ఒక చర్చలో సంఘ ప్రముఖులు శ్రీ దత్తోపంత్ ఠేంగ్డేజీ పాలుపంచుకున్నారు. హింసాత్మ కంగా, ఘర్షణాత్మకంగా మారిన కేరళ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం ఎలా? అన్న అంశంపై కొత్తగా ధారావాహిక వ్యాసాలు ఆరంభించమని 'కేసరి' అనే మలయాళ వారపత్రిక పాఠకులను కోరినప్పుడు, ఆ చొరవ తీసుకున్నందుకు అభినందిస్తూ ఎడిటర్‌కు వ్యక్తిగతంగా శ్రీ రంగాహరీజీ లేఖ రాశారు.

గంభీరమైన, క్లిష్టమైన విషయాంశాలను ఉదాహరణలతో, హాస్యస్ఫోరకంగా, నాటకీయంగా వివరించడం ఆయన విలక్షణ శైలి. ఆయన సంస్కృత శ్లోకాలు, సుభాషితాలు వంటి సుసంపన్న సాహిత్యాన్ని సేకరించారు.

ఆయన అధ్యయనం చేసి, సంగ్రహించి, అనంతర కాలంలో తన రాతలలోనూ, ఉపన్యా సాలలోనూ ఉపయోగించిన సుభాషితాలను క్రోడీకరించి పుస్తక రూపంలో ప్రచురించారు. ఆ పుస్తక శీర్షిక కూడా అత్యంత సందర్భోచితమైనది – సుధీ వాణి – సుధావాణి (తెలివైన మాటలు–

అమృతతుల్య వాక్కులు). కొత్త భాషలను గ్రహించడంలో ఆయన పద్ధతి, ఉత్సాహం అసాధారణమైనవి. గుజరాత్‌కు తొలి పర్యటనకు వెళ్లినప్పుడు, స్వల్పకాలంలోనే గుజరాతీ రాయడం, చదవడం నేర్చుకోవడం నన్ను నిశ్చేష్టుడిని చేసింది. ఆయన నిరంతర అధ్యయనం, ప్రాథమిక విశ్లేషణ, లోతైన అర్థాలను గుర్తించడానికి శ్రమించేవారు. విస్తృతమైన విషయాంశాలపై ఆయన 62 పుస్తకాలు ప్రచురించారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ రెండవ సర్ సంఘ్‌చాలక్ పరమ పూజనీయ గోళ్వాల్కర్ (గురూజీ) జన్మ శతాబ్ది (2005–2006) సందర్భంగా, 33 సంవత్సరాల సుదీర్ఘ పదవీకాలంలో (1940– 1973) వారు ఇచ్చిన అసంఖ్యా క ఉపన్యాసాల రాతప్రతులను సేకరించి, 12 సంపుటాలుగా వర్గీకరించడం శ్రీరంగాహరీజీ అందించిన అద్భుత సేవలలో ఒకటి. కాలపరీక్షకు నిలిచిన, నిత్యనూతనమైన శ్రీ గురూజీ ఆలోచనామృతాన్ని, 'శ్రీ గురూజీ – విజన్ అండ్ మిషన్' అన్న శీర్షికతో చేసిన రచనతో పాటు 'శ్రీ గురూజీ ఆత్మకథ' అన్నవి పైన పేర్కొన్న జన్మశతాబ్ది కార్యంలో భాగంగా రంగాహరీజీ మేధో నైపుణ్యంతో అందించిన తీపి కానుకలు.

శ్రీ హరీజీ అత్యాధునికంగా, అనూహ్యంగా ఆలోచించడంలో ప్రవీణులు కావడమే కాదు, అనేకమంది తన సహచరులను కూడా ఒకటే పంథాలో కాకుండా తమ సాధారణ పరిమితులకు ఆవల ఆలోచించేందుకు సాహసించవలసిందిగా ప్రోత్సహించారు.

ఔత్సాహిక రచయిత్రి దీప్తి వర్మ, 'పంచకన్య' శీర్షికతో అందమైన పుస్తకాన్ని రచించారు. అహల్య, ద్రౌపది, కుంతి, తార, మండోదరి – ఐదుగురూ కూడా పూజనీయ మహిళలు. ఈ మహిళల జీవితాల నుంచి ఈ శతాబ్దపు యువతులు గ్రహించగలిగే జీవిత పాఠాలను పట్టిచూపాలన్న ఉద్దేశంతో రచించిన ఈ పుస్తకం ఆ తరం వారిలో ప్రాచుర్యం పొందింది. 'అహల్య' శీర్షికతో ఉన్న తొలి అధ్యాయాన్ని దీప్తి శ్రీ రంగా హరీజీ అభిప్రాయం కోసం పంపించారు. అందుకు ఆయన స్పందన ఇలా ఉంది – దీప్తి వయసు శ్రీ హరీజీ మనవరాలి వయసుతో సమానం. అయినప్పటికీ, వారి చరిత్రలపై ఆధునిక దృక్కోణాన్ని ఆహ్వానిస్తున్న సంకేతంగా కేవలం తన ఆశీర్వచనాలు మాత్రమే పంపకుండా, 'ఆ భగవంతుడు మనందరినీ చల్లగా చూడుగాక' అని రాశారు. ఇది ఆయన అణకువను, వినయాన్ని ప్రతిబింబిస్తుంది. ఆ లేఖ ఇలా ఉంది –


శ్రీ హరీజీ

సు. శ్రీ దీప్తీజీ,

నమస్కారాలు. అహల్యపై మీ రచనను నిన్న చదివాను. క్లుప్తంగా చెప్పాలంటే, చాలా చక్కగా ఉంది. ప్రాథమిక పద్ధతి/వైఖరి, విశదీకరణను చదివి చాలా ఆనందించాను. మిగిలిన నలుగురిపై రచనలు కూడా ఇదే శైలిలో ఉంటాయని నేను సరిగ్గానే భావిస్తున్నాననుకుంటాను.

ఒక సంతోషకరమైన వాస్తవాన్ని మీ దృష్టికి తేవాలనుకుంటున్నాను.

కేరళలో దాదాపు 120 సంవత్సరాల కిందట జన్మించిన రచయిత్రి లలితాంబికా అంతర్జానం. ఆమె సంప్రదాయ నంబూద్రి (కేరళ బ్రాహ్మణ) సమాజంలో పుట్టిన ఆమె మలయాళంలో 'సీతా ముతల్ సత్యవతి వరే' (సీత నుంచి సత్యవతి వరకు)' అనే రచన చేశారు. అందులో ఒక అధ్యాయం అహల్య పైన ఉంది. ఈ విషాదం మొత్తానికి కారణం సరిపోలక పోవడం (మిస్‌మ్యాచ్) అంటూ నువ్వు పట్టి చూపించిన అంశాన్నే ఆమె కూడా పేర్కొన్నారు. ఈ పుస్తకం మలయాళంలో ఉంది. నేను చదివిన పుస్తకాలలో ఒక మహిళ మరొక మహిళను మూల్యాంకనం చేసిన తొలి పుస్తకమదే. అలా మూల్యాంకనం చేయడం అన్నది కూడా అత్యంత ముఖ్యం. నువ్వు ఆ పని వాస్తవంగా చేసినందుకు ప్రశంసిస్తున్నాను.

శాస్త్రీయ దృక్పథమనే ఈ కాలం సోదరీమణుల, తల్లుల తృష్ణను, స్వభావాన్ని తృప్తి పరుస్తూ మీ వ్యాఖ్యానం ఉండటం నాకెంతో నచ్చింది.

మీరు పూర్తి చేయగానే రానున్న రచనలలో ఆ నలుగురి కోసం నేను ఎదురుచూస్తున్నాను.

ఆ భగవంతుడు మనందరినీ చల్లగా చూడుగాక,

**యువర్స్ సిన్సియర్లీ**
**రంగాహరి**

శ్రీ హరీజీ జీవితం నుంచి విడదీయలేని సహచరి హాస్య చతురత. సంఘ అఖిల భారతీయ బైఠక్‌లో ఏ మాత్రం విరామం లభించి, స్వయంసేవకులు ఒకచోట గుమిగూడి ఉండగా, అటుగా వెడుతున్న కార్యకర్తలు కూడా వారితో కలిసిపోవడం, అప్పుడప్పుడు నవ్వులు తెరలు తెరలుగా వినిపిస్తుండటం జరుగుతోందంటే, అక్కడ శ్రీ రంగాహరీజీ ఉన్నారని కచ్చితంగా భావించవచ్చు.

ఆయన పొట్టివారు (ఐదడుగులకన్నా కొద్ది తక్కువ) కావడం వల్ల దూరం నుంచి అటువంటి సమూహాలలో ఆయనను గుర్తించడం అసాధ్యం అయినప్పటికీ, హఠాత్తుగా వినిపించే నవ్వుల జల్లు ఆయన అక్కడే ఉన్నారనడానికి తిరుగులేని సంకేతం.

నేను తరచు ఖలీల్ జిబ్రాన్ 'యువర్ చిల్డ్రన్' అనే కవితను ప్రస్తావించేవాడిని. హరీజీ ఉన్న ఒక సమావేశంలో నేను దానిని ప్రస్తావించేవరకూ ఆ కవిత నాకు పాక్షికంగా మాత్రమే తెలుసుననే విషయం నాకు ఎరుకలేదు. నేను ఆపిన దగ్గర నుంచి ఆ కవితకు ఇంకా కొనసాగింపు ఉందని ఆయన నాకు చెప్పారు. ఈ మెయిళ్ల కాలం కాని ఆ రోజుల్లో, శ్రీ రంగాహరీజీ ముంబైలో ఉన్నారు. తన నిర్ణీత ప్రయాణాలను పూర్తి చేసుకుని, రెండు నెలల విరామానంతరం తను ముంబై కేంద్రానికి చేరుకున్న తర్వాత, 'యువర్ చిల్డ్రన్' అన్న ఖలీల్ జిబ్రాన్ కవిత మొత్తాన్ని ఎంతో ఆలోచనాత్మకంగా విశ్లేషించే లేఖ రాసి నాకు పంపారు. ఈ లేఖ చివరిలో, తన వినోద శైలిలో ఆయన ఒక నోట్‌ను కూడా జతపరిచారు. అది–

'ప్రియమైన మన్మోహన్! ఏ పిల్లలూ లేని వారు ఏ పిల్లలూ లేనివారికి 'యువర్ చిల్డ్రన్' పంపిస్తున్నారు (Dear Manmohan, sending 'Your Children' to one who has none by one

who also has none).

– ఆర్ హరి

(సంఘ్ కేడర్ గురించి తెలియనివారికి– మేమిద్దరం ప్రచారకులం, ప్రచారకులు వివాహం చేసుకోరు.) ప్రచారక్ 'అనికేతుడు' (నికేత లేదా గృహం లేనివాడు అని), సంస్థ అవసరాలను బట్టి ఒక మూల నగరాన్ని అతడికి కేటాయిస్తుంది. శ్రీ రంగాహరీజీ మూల స్థావరం ముంబై. అక్కడ ఉన్నప్పుడు ఆయన గుజరాత్ పర్యటనకు వచ్చారు. ఇద్దరం కలసి ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త నివాసానికి వెళ్లాం. అక్కడ సంభాషణ ప్రారంభిస్తూ, 'హరీజీ మీరు ఎప్పుడు వచ్చారు?' అని పారిశ్రామిక వేత్త అడిగారు. గుజరాత్‌లో ఆయన ఎంత కాలముంటారో తెలుసుకోవాలన్న ఆసక్తి అతడిలో బాగా ఉండడంతో తిరిగి, 'మీరు ఎప్పుడు తిరిగి వెడుతున్నారు?' అని కూడా అడిగారు. అందుకు హరీజీ తక్షణమే స్పందిస్తూ, "నేను మూడు రోజుల తర్వాత ఢిల్లీ బయలుదేరి వెడతాను. తిరిగివెళ్లడం కాదు. నా అధికారిక స్థావరం ముంబై. ముంబై వెళ్లేటప్పుడు మాత్రమే నేను తిరిగి వెడుతున్నా నంటాను" అని సమాధానం చెప్పారు. ఒక సాధారణ సంభాషణలో కూడా అంత సమయస్ఫూర్తిని ప్రదర్శించడం నన్ను ఆశ్చర్యపరచడమే కాదు, ఆకట్టుకుంది కూడా.

శ్రీ రంగాహరీజీ ఒక వ్యవస్థ. ఆయన తన జీవితం, ప్రవర్తన, నడత ద్వారా అనేకమందికి ఎంతో బోధించారు. అంతేకాదు, అంతిమ క్షణానికన్నా కొన్ని ఏళ్ల ముందే గ్రహించి, తన మరణం గురించి ఆయన రాసుకున్న విషయాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా, విస్తారంగా, లోతుగా ఉన్నాయి. కేరళ ప్రాంత ప్రచారకులను ఉద్దేశించిన సీల్డ్ లెటర్స్‌ను ప్రాంత ప్రచారక్‌కు అందించి, తాను భౌతికంగా శరీరాన్ని వదిలిపోయిన తర్వాతే వాటిని తెరవాలనే ఆదేశాలతో అప్పటివరకూ వాటిని జాగ్రత్తగా ఉంచమని చెప్పారు. ఆ లేఖలలో ఆయన, 'మనిషి సజీవంగా ఉన్న కాలంలో తాను ఏం కావాలనుకుంటే అవి చేయగలడు. కానీ అతడు మరణించిన తర్వాత చేయవలసిన పనులను అతడు స్వయంగా చేయలేడు. తన కోసం ఇతరులు చేయాలని వారిపై ఆధార పడతారు. కనుక నా విజ్ఞప్తి ఏమిటంటే, ఒక నిర్దిష్ట కులానికి చెందిన వారి శ్మశానంలో నా భౌతికకాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహించ వద్దు. అందుకు బదులుగా, ఎవరికైనా అంతిమ సంస్కారం చేసే అవకాశం ఉన్న ప్రదేశంలోనే నా భౌతిక కాయానికి వాటిని నిర్వహించండి. నేను కుల ఆధారిత వివక్షను నా జీవితకాలంలో ఎన్నడూ అనుసరించలేదు. నా మరణం తర్వాత కూడా దానినే కొనసాగించాలనుకుంటున్నాను. పాండవులు పిండదానం చేసిన చారిత్రక 'అయివారం మఠం'



**శ్రీ రంగాహరీజీ ఒక వ్యవస్థ. ఆయన తన జీవితం, ప్రవర్తన, నడత ద్వారా అనేకమందికి ఎంతో బోధించారు. అంతేకాదు, అంతిమ క్షణానికన్నా కొన్ని ఏళ్ల ముందే గ్రహించి, తన మరణం గురించి ఆయన రాసుకున్న విషయాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా, విస్తారంగా, లోతుగా ఉన్నాయి. కేరళ ప్రాంత ప్రచారకులకు ఉద్దేశించిన సీల్డ్ లెటర్స్‌ను ప్రాంత ప్రచారక్‌కు అందించి, తాను భౌతికంగా శరీరాన్ని వదిలిపోయిన తర్వాతే వాటిని తెరవాలనే ఆదేశాలతో అప్పటివరకూ వాటిని జాగ్రత్తగా ఉంచమని చెప్పారు.**

కేరళలోని భరత నది ఒడ్డున ఉంది. నా అంతిమ సంస్కారాలు అక్కడ జరపాలి. అలాగే నా అస్తికలను, బూడిదను ఒక ప్రముఖుని లాగా రెండు మూడు ప్రాంతాల వ్యాప్తంగా గాక స్థానికంగా ఉన్న ఏదైనా నది, చెలమలో కలపండి. నేను నా శ్రాద్ధాన్ని, పిండదానాన్ని బ్రహ్మకపాలంలో (హిమాలయాలలోని బదరీనాథ్ ఆలయానికి సమీపంలోని ఒక పుణ్యక్షేత్రం) నిర్వహించాను, కనుక ఈ కర్మ కాండలను నా కోసం ఎవరూ నిర్వహించనవసరం లేదు. నా మేధోపరమైన రచనలు, ప్రచురణల యాజమాన్య హక్కులను సంఘ్‌కి ఇస్తున్నాను. కమ్యూనిస్టు కార్యకర్తలకు అంతిమ సంస్కారం చేసే ముందు వారిపై ఎర్రబట్టను కప్పడం కేరళలో చాలా ఎక్కువ. ఈ పద్ధతికి స్పందనగా సంఘ్ స్వయం సేవకుల భౌతికకాయాలకు కాషాయం చుట్టడం అన్నది కేరళలో పెరిగింది. కానీ అది సరైన పని కాదు. కాషాయం అన్నది గురువుకు ప్రతినిధి (దారిచూపే కాంతి). కనుక, నా శరీరాన్ని కాషాయ బట్టతో చుట్టకండి!'

ఇవీ రంగాహరీజీ రాసిపెట్టిన చివరి కోరికలు. అనుసరణీయమైన జీవితాన్ని ఆయన జీవించడమే కాదు మరణించే ప్రక్రియలో కూడా అన్వేషకుల మార్గానికి కాంతినిస్తూ, అనేకమంది మనసులలో కాంతిని నింపారు.

దిగువన ఇచ్చిన ఈ మూడు శ్లోకాలతో శ్రీ రంగాహరీజీ తన చివరి ప్రార్థనను రచించారు.

**మామికాన్తిం ప్రార్థన**

**కరణీయం కృతం సర్వం తత్‌జన్మమ్ సుకృతం మమ్**
**ధన్యోస్మి కృతకృత్యోస్మి గచ్ఛామ్యద్య చిరం గృహం**
**॥ 1 ॥**

**కార్యార్థం పునరాయుతమ్ తథాప్యాశాస్తి మే హృది**
**మిత్రై సహకర్మ కుర్వన్ స్వాంతః సుఖమవాప్నుయామ్**
**॥ 2 ॥**

**ఏష చేత్ ప్రార్థన దృష్ట క్షమస్వ కరుణానిధే**
**కార్యమిదం తవైవాస్తి తావకేచ్ఛా బలీయసి ॥ 3 ॥**

అర్థం–నాకు అప్పగించవలసిన పనులు అప్పగించినందున నేను ఎంతో కృతజ్ఞతతో ఉన్నాను, ఈరోజు నేను నా శాశ్వత నివాసానికి వెడుతున్నాను. ఇదే పనిలో తిరిగి నిమగ్నమయ్యేందుకు తిరిగి రావాలని కోరుకుంటున్నాను. నేను నా సహకార్య కర్తలతో కలసి ఇదే పనిని మరింతగా చేసి ఆత్మ సంతృప్తిని పొందుతానని కచ్చితంగా అనుకుంటు న్నాను. ఒకవేళ ఈ ప్రార్థనతో అహంకారాన్ని ప్రదర్శిస్తే, నన్ను క్షమించండి. ఈ 'పని' కూడా మీదే, మీ కోరికే ప్రధానం.

**దేఖనా దేహాంత తో జో, సాగరి సూర్యాస్త సా**
**అగ్నిచా పేరున్ జాతో రాత్రగర్భి వారసా ॥**

ఒకవేళ ఈ పదాలను అనువదిస్తే, అర్థం ఇలా ఉంటుంది –

సముద్రంలోకి కుంగుతున్న సూర్యుడి చివరి కిరణాలలా మరణం కూడా అందమైనదే

అది వారసుని చీకటి గర్భానికి అగ్నిపరీక్షను ఆస్తిగా సంక్రమింప చేస్తుంది.

శక్తిమంతమైన హిమాలయాల వంటి ఎత్తులను అధిరోహించిన వ్యక్తి మా మధ్యలో నడిచాడు. ఆయన సహచరులుగా ఆయనతో సంభాషించే అవకాశం మాకు లభించింది. మనలాంటి సామాన్యమానవులు ఆయన అనురాగపు జల్లులతో మురిసిపోతారు– ఇదంతా ఒక కలలా అనిపిస్తోంది. హింసాత్మక కమ్యూనిస్టు భావజాలానికి వ్యతిరేకంగా పోరాటాన్ని, కేరళలో కమ్యూనిజం పీఠాన్ని కూల్చివేసేందుకు ఏకదృష్టితో, అంకితభావంతో పోరాడే సంఘ్ కార్యకర్తలను అభివృద్ధి చేసిన ఉపజ్ఞత కలిగిన గురువు, మార్గదర్శి అయిన ఆ మహోన్నత వ్యక్తికి నా వినయపూర్వక ప్రణామాలు.

**దేఖనీ తీ పావులే జీ ధ్యాస పంథే చాలతీ**
**వాళవంతతూన శుద్ధ స్వస్తి పద్మే రేఖతీ ॥**

ఆ పాదాలు మహిమాన్వితమైనవి, లక్ష్యంవైపు సాగుతాయి

మారుతున్న కాలపు ఇసుక మీద, ఉత్సాహ పూరితమైన ఆత్మ స్ఫూర్తిని ప్రకాశింపచేయండి/ వెలిగించండి. ★




భారత క్రికెట్లో తరాలు మారుతున్నా తలరాత ఏ మాత్రం మారడం లేదు. ఐసీసీ ప్రపంచకప్ ట్రోఫీలు రానురాను భారత్‌కు అందని ద్రాక్షలా తయారవుతున్నాయి.

# భారత్‌కు ప్రపంచ కప్ అందని ద్రాక్షేనా?

ప్రపంచ క్రికెట్‌కు జీవనాడి, అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను సంవత్సరాల తరబడి అదృష్టం వెక్కిరిస్తూనే ఉంది. తరాలు, సంవత్సరాలు, వేదికలు, ఆటగాళ్లు శిక్షకులు మారినా భారత్ తలరాత ఏ మాత్రం మారడం లేదు. గత దశాబ్ద కాలంగా క్రికెట్ మూడు ఫార్మాట్లలోనూ ఐసీసీ నిర్వహించిన ప్రపంచకప్ పోటీలలో భారత్ కనీసం ఒక్కసారీ విశ్వవిజేతగా నిలువలేకపోయింది. సాంప్రదాయ టెస్టు క్రికెట్, 50 ఓవర్ల వన్డే క్రికెట్, ధూమ్ ధామ్ టీ-20 ప్రపంచకప్ టోర్నీలలో భారత్ విజయవంతం కాలేకపోతోంది.

**అన్నీఉన్నా భారత్ కే ఎందుకిలా?**

ప్రపంచక్రికెట్ మూడు విభాగాలలోనూ భారత్ నంబర్ వన్ ర్యాంకులో కొనసాగుతోంది. ప్రపంచ క్రికెట్లో అత్యంత భాగ్యవంతమైన బోర్డు బీసీసీఐ మాత్రమే. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్ మన్ గిల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ షమీ, జస్ ప్రీత్ బుమ్రా, యశస్వి జైశ్వాల్ లాంటి అత్యంత ప్రతిభావంతులు, అసాధారణ క్రికెటర్లు భారతజట్టులో సభ్యులుగా ఉన్నారు.

ప్రపంచ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక శిక్షణ సౌకర్యాలు, వీటన్నింటినీ మించి ప్రతిభావంతులైన ఆటగాళ్లను రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా మార్చగలిగే ఐపీఎల్ సైతం ఉన్నాయి. అయినా..ఏం లాభం! ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లాంటి జట్లు వచ్చి ప్రపంచకప్ ట్రోఫీలను తన్నుకు పోతున్నాయి.

**కపిల్ దేవ్ నుంచి మహేంద్ర సింగ్ ధోనీ వరకూ...**

1983-2013 మధ్యకాలంలో భారత్ మూడంటే మూడు ప్రపంచకప్ లను, పలుమార్లు మినీ ప్రపంచకప్ ట్రోఫీలను గెలుచుకోగలిగింది. ఇంగ్లండ్ వేదికగా 1983లో జరిగిన ప్రుడెన్షియల్ ప్రపంచకప్ టోర్నీలో కపిల్ దేవ్ నాయకత్వంలో తొలిసారిగా ఈ కప్ అందుకొంది. 1970 దశకంలో ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్న వెస్టిండీస్‌పై విజయం సాధించి సరికొత్త చరిత్రే సృష్టించింది. ఆ తర్వాత మరో ప్రపంచకప్ కోసం 2007 వరకూ వేచిచూడాల్సి వచ్చింది.

దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన 2003 వన్డే ప్రపంచకప్ ఫైనల్స్ చేరినా..టైటిల్ పోరులో రికీ పాంటింగ్ నాయకత్వంలోని ఆస్ట్రేలియా చేతిలో భారత్ పరాజయం చవిచూడాల్సి వచ్చింది. దక్షిణాఫ్రికా గడ్డపైన 2007లో ఐసీసీ తొలిసారిగా నిర్వహించిన టీ-20 ప్రపంచకప్ టోర్నీలో మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని భారతజట్టు పొట్టి ఫార్మాట్లో సైతం విశ్వవిజేతగా అవతరించింది.

ఆ తర్వాత అటు వన్డే, ఇటు టీ-20 ఫార్మాట్లలో జరిగిన పలు ప్రపంచ కప్ టోర్నీలలో భారత్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. భారత్ వేదికగా 2011లో జరిగిన వన్డే ప్రపంచకప్ టోర్నీలో భారీ అంచనాల నడుమ పోటీకి దిగిన భారత్ స్థాయికి తగ్గట్టుగా ఆడి రెండోసారి ట్రోఫీని చేజిక్కించుకోగలిగింది.

రెండు దశాబ్దాలపాటు భారత క్రికెట్ కు అపురూపమైన సేవలు అందించిన మాస్టర్ సచిన్ టెండుల్కర్ ప్రపంచకప్ కల 2011 టోర్నీతోనే సాకారమయ్యింది.

2013 లో జరిగిన ఐసీసీ మినీ ప్రపంచకప్ కమ్ చాంపియన్స్ ట్రోఫీని భారత్ చివరిసారిగా గెలుచుకొంది. భారత్‌కు మూడు ఐసీసీ ట్రోఫీలు అందించిన ఏకైక కెప్టెన్ ఘనత జార్ఖండ్ డైనమైట్ మహేంద్ర సింగ్ ధోనీకి మాత్రమే దక్కుతుంది. ధోనీ స్థానంలో విరాట్ కోహ్లీ భారతజట్టు పగ్గాలు చేపట్టి పరుగులు, రికార్డులు, సెంచరీల మోత మోగించినా వన్డే, టీ-20 ప్రపంచకప్ టోర్నీలలో సాధించింది ఏమీలేదు. ఐసీసీ టెస్టు లీగ్‌లో ఫైనల్స్ చేరినా రన్నరప్ గానే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

2021 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ వైఫల్యం తరువాత నాయకత్వ బాధ్యతల నుంచి విరాట్ కోహ్లీ తప్పుకోడంతో హిట్ మ్యాన్ భారతజట్టు కెప్టెన్‌గా, మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రావిడ్ ప్రధాన శిక్షకుడిగా జట్టు పగ్గాలు అందుకొన్నారు. అయినా అవే వైఫల్యాలు, అదే పరంపర కొనసాగింది.

ఆస్ట్రేలియా వేదికగా జరిగిన టీ-20 ప్రపంచకప్ సెమీస్‌లోనే ఓటమి పొందిన భారత్..ఐసీసీ టెస్టు లీగ్ ఫైనల్లోనూ పరాజయం పొంది రన్నరప్ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**చిక్కినట్లే చిక్కి చేజారిన ప్రపంచకప్!**

భారతగడ్డపై కొద్దిరోజుల క్రితమే ముగిసిన 2023-ఐసీసీ వన్డే ప్రపంచకప్ సైతం రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత్ చేతికి చిక్కినట్లే చిక్కి చేజారిపోయింది. రౌండ్ రాబిన్ లీగ్‌లో తొమ్మిదికి తొమ్మిది విజయాలు, సెమీఫైనల్లో న్యూజిలాండ్ ప్రత్యర్థిగా గత రెండు దశాబ్దాల కాలంలో తొలిసారిగా నెగ్గడం ద్వారా టైటిల్ సమరానికి అర్హత సంపాదించింది.

అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ప్రధాని మోదీ సమక్షంలో.. భారీఅంచనాల నడుమ జరిగిన టైటిల్ పోరులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ అనుకోని ఓటమి చవిచూడాల్సి వచ్చింది. సెమీఫైనల్స్ వరకూ తిరుగులేని విజయాలతో చెలరేగిపోయిన రోహిత్ సేన ఆఖరిమెట్టుపై చతికిలపడి పోవడం కోట్లాదిమంది అభిమానులకు నిరాశను మిగిల్చింది.

బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో రికార్డులు, అవార్డులన్నీ భారత క్రికెటర్లకు దక్కితే ..ప్రపంచకప్‌ను మాత్రం ఐదుసార్లు విజేత ఆస్ట్రేలియా ఆరోసారి గద్దలా తన్నుకుపోయింది. ప్రతిభ ఉంటే విజయాలు మాత్రమే సాధించగలం, అదృష్టం ఉంటేనే ప్రపంచకప్ గెలుచుకోగలమనడానికి భారత అనుభవాలే నిదర్శనం

వచ్చే ఏడాది వెస్టిండీస్, అమెరికా దేశాల సంయుక్త ఆతిథ్యంలో జరిగే ఐసీసీ టీ-20 ప్రపంచకప్ లో సైతం భారత్ హాట్ ఫేవరెట్ గానే బరిలోకి దిగనుంది. ఆ తర్వాత జరిగే ఐసీసీ మినీ ప్రపంచకప్, మరో టీ-20 ప్రపంచకప్, 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్ పోటీలలోనైనా భారత్ కల నెరవేరాలని కోరుకొందాం.! ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# వసుధైవ కుటుంబకం కోసం

## బ్యాంకాక్‌లో ముగుసిన మూడో ప్రపంచ హిందూ కాంగ్రెస్ పిలుపు


బ్యాంకాక్‌లో సభా మందిరం

భూగోళం మీద ఉన్న ప్రతి హిందువు సాటి హిందువుతో బంధం ఏర్పరుచుకుని, హిందూ జీవన విలువల ఆచరణ ద్వారా విశ్వ శ్రేయస్సుకు పాటుపడాలని మూడో ప్రపంచ హిందూ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నవంబర్ 24,25,26 తేదీలలో ఈ సమావేశాలు ఘనంగా జరిగాయి. నాలుగేళ్లకు ఒకసారి ఈ సమావేశాలు నిర్వహిస్తారు. 61 దేశాల నుంచి 2,200 మంది ప్రతినిధులు హాజరైన బ్యాంకాక్ సమావేశాలలో ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ప్రారంభోపన్యాసం చేశారు. ఇంకా మాతా అమృతానందమాయి దేవి వంటి ప్రముఖులు కూడా సందేశాలు ఇచ్చారు. ఈ సదస్సుకు ఆర్‌ఎస్‌ఎస్ సర్‌కార్యవాహ్ దత్తాత్రేయ హొసబలే అధ్యక్షత వహించారు. ఇంపాక్ట్ అండ్ కన్వెన్షన్ సెంటర్, మునాంగ్ థాంగ్ థాని మందిరంలో ఈ సమావేశాలు జరిగాయి.

అందరి ఉపన్యాసాలు ఉత్తేజకరంగా, ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ సాగాయి. హిందూధర్మం లేదా హిందూత్వం అని మన ధర్మాన్ని ప్రస్తావించు కుందామని, పిలుచుకుందామని ఈ సమావేశాలు చరిత్రాత్మక తీర్మానం ఆమోదించాయి. ప్రపంచ వ్యాప్తంగా హిందువులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడానికి ఈ సమావేశాలు వేదికగా ఉపయోగపడతాయి. హిందువుల అనైక్యత ద్వారా ఎదురైన విష ఫలితాల గురించి చరిత్ర ఇంతగా ఘోషిస్తున్నా ఇప్పటికీ మన మధ్య ఐక్యత అవసరం గురించి ఆలోచించవలసిన స్థాయిలో ఆలోచించడం లేదన్న అంశమే ఈ సదస్సులో ప్రధానంగా కనిపించింది. వివిధ అంశాల మీద ఏర్పాటు చేసిన ఉప గోష్ఠులలో పాల్గొన్నవారికి గట్టిది, మెత్తనిది రెండు లడ్డులు పంచిపెట్టారు. లడ్డూలను ఉంచిన పెట్టె మీద అదే ముద్రించారు. హిందూ సమాజం మెత్తగా ఉన్న లడ్డూలా ఉన్నది. చిన్న ఒత్తిడికే ఇట్టే చితికి పోతున్నది. నోట్లో ముక్క వేసుకుంటే వెంటనే కరిగిపోతున్నది. దీనిని గమనిద్దాం. కానీ గట్టి లడ్డు అంత తొందరగా చితకదు. ముక్కలు కాదు. మనం ఇలాగే ఉండాలి. ఛిద్రం చేయడానికి వీలులేకుండా సంఘటితంగా ఉంటేనే బయటి శక్తుల దాడిని ఎదుర్కొనగలుగుతాం అని ముద్రించారు. సనాతన ధర్మం మీద నిరంతరం సాగుతున్న యుద్ధం గురించి కూడా సభ్యులు ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పోకడలను గట్టిగానే ప్రతిఘటించాలని కూడా అభిప్రాయపడ్డారు.

2026 సంవత్సరంలో జరిగే ప్రపంచ హిందూ కాంగ్రెస్‌ను ముంబైలో నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ఆ సమావేశాల కంటే ముందే వచ్చే సంవత్సరం సెప్టెంబర్‌లో ముంబైలోనే ప్రపంచ హిందూ ఆర్థిక సదస్సును నిర్వహించాలని కూడా పెద్దలు నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రపంచ

## 200 దేశాలలో ఉన్న హిందువులను కలిపేందుకే !

21వ శతాబ్దంలో హిందూ సమాజం ఒక బలీయ వ్యవస్థ. 1.2 బిలియన్ హిందువులు ఉన్నారు. అంటే ప్రపంచ జనాభాలో 16 శాతం. ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలలో ఉన్న హిందువులు అనేక స్థాయిలలో తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వ్యాపారం, ఆర్థిక వ్యవహారాలు, విద్యారంగం, పరిపాలనారంగం, మీడియా, సాంకేతిక, సాంస్కృతిక రంగాలలో తమ ఉనికిని విశిష్టంగా చాటుకుంటున్నారు. వీరు సంఘటితం కావాలి. ఒక అంతస్సూత్రం ఉండాలి. ఇలాంటి వారందరు కలుసుకోవడానికి ఒక వేదికను ఏర్పాటు చేయడమే ప్రపంచ హిందూ కాంగ్రెస్ ఉద్దేశం. తమ మాతృభూమికి, సాటి హిందువులకు చేయగలిగిన సాయం చేయడానికి ఈ సదస్సు వారికి అవకాశం కల్పిస్తుంది. అలాగే నానాటికి హిందువుల పట్ల పెరుగుతున్న వివక్ష గురించి చర్చించడానికి కూడా ఈ వేదిక ఉపయోగపడుతున్నది. సాంస్కృతికంగా హిందువులు ఎదుర్కొంటున్న దాడులు, వివక్ష, భౌతికదాడుల గురించి కూడా ఇక్కడ చర్చించి చర్యల తీసుకోవడానికి ఉన్న మార్గాలను అన్వేషిస్తారు. జయస్య ఆయతనం ధర్మ -విజయానికి ధర్మమే నిలయం అన్న నినాదం బ్యాంకాక్ సమావేశాలకు నినాదంగా ఎంచుకున్నారు. ప్రపంచ హిందూ కాంగ్రెస్ తొలి సమావేశాలు ఢిల్లీలో, రెండో సమావేశాలు అమెరికాలో, మూడో సమావేశాలు బ్యాంకాక్‌లో జరిగాయి.



జ్యోతి ప్రజ్వలనం గావిస్తున్న మాతా అమృతానందమాయి,
ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డా॥ మోహన్ భాగవత్



వ్యాప్తంగా ఉన్న హిందూ వాణిజ్యవేత్తలు ఒక ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తారు.

పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం, భౌతికవాదాలతో రకరకాల ప్రయోగాలు చేసిన ప్రపంచం చివరకు సంతోషం, సంతృప్తికి అవసరమైన మార్గాలను భారతదేశమే ప్రపంచానికి చూపగలదని ప్రగాఢంగా విశ్వసిస్తున్నదని డాక్టర్ మోహన్ భాగవత్ తన ప్రారంభోపన్యాసంలో అన్నారు. ప్రధానంగా కొవిడ్ తరువాత విశ్వం ఏకగ్రీవంగా అలాంటి అభిప్రాయానికి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. సుఖసంతోషాలనిచ్చే మార్గాల కోసం గడచిన రెండు వేల ఏళ్లుగా ప్రపంచం అన్వేషిస్తూనే ఉన్నదని, అందుకోసం కొన్ని మతాలు, సిద్ధాంతాలు కూడా పనిచేశాయని కానీ చివరికి నిరాశే మిగిలిందని అన్నారు. సేవ ద్వారా సాటి మానవుడికి చేరువకావాలని ఆయన పిలుపునిచ్చారు. నిస్వార్థ సేవ మన సంప్రదాయంలో ఉన్నదని చెప్పారు. అందుకే మనం హృదయాలను గెలవడానికే ప్రయత్నం చేయాలని అన్నారు.




ప్రపంచంలోని హిందువులంతా సాటి హిందువులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పరుచుకోవాలని పిలుపునిచ్చారు. మన వంతుగా కూడా సాటి హిందువుకు చేరువ కావాలని, తరువాత అదే ప్రపంచంతో మన బంధం పెరగడానికి శ్రీకారం చుదుతుందని అన్నారు. వసుధైవ కుటుంబకం అనే భావనను విస్తరింపచేయడంలో హిందువులు కీలకపాత్ర వహించాలని ఆయన చెప్పారు. ఈ మహదాశయాన్ని సాధించడానికి మనమంతా ఏకం కావాలి, కలిసి పనిచేయాలి అని సర్‌సంఘచాలక్ కోరారు. ప్రతి వ్యక్తి తనకున్న ప్రత్యేకతను బట్టి ప్రపంచానికి ఏదో ఒక విధంగా సేవ చేయాలని, ఈ స్పృహ మన పూర్వీకులకు ఉన్నా, ఇటీవలి తరాలు విస్మరించాయని ఆయన అన్నారు. మనం కలసి ఉండడం మరచిపోయాం, చీలికలు పేలికలయ్యాం. ఫలితంగా ఎవరో మనని గెలిచారు అని ఆయన వివరించారు. ఇప్పటికైనా మనం ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఆధ్యాత్మిక చింతన ద్వారా ప్రపంచాన్ని జయించమని స్వామి వివేకానంద ప్రతి హిందువుకు పిలుపునిచ్చారని, భౌతికపరమైన పురోగతి, ఆధ్యాత్మిక ఉన్నతి కలసి మనను ప్రపంచ హిందూ కాంగ్రెస్ నిర్వహణకు ప్రోత్సహించాయని అనుకుంటున్నానని, 'జయస్య ఆయతనం ధర్మ' (బ్యాంకాక్ సమావేశాల నినాదం) ఆశయం దగ్గరకు తీసుకువచ్చిందని హొసబలే తన ఉపన్యాసంలో అన్నారు. హిందువుల ఐక్యత ద్వారా ఉద్భవించే శక్తిని ఎవరినీ భయపెట్టడానికి కాదనీ, అది మానవాళి సంక్షేమం కోసమేనని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి మిళింద్ పరాండే వ్యాఖ్యానించారు.

ప్రస్తుత ప్రపంచంలో నిస్వార్థ సేవ, ప్రేమను అందించేవారు తగ్గిపోతున్నారని మాతా అమృతానందమాయి దేవి ఆవేదన వెలుబుచ్చారు. ఇందుకు విరుగుడు మతం పట్ల ప్రజలలో భక్తిభావం పెంచడమేనని కూడా ఆమె అన్నారు. కాబట్టి ఇలాంటి సమావేశాల అవసరం కూడా బాగా పెరిగిందని మాత అభిప్రాయపడ్డారు.

ప్రథమ ప్రధాని తీసుకువచ్చిన సోషలిజం, ధరల అదుపు, లైసెన్స్ కోటా రాజ్‌లతో ధ్వంసమైన దేశం భారత్ అని ఈ సమావేశాలలో ప్రసంగించిన ఆర్థిక విశ్లేషకుడు మోహన్‌దాస్ పాయ్ విమర్శించారు. ఈ దేశంలో పెట్టుబడులను, వాణిజ్యాన్ని ప్రథమ ప్రధాని నెహ్రూ చతికిలపడేటట్టు చేశారని ఆయన ఆరోపించారు. అలాగే భారతదేశంలో హిందువుల కంటే ముస్లింలే ఎక్కువ హక్కులను అనుభవిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ భారతదేశంలో మెజారిటీ ప్రజలు, అంటే హిందువులు మైనారిటీలుగా ఉన్న ముస్లింలను అణచివేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని పాయ్ చెప్పారు. కొవిడ్ కారణంగా హిందువులతో సమావేశం కావడమనే ప్రక్రియ కొంత మందగించిందని ఇప్పుడు మళ్లీ వేగవంతం చేయాలని ప్రపంచ హిందూ కాంగ్రెస్ వ్యవస్థాపకులు స్వామి విజ్ఞానానంద చెప్పారు. క్రైస్తవ మిషనరీల అధీనంలో ఉన్న హిందూ దేవాలయాల భూములను తిరిగి స్వాధీనం చేయాలని ఆయన కోరారు. మిషనరీలు కాలేజీలు, చర్చ్‌లు నిర్మించుకున్న భూములన్నీ హిందూ దేవాలయాలకు చెందినవేనని, వాటి లీజ్ ఎప్పుడో ముగిసిందని వాటిని తిరిగి స్వాధీనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ప్రపంచ హిందూ కాంగ్రెస్ మూడురోజులలో దాదాపు 50 ఉప సదస్సులు కూడా ఏకకాలంలో నిర్వహించారు. అందులో ప్రత్యేకంగా ఏడు అంశాల మీద దృష్టి కేంద్రీకరించారు. వాటిలో విద్య, ఆర్థిక వ్యవస్థ, మీడియా, రాజకీయ రంగం, యువతరం, మహిళల అంశాలు ఉన్నాయి. 30 దేశాల నుంచి వచ్చిన 50 మంది ప్రతినిధులు రాజకీయ రంగం మీద జరిగిన చర్చలలో పాల్గొన్నారు.

హిందూ ఎకనమిక్ ఫోరమ్ నిర్వహించిన సదస్సులలో 650 మంది ప్రతినిధులు భాగస్వాములయ్యారు. అంకుర సంస్థలకు పెట్టుబడుల కోసం సంప్రదింపులు జరిపి మూడు ప్రతిపాదనలను వెంటనే ఆమోదించారు కూడా. విదేశాలలో చట్టసభలకు ఎన్నికైన హిందువులకు మద్దతు తెలపాలని ఇక్కడ నిర్ణయించారు.

ప్రపంచ హిందూ కాంగ్రెస్ నిర్వహణ సంఘం అధ్యక్షులు సుశీల్ షరాఫ్, భారత్ సేవాశ్రమ్ సంఘ్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి పూర్ణాత్మానంద, హిందూయిజం టుడే ప్రచురణ కర్త (అమెరికా) సద్గురు బోధినాథ్ వేలానస్వామి కూడా పాల్గొన్నారు. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

# మోధేరా సూర్య దేవాలయం



గుజరాత్‌లోని మెహ్సానా జిల్లా మోధేరా గ్రామంలో, పుష్పవతి నది ఒడ్డున కొలువై ఉన్న ఈ ఆలయాన్ని సూర్యదేవుడికి అంకితమిచ్చారు. 1026–27 సంవత్సరంలో చాళుక్య రాజవంశానికి చెందిన ఒకటవ భీముడి పాలనలో ఈ ఆలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. సర్వే ఆఫ్ ఇండియాచే ఇది గుర్తింపు పొందింది. ఈ ఆలయంలో శిల్పకళను చూసేందుకు రెండు కళ్లు చాలవనే చెప్పాలి. అయితే శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం ఈ ఆలయంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

## కథ

# అవివేకం



ఒకరోజు అడవిలో ఒక చీమ వేగంగా పరిగెత్తుతున్నది. కొంతసేపటికి దానికొక ఎలుక ఎదురొచ్చింది.

"చీమా చీమా ఎందుకంత వేగంగా పరుగెత్తుతున్నావు?" అని అడిగింది ఎలుక.

"అక్కడొక పెద్ద జంతువుంది. నాకన్నా చాలా పెద్దది. అది నన్ను తినేస్తుందేమోనని పరిగెత్తుతున్నాను" అంది చీమ.

"అయితే అది నన్ను కూడా తినేస్తుందేమో, నేనూ నీతో పాటే పరుగెత్తుతాను" అంటూ ఎలుక కూడా పరుగు ప్రారంభించింది.

అవి రెండూ పరుగెడుతుండగా ఒక కుందేలు ఎదురొచ్చింది. "ఎందుకలా పరుగెడుతున్నారు?" అని అడిగింది కుందేలు.

"అక్కడొక పెద్ద జంతువుంది. నా కన్నా చాలా పెద్దది. అది నన్ను తినేస్తుందేమోనని పరుగెత్తుతున్నాను." అంది చీమ.

"అవునవును" అంది ఎలుక. దాంతో భయంతో కుందేలు కూడా వాటితో పాటు పరుగు లంకించింది.

కొంతదూరం వెళ్లగా వాటికి ఒక నక్క ఎదురొచ్చి అదే ప్రశ్న వేసింది. చీమ మళ్లీ అదే సమాధానం చెప్పింది.

## పద్యము

వగవకు గడిచిన దానికి
పొగడకు దురాత్ములనెపుడు పొసగని పనికై
యెగి దీనత నొందకుమీ
తగ దైవగతిం బొసంగు ధరను కుమారా!

భావం : ఓ కుమార! అయిపోయిన పనిని గురించి చింతించవద్దు. దుష్టులను మెచ్చుకొనవద్దు. నీకు సాధ్యము కాని దానిని పొందలేకపోతినని చింతించుట పనికిరాదు. భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తి చెందుము.

## శ్లోకము

'శ్మశానే పుత్ర బాంధవాః'

అర్థాః గృహే నివర్తంతే శ్మశానే పుత్ర బాంధవాః!
సుకృతం దుష్కృతంచైవ గచ్ఛంతమనుగచ్ఛతి!!

భావం : మానవుల అంతిమ శ్వాస తరువాత ఆస్తిపాస్తులు ఇంటికే పరిమితమవుతాయి. సంతానం, బంధువులు శ్మశానం వరకు వచ్చి ఆగిపోతారు. కాని చేసిన మంచిచెడులు ఎప్పటికీ అంటిపెట్టుకునే ఉంటాయి.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| హెచ్చు | ఆలస్యం |
| తన | ఖరీదు |
| ప్రాచీనం | పర |
| శీఘ్రం | పల్లం |
| చౌక | నవీనం |
| ఎత్తు | తగ్గు |

సమాధానాలు : హెచ్చు–తగ్గు తన–పర ప్రాచీనం–నవీనం శీఘ్రం–ఆలస్యం చౌక–ఖరీదు ఎత్తు–పల్లం.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### సరళాదేవి



ఓడిశాకి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య యోధురాలు, సామాజిక కార్యకర్త. 1904 ఆగస్టు 19న జన్మించారు. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన మొదటి ఒడియా మహిళగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం పోరాటానికి నిధుల సేకరణ ఉద్యమంలో తన ఆభరణాలు, భూములను విరాళంగా ఇచ్చి ఉదారతను చాటుకున్నారు. 1936 ఏప్రిల్ 1న ఒడిశా శాసనసభకు మొదటి మహిళగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. 1986 అక్టోబరు 4న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారత రాజ్యాంగ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
2. ఇజ్రాయెల్ దేశ రాజధాని ఏది?
3. యోగి ఆదిత్యానాథ్ ప్రస్తుతం ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు?

జవాబులు : 1. నవంబరు 26; 2. జెరూసలెం; 3. ఉత్తరప్రదేశ్

## మెదడుకు మేత

ఆకాశంలో ఎగురుతాను, గాలిని భోంచేస్తాను, తోక ఉంది. కానీ కోతిని కాదు.. నేనెవరిని?

జవాబు : గాలిపటం



వాటితోపాటు నక్క కూడా పరుగెత్తింది. చాలా దూరం పరుగెత్తాక నక్క అలసటతో "ఇంక నా వల్ల కాదు. నేను పరుగెత్తలేను. ఇంతకూ ఆ జంతువు ఏమిటి?" అని అడిగింది.

"అదా! అది పెద్ద గండు చీమ. నావైపే వస్తుంటే నన్నేం చేస్తుందోనని భయపడ్డాను" అని చెప్పింది చీమ.

ఎలుక, కుందేలు, నక్కకు కోపం వచ్చి గండుచీమ మమ్మల్ని తింటుందా? అనవసరంగా భయపెట్టావు" అని కళ్లెర్ర చేసాయి.

"నన్ను తింటుందని చెప్పాను. మిమ్మల్ని తింటుందన్నానా?" అంది చీమ.

నిజమే కదా అనుకున్నాయి, ఎలుక, కుందేలు, నక్క. ★

## మంచిమాట



**మంచికోసం చేసే పోరాటంలో ఓడిపోయినా.. అది విజయమే అవుతుంది!!**

– ఏపీజే అబ్దుల్ కలాం




# వారఫలాలు

04-10 డిసెంబర్ 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054




**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటారు. సమాజంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. నూతనోత్సాహంతో కొన్ని కార్యక్రమాలు చేపడతారు. రాబడి సంతృప్తినిస్తుంది, కొన్ని రుణబాధలు తొలగుతాయి. వ్యాపారులు లాభాలను గడిస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులకు మరింత ప్రోత్సాహం. క్రీడాకారులు, పరిశోధకుల యత్నాలు సఫలం. 4,5 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.



**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

మొదట్లో ఇబ్బందిపడినా ఆదాయం క్రమేపీ వృద్ధి చెందుతుంది. అనుకున్న కార్యక్రమాలు ఎట్టకేలకు పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. వ్యాపారస్తులకు భాగస్వాముల నుంచి మరింత చేయూత అందుతుంది. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొత్త అవకాశాలు లభిస్తాయి. క్రీడాకారులకు విశేష గుర్తింపు లభిస్తుంది. 5,6 తేదీల్లో దూరప్రయాణాలు. రుణఒత్తిడులు. లక్ష్మీనృసింహస్తోత్రాలు పఠించండి.



**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. మీ ప్రతిపాదనలు అందరూ ఆమోదిస్తారు. ఆభరణాలు, గృహోపకరణాలు కొంటారు. దైవకార్యాలలో పాల్గొంటారు. గృహ నిర్మాణాల్లో అవాంతరాలు తొలగుతాయి. నూతన ఉద్యోగయోగం. వ్యాపారులకు భాగస్వాములతో అగ్రిమెంట్లు. రచయితలు లక్ష్యాలు సాధిస్తారు. 7,8 తేదీలలో వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

అనుకున్న కార్యక్రమాలలో అవాంతరాలు నెలకొంటాయి. మీ పట్ల విధేయులుగా ఉన్నవారు సైతం వ్యతిరేకత చూపే అవకాశం. విద్యావకాశాలు నిరుత్సాహపరుస్తాయి. కష్టానికి ఫలితం కనిపించదు. వ్యాపారస్తులు కొంత ఆచితూచి వ్యవహరించాలి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొంత గందరగోళంగా ఉంటుంది. రచయితలకు కొత్త సమస్యలు. 9,10 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలబ్ధి. అంగారక స్తోత్రాలు పఠించండి.



**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆదాయం అవసరాలకు తగినంతగా సమకూరుతుంది. కొన్ని సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు. ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. స్థిరాస్తి వివాదాలు చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు రావచ్చు. పారిశ్రామికవేత్తలకు శుభవార్తలు. రచయితలు, పరిశోధకులకు నూతనోత్సాహం. 4,5 తేదీల్లో వృథా ఖర్చులు. శివాష్టకం పఠించండి.



**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

వివాహాది వేడుకలు కొన్ని నిర్వహిస్తారు. ఆదాయం సంతృప్తినిచ్చి అప్పులు సైతం తీరతాయి. వ్యాపారస్తులు అనూహ్యమైన రీతిలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. రచయితలు, కళాకారులు విశేష ఆదరణ లభిస్తుంది. 7,8 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితులతో వివాదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.



**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆదాయం అవసరాలకు తగినంతగా లభిస్తుంది. కొత్త కార్యక్రమాలు చేపట్టి సమయానికి పూర్తి చేస్తారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. నూతన ఉద్యోగాలు లభిస్తాయి. రచయితలు, క్రీడా కారులు అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. 8,9 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. మనశ్శాంతి లోపిస్తుంది. దుర్గా స్తోత్రాలు పఠించండి.



**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న కార్యక్రమాలను పూర్తి చేసే వరకూ విశ్రమించరు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారస్తులు పెట్టుబడుల అన్వేషణలో విజయం సాధిస్తారు. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు సత్తా నిరూపించుకుంటారు. రచయితలకు సంతోషకరమైన సమాచారం. 6,7 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. మానసిక అశాంతి. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.



**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కష్టానికి ఫలితం అందుకుంటారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులకు అనుకూల సమయం. 4,5 తేదీల్లో బంధువుల నుంచి ఒత్తిళ్లు. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.



**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఇంతకాలం ఎదుర్కొన్న శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్త కాంట్రాక్టులు కొన్ని దక్కించుకుంటారు. వ్యాపారస్తులకు లాభాలు ఉత్సాహాన్నిస్తాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 7,8తేదీల్లో వృథా ఖర్చులు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు.



**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కొత్త కార్యక్రమాలు చకచకా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. ఇంట్లో శుభకార్యాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు. వ్యాపారులకు ఒత్తిడులు తొలగుతాయి. రచయితలు, క్రీడాకారులకు అన్నింటా అనుకూలత. 8,9 తేదీల్లో అనారోగ్యం. దూరప్రయాణాలు. గణేశ్ స్తోత్రాలు పఠించండి.



**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మీ ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. ఇంతకాలం పడిన కష్టం ఫలించి ముందడుగు వేస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. వాహనాలు, భూములు కొనుగోలు యత్నాలలో పురోగతి. వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో సమకూరతాయి. రాజకీయవేత్తలకు మరింత ఉత్సాహం. క్రీడాకారులు, వైద్యులకు ఆహ్వానాలు అందుతాయి. 9,10 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్వల్ప అనారోగ్యం. కాలభైరవ అష్టకం పఠించండి.

# పదరసం-442



పదరసం – 442

పేరు : ..................................................................................

చిరునామా:..................................................................................

..................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................

## ఆధారాలు

**అడ్డం**

1) సమయ సందర్భాలకి తగినట్లు మాట్లాడడం, పనిచెయ్యడం (5)
5) దీనికి పెత్తనమిస్తే తలంతా గొరిగిందిట (2)
7) హోమం చివర చేసే అగ్నిసమర్పణ (4)
9) గ్రాంధికంలో కళలు ఇన్ని (4)
10) తిరగబడ్డ అమరశిల్పి (3)
12) తోడల్లుడు (4)
14) ధాన్యపు గింజలగుత్తి, వెన్ను (2)
18) మరీచికలు (5)
19) ఇంతకుముందు, గతంలో (3)
21) అచ్చుపోసినఎద్దు (3)
23) పుట్టకొక్కు (5)
26) శక్తి, బలంలాంటిది (2)
27) బ్రహ్మ (3)
28) క్రిముల కదలికలు, అంతర్గత విభేధాలు (5)

**నిలువు**

1) చప్పుడు, జాడ (2)
2) పంచాంగాలలో కనిపించే "మొదలు / నుండి" సరిగా లేదు (4)
3) అరవై ఏళ్ళ ఉత్సవం పైకొచ్చింది(4)
4) ఆజ్ఞ ఆదేశం తలక్రిందులైంది(2)
6) పన్నెండు సరిగా లేవు (3)
8) భక్త కన్నప్పగా మారినవాడు (3)
11) నాటకాలలో ఒక ఘట్టం (2)
13) పైకి పెరిగిన బంగాళ దుంప (4)
15) నందూరివారి అచ్చ తెలుగుపాత్ర పైకొచ్చింది (2)
16) మంత్రి (4)
17) వళ్ళు పొగరు, మదం (5)
19) దిగితే కాని తెలియదంటారు (2)
20) భూదేవి కొడుకు, దుర్మార్గుడు తలక్రిందులయ్యాడు (4)
22. దోమకాటు వలన వచ్చే కాళ్ళవాపు (4)
24. ఘర్షణ (3)
25. భయం (3)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 డిసెంబర్ 18 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

### పదరసం - 438 సమాధానాలు



**విజేతలు:** వి.శివలాస్య, చెరుకు మహేశ్వరశర్మ, చింతకుంట దేవలక్ష్మి, టి.వెంకాయమ్మ, టి.రామలింగయ్య, కె.ప్రశాంత్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, కొండేపూడి శంకర్‌రావు, నేమాజి బాలశైలజ, జి.ఆర్.కె.రెడ్డి, కె.వి.రమణమూర్తి, టి.విశ్వనాథ్, పున్నమరావు వెంకట సుబ్బారావు, పులికంటి రాజేశ్వరరావు, పి.సీతామహాలక్ష్మి, దర్వాత్ సుధాకర్ నాయక్, కుచ్చుల కంటి సాయికిరణ్, కె.అచ్యుతరావ్ ప్రసాద్, భాగవతుల రామచంద్రమూర్తి, కాశీభట్ల రామచంద్ర, బి.ఇందుశేఖర్, వేదాంతం పద్మారంగనాథ్, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, వై.రాధాకిషన్, కె.అల్లీరాణి, వి.అనుపమ మూర్తి, ఎస్.భాగ్యశ్రీ, చింతలకుంట్ల దేవలక్ష్మి, నాగుల రాజేందర్‌గౌడ్, నాయని రాములు, పి.శాంతికుమారి, మత్స్యరాజ విజయలక్ష్మి **ఈ వారం విజేత : రుద్రభట్ల సుగుణ రాజారాం**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.220/-



వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.250/-



వెల : ₹.250/-



వెల : ₹.360/-



వెల : ₹.100/-


వెల : ₹.200/-



వెల : ₹.100/-



వెల : ₹.150/-



వెల : ₹.799/-



వెల : ₹.499/-



వెల :₹.495/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2, దూరవాణి : 8333812687



# రామమందిరం కాదు అయోధ్య రైల్వే స్టేషన్

అయోధ్యలో భవ్యరామమందిరంతో పాటే అక్కడి రైల్వే స్టేషన్ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటోంది. ఇతర స్టేషన్‌లకు భిన్నంగా మందిర ఆకారంలో నిర్మితం కావడం ఓ ప్రత్యేకత. వచ్చే జనవరి 22న శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ స్టేషన్‌నూ ప్రారంభిస్తారని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. 149 ఏళ్ల క్రితం (1874) నిర్మితమైన ఈ రైల్వే కూడలిలో మూడు ప్లాట్ ఫారాలు ఉన్నాయి. పునరుద్ధరణలో భాగంగా వాటి సంఖ్యను పెంచుతున్నారు. ఒక ప్లాట్ ఫారం నుంచి మరో దానికి సులువుగా మారేందుకు అనుసంధాన వంతెనలను మెరుగుపరుస్తున్నారు. ఈ కొత్త స్టేషన్ భవన సముదాయం మూడంతస్తులు కలిగి ఉంటుంది. స్టేషన్‌లో 12 లిఫ్టులు, 14 ఎస్కలేటర్లు, 6 మీటర్ల వెడల్పు గల రెండు ఓవర్ బ్రిడ్జిలు తయారవుతున్నాయి. వచ్చేపోయే ప్రయాణికులకు ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. షాపింగ్ మాల్స్, ఫలహారశాలలు, వినోద సౌకర్యాలు ఏర్పాటవుతున్నాయి. సామానుభద్ర పరచుకునే గదులు ఉంటాయి. పార్కింగ్ సదుపాయం కల్పిస్తునఢ్నారు. ఈ కూడలి నుంచి రోజూ కనీసం 50 వేల మంది రాకపోకలు సాగిస్తారని అంచనా.








From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 04

